www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



2

'తెలుగు'లో తడబాటు

- మాతృభాషలోనే ఎక్కువమంది ఫెయిల్
- హిందీ, ఇంగ్లిష్‌ల్లో మాత్రం అత్యధిక ఉత్తీర్ణత
- ఆసక్తి కలిగిస్తున్న టెన్త్ ఫలితాలు

వారంలో 5.20 లక్షల మందికి

వెంకన్న దర్శనం

ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన క్యూలైన్ల నిర్వహణతో సాధ్యం



3

మంగళవారం | 5-5-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 24 సంచిక (Issue) : 58 | శ్రీ పరాభవ నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: చవితి పూర్తి, నక్షత్రం: జ్యేష్ఠ మ.12:55 తదుపరి మూల, వర్జ్యం: రా.9:54-11:42, దుర్ముహూర్తం: ఉ.8:23-9:14, పునః రా.10:14-10:58, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:50, సూర్యాస్తమయం: 6:33, | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మోదీ

మమత కంచుకోటలో | తమిళ జన నాయగన్

కమలం విజయం

అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పెను సంచలనాలు

- జెన్‌జీ యువత, మహిళలు రచించిన విజయాలు
- తమిళనాట అతి పెద్ద పార్టీగా విజయ్ టీవీకే
- డీఎంకేకు పరాభవం.. అన్నాడీఎంకేకు 3వ స్థానం
- ద్రవిడ సిద్ధాంతం స్థానంలోకి ప్రజాకర్షక మంత్రం
- బెంగాల్లో మమతా బెనర్జీని చిత్తు చేసిన బీజేపీ
- హిందూ ఏకత, ముస్లిముల్లో చీలిక వ్యూహం సక్సెస్
- దక్షిణ బెంగాల్లో కొన్నిచోట్ల బీజేపీకి ముస్లింల మద్దతు
- ఉచిత వరాలతో కమలానికి ఓటెత్తిన మహిళలు
- ఎమ్మెల్యే సీట్లలోనూ స్టాలిన్, మమత పరాజయం
- వంద చోట్ల ఓట్ చోరీ.. ఇది అనైతిక విజయం: దీదీ
- కేరళంలో ఎల్డీఎఫ్‌కు దెబ్బ.. యూడీఎఫ్‌దే గెలుపు
- అసోంలో హిమంత బిశ్వ శర్మ హ్యాట్రిక్
- పుదుచ్చేరిలో మళ్లీ ఎన్డీయేదే అధికారం

మూడు ప్రధాన రాష్ట్రాల్లో అధికార పార్టీల ఓటమి

ఎన్నికల ఫలితాలు ఇలా..

పార్టీ	సీట్లు	ఓట్ల%
పశ్చిమ బెంగాల్ (293)		
బీజేపీ	206	46
టీఎంసీ+	81	41
ఇతరులు	6	13
తమిళనాడు (234)		
టీవీకే	107	35
డీఎంకే+	74	32
అన్నాడీఎంకే+	53	27
కేరళ (140)		
యూడీఎఫ్	102	43
ఎల్డీఎఫ్	35	33
ఎన్డీయే	3	11
అసోం (126)		
బీజేపీ+	102	51
కాంగ్రెస్+	21	36
ఇతరులు	3	13



పార్టీ గెలుపు తర్వాత కార్యకర్తలకు అభివాదం చేస్తున్న విజయ్

టీవీకే సంచలన విజయంపై ఆ పార్టీ అధినేత విజయ్ స్పందించలేదు. ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పుడు గానీ.. ఫలితాలు వెలువడ్డాక గానీ ఆయన మీడియాతో మాట్లాడలేదు. ఆయన తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ మాత్రమే మాట్లాడారు. పోటీచేసిన 2 స్థానాల్లోనూ గెలిచిన విజయ్.. ఎమ్మెల్యేగా ఎన్నికైనట్టు ధ్రువపత్రం తీసుకోవడానికి పెరంబూర్ కౌంటింగ్ కేంద్రానికి వచ్చారు. అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ లోపలకు వెళ్లారు. ఆ తర్వాత తన తండ్రి ఇంటికి చేరుకుని.. బాల్కనీ నుంచి కింద ఉన్న టీవీకే కార్యకర్తలకు అభివాదం చేశారు.

గంగోత్రి నుంచి గంగాసాగర్ దాకా దేశంలో ప్రతిచోటా కమలం వికసిస్తోంది. గంగామాత ప్రవహిస్తున్న ప్రతిచోటా బీజేపీ-ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ సుపరిపాలన రాజకీయాలు ఘనవిజయం సాధించాయి. ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. వారి కలల్ని, ఆకాంక్షలను నెరవేరుస్తాం. ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. తమిళనాడు, కేరళలో విజయం సాధించిన పార్టీలకు అభినందనలు. ఆ రాష్ట్రాల అభివృద్ధికి మా సహకారం కొనసాగుతుంది.

- ప్రధాని నరేంద్రమోదీ

ప్రజావ్యతిరేక విధానాలకు

ఫలితం ఇదే!

- పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళలో అధికార పార్టీల ఓటమికి కారణమదే 2
- అధికారాన్ని ప్రజాక్షేమానికి వినియోగించాలి
- లేకుంటే ఎన్నికల్లో ఫలితాలు ఇలాగే ఉంటాయి
- ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు బాధ్యతతో ఉండాలి
- మంత్రులతో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

సినిమాల్లో ఆయన 'మాస్టర్'! అభిమానులను 'ఖుషీ' చేశారు! తన నటనతో 'అదిరింది' గురూ అనిపించుకున్నారు! రాజకీయాల్లోకి అడుగు పెడుతూనే 'విజిల్' వేశారు! అరంగేట్రంతోనే ద్రవిడ పార్టీలను మట్టి కరిపించి 'బీస్ట్' అనిపించుకున్నారు! అభిమానులకే కాదు.. తమిళ ప్రజలకే 'జన నాయగన్'గా మారారు! తమిళనాట కొత్త చరిత్ర లిఖిస్తూ రేపో మాపో 'సర్కార్' ఏర్పాటు చేయనున్నారు! ఆయనే.. తమిళనాడుకు కాబోయే ముఖ్యమంత్రి దళపతి విజయ్!

అది ఒకప్పుడు కమ్యూనిస్టుల కోట! దశాబ్దాలపాటు వాళ్లే అప్రతిహతంగా రాజ్యమేలారు! దశాబ్దంన్నరగా మమతా బెనర్జీకి కంచుకోటగా మారింది! ఆ సమయంలో పంచాయతీలోనైనా కాషాయ జెండా ఇక్కడ ఎగరడమే గగనమని అనుకున్నారంతా! కానీ, కమ్యూనిస్టుల పతనం ఇక్కడ కాషాయానికి ఊపిరిపోసింది! 2016లో కేవలం మూడు సీట్లతో ప్రారంభమైన బీజేపీ.. ఇప్పుడు ఏకంగా 206 సీట్లతో సర్కారు ఏర్పాటుకు సిద్ధమైంది! తూర్పున కూడా కాషాయోదయంతో కమలం విరిసింది!!

భారతదేశ రాజకీయ, ఎన్నికల చరిత్రలో నిలిచిపోయే రెండు సందర్భాలివి!

పరాజయ బాధితులు..



మమత



స్టాలిన్



విజయన్


పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడు వరకు భారతదేశానికి తూర్పుతీరం.. ఇందులో కింద తమిళనాట కొత్త 'తార' ఆవిర్భవిస్తే.. పైన పశ్చిమ బెంగాల్లో కొత్త శకం మొదలైంది! ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు సరికొత్త చరిత్రను లిఖించారు! 4 దశాబ్దాల కిందటి టీడీపీ విజయాన్ని తలపించేలా.. సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ ప్రారంభమైన రెండేళ్లలోనే అసెంబ్లీ ఎన్నికల్లో పెను సంచలనం సృష్టించింది! తమిళనాడు అసెంబ్లీ (234 సీట్లు) ఎన్నికల్లో 107 స్థానాలతో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది! టీవీకేకు మద్దతు ఇచ్చేందుకు చిన్న పార్టీలు సుముఖత చూపుతున్న నేపథ్యంలో ఆ పార్టీ అధ్యక్షుడు జోసెఫ్ విజయ్ సీఎం కావడం లాంఛనమే! ఇక, పశ్చిమ బెంగాల్లో అధికార పగ్గాలు చేపట్టాలన్న కలను బీజేపీ ఎట్టకేలకు నెరవేర్చుకుంది! ఇక్కడి అసెంబ్లీలో 294 స్థానాలు ఉండగా.. బీజేపీ ఏకంగా 206 సీట్లలో విజయ దుందుభి మోగించింది. మమతా బెనర్జీని మట్టి కరిపించిన సువేందు అధికారి ఇక్కడ సీఎం రేసులో ముందు వరుసలో ఉన్నారు! అర్ధ శతాబ్దంపాటు వామపక్షాలు, టీఎంసీ ఏలిన బెంగాల్లో తొలి సారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది! ఇక, కేరళంలో

మిగతా 9వ పేజీలో...

2 స్థానాల్లోనూ విజయ్ భారీ గెలుపు

సమగ్ర కథనాలు 9, 10, 11, 12, 13, 14లో

విజయ సారథులు



సువేందు



హిమంత



సతీశన్

దళపతికి మద్దతు ఎవరు?

- తమిళనాడులో మ్యాజిక్ ఫిగర్ 118
- కూతవేటు దూరంలో ఆగిన టీవీకే
- డీఎంకే, అన్నాడీఎంకేలతో కలవబోమన్న విజయ్
- కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీఎండీకేల మద్దతు కోసం చర్చలు
- నేడు స్పష్టత?
- విజయ్, త్రిషలకు సినీ ప్రముఖుల అభినందనల వెల్లువ

వెరీ హ్యాపీ బర్త్‌డే..



తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల వచ్చిన త్రిష. తర్వాత ఆమె విజయ్ ఇంటికి వెళ్లి అభినందించారు

ఫైటర్ జెట్స్.. మేడిన్ ఏపీ

- పుట్టపర్తిలో యుద్ధ విమాన తయారీ ప్లాంట్
- 600 ఎకరాల్లో ఏర్పాటుకు డీఆర్‌డీవో ప్రతిపాదన
- రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టే అవకాశం
- ప్లాంట్‌లో 140 ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీ
- ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం





అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో భారీ పెట్టుబడులతో ఏపీ దూసుకుపోతోంది. రాష్ట్రంలో మన దేశ ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ల తయారీకి రంగం సిద్ధమవుతోంది. ఈ యుద్ధవిమానాల తయారీ కేంద్రాన్ని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 600 ఎకరాల్లో ఏర్పాటు చేస్తారు. దీనికి సంబంధించిన

మిగతా 2వ పేజీలో...

అమరావతికి రాజమార్గం!



- అద్దంకి నుంచి 92 కి.మీ. మేర హైస్పీడ్ యాక్సెస్ కంట్రోల్ రోడ్డు
- బెంగళూరు, చెన్నైలకు వేగంగా చేరుకునేలా ఎన్‌హెచ్ 16 విస్తరణ
- 6 నుంచి 12 లేన్లకు విస్తరించే చాన్స్
- నాలుగైదు చోట్లే ఎంట్రీ, ఎగ్జిట్లు
- టూ వీలర్లు, ఆటోలకు నో ఎంట్రీ
- రెండేళ్లలో పూర్తే లక్ష్యం

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర రాజధాని అమరావతితో దేశంలోని ప్రధాన నగరాల అనుసంధానానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. దక్షిణాదిలో ముఖ్య నగరాలైన చెన్నై, బెంగళూరుల నుంచి వేగంగా చేరుకునేందుకు హైస్పీడ్ యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆ రెండు ప్రధాన నగరాల నుంచి వచ్చే వాహనాల ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రకాశంజిల్లా అద్దంకి నుంచి అమరావతి వరకూ 92 కి.మీ. మేర

మిగతా 2వ పేజీలో...

పాలన నచ్చితే ప్రజలే గెలిపిస్తారు!

» లేదంటే వారే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారు

» గెలిచిన పార్టీలకు డిప్యూటీ సీఎం పవన్ శుభాకాంక్షలు



అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): పాలన నచ్చితే ప్రజలు మళ్లీ గెలిపిస్తారని, లేకుంటే నిర్దాక్షిణ్యంగా ఓడిస్తారనేందుకు తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే ఉదాహరణ అని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నాలుగు రాష్ట్రాలు, ఒక యూటీ ఎన్నికల్లో గెలుపొందిన వారికి ఆయన సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. "తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రజలు మార్పును బలంగా కోరుకున్నారు. అస్సాం, పుదుచ్చేరిలో బీజేపీ తమ ప్రాభవాన్ని నిలబెట్టుకుని, పశ్చిమ బెంగాల్‌లో ప్రజల మనసును గెలుచుకుంది. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే బెంగాల్ సురక్షితంగా, సుభిక్షంగా ఉంటుందన్న గట్టి విశ్వాసంతో ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారు" అని పవన్ పేర్కొన్నారు. పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్ నేత, సీఎం రంగసామికి శుభాకాంక్షలు చెప్పారు. తమిళనాడు, కేరళ ప్రజలు మార్పును కోరుకున్నారని పవన్ అన్నారు. పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే చక్కటి విజయం సాధించిన విజయ్‌కు, కేరళలో గెలిచిన యూడీఎఫ్ కూటమి నాయకులను అభినందించారు.

విజయ్, బీజేపీకి శుభాకాంక్షలు: జగన్

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై వైసీపీ అధ్యక్షుడు జగన్ సోమవారం 'ఎక్స్'లో స్పందించారు. తొలిసారి ఎన్నికల రంగంలోకి దిగి, తమిళనాడులో అతిపెద్ద పార్టీగా నిలిచిన టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్‌కు అభినందనలు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో ఓటమిపాలైన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి సానుభూతి తెలిపిన ఆయన.. పశ్చిమబెంగాల్ సహా అస్సాం, పుదుచ్చేరిలో విజయం సాధించిన బీజేపీకి శుభాకాంక్షలు తెలిపారు.

మోదీపై ప్రజలకు విశ్వాసం పెరిగింది: బీజేపీ

అమరావతి, శ్రీకాళహస్తి, మే 4(ఆంధ్రజ్యోతి): దేశం కోసం నిరంతరం శ్రమిస్తోన్న ప్రధాని మోదీపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగిందని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్య కుమార్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అభిప్రాయపడ్డారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళం, పుదుచ్చేరి ఎన్నికల ఫలితాలతో విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ.. 'మోదీ పాలనలో దేశ భద్రతపై ఉన్న నమ్మకమే అసోమ్, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ విజయానికి కారణమైంది. అసోమ్, పుదుచ్చేరి ప్రజలు మరోమారు బీజేపీని గెలిపించడం అక్కడి పాలనకు నిదర్శనం' అని పేర్కొన్నారు.

పశ్చిమ బెంగాల్‌లో గెలుపు దేశాభివృద్ధికి మలుపు: మాధవ్

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ గెలుపొందడం దేశాభివృద్ధికి మరింత దోహదపడుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో సోమవారం బీజేపీ విజయోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బెంగాల్‌లో బీజేపీ గెలుపుతో ఆ రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతమవుతుందని మాధవ్ పేర్కొన్నారు.

నేడు పాలిసెట్ ఫలితాలు

అమరావతి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-2026 ఫలితాలను ఉన్నత విద్యాశాఖ మంగళవారం ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. డిప్లొమా కోర్సుల అడ్మిషన్ల కోసం ఏప్రిల్ 25న రాష్ట్రవ్యాప్తంగా పాలిసెట్ పరీక్ష నిర్వహించారు.

సివిల్స్ విజేత హర్షితకు 'స్వాగ్' స్వాగతం



గుర్రపు బండిపై తల్లిదండ్రులతో హర్షిత

విజయవాడ, మే 4(ఆంధ్రజ్యోతి): సివిల్స్ విజేతతో పాటు ఆమె తల్లిదండ్రులను పోలీసు అధికారులు గుర్రపుబండిపై ఊరేగించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. విజయవాడలో ట్రాఫిక్-3 ఇన్‌స్పెక్టర్ మేడర సుధాకర్ కుమార్తె హర్షిత సివిల్స్‌లో 520వ ర్యాంకు సాధించారు. ఈ నేపథ్యంలో సుధాకర్ కుమార్తె విజయంపై ఆయన సహచరులు సంబరాలు చేశారు. హర్షితతోపాటు తండ్రి సుధాకర్, తల్లి చంద్రలీలను గుర్రపు బండిపై వీధుల్లో ఊరేగించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

మట్టిలో మాణిక్యాలకు విమానయోగం!

నందిగామ, మే 4(ఆంధ్రజ్యోతి): మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలన్న ఉద్దేశంతో.. ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలి ఏడాది నుంచే ఆమె తన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు విమానం ఎక్కే అవకాశం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన కంచికచర్ల మండల విద్యార్థి ఎనికె అర్జున్ (589 మార్కులు), నందిగామ మండల విద్యార్థి ప్రజాపతి ప్రదీప్ (576), వీరులపాడు మండల విద్యార్థి స్వరం వర్షిత (571), ముప్పాళ్ల గురుకుల పాఠశాల విద్యార్థి పల్లెపోగు వెన్నెల (567), చందర్లపాడు మండల విద్యార్థి నారిశెట్టి జగదీశ్ ఆదిత్య (559), నందిగామ విద్యార్థి ఉప్పులూరి సోనీప్రియ (549)లను ఈ యాత్రకు ఎంపిక చేశారు. మంగళవారం ఉదయం తంగిరాల సౌమ్యతో కలిసి ఈ విద్యార్థులు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు విమాన ప్రయాణం చేయనున్నారు.

బంగ్లా డిప్యూటీ హైకమిషనర్‌తో 'ఏపీ చాంబర్స్' భేటీ

అమరావతి, మే 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్ మహ్మద్ అమీనుజ్జామాన్‌తో ఏపీ చాంబర్స్ ప్రతినిధులు చర్చలు జరిపారు. చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం విజయవాడ పర్యటనకు వచ్చిన బంగ్లా డిప్యూటీ హైకమిషనర్‌ను కలిసి ఏపీ-బంగ్లాదేశ్ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతం చేయడంపై చర్చించారు. రాష్ట్రం నుంచి మసాలా దినుసులు, రొయ్యలు, మిర్చి, పసుపు, పండ్లు, ఆకుకూరలు, తృణధాన్యాలు, పత్తి, నూలు ఎగుమతులు, వాణిజ్య విస్తరణకు సహకరించాలని కోరారు.

'తెలుగు'లో తడబాటు

మాతృభాషలోనే ఎక్కువమంది ఫెయిల్

ఆసక్తి కలిగిస్తున్న టెన్త్ ఫలితాలు

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): ఈసారి పదో తరగతి ఫలితాలు ఆసక్తి కలిగిస్తున్నాయి. మాతృభాష తెలుగులో ఎక్కువమంది విద్యార్థులు తడబడటం, పరాయి భాషలు హిందీ, ఇంగ్లిష్‌లో మాత్రం ఉత్తీర్ణతశాతం ఎక్కువ ఉండటం ఆశ్చర్యం కలిగిస్తున్న పరిణామం. సబ్జెక్టుల్లో సైన్సు అత్యధిక విద్యార్థులకు సవాల్‌గా మారింది. ఎక్కువమంది ఈ సబ్జెక్టులో ఫెయిల్ కావడమో లేక తక్కువ మార్కులు స్కోర్ చేయడమో జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు 6,17,827 మంది రాయగా, 5,26,677 మంది ఉత్తీర్ణులయ్యారు. 91,150 మంది.. ఫెయిల్ అయ్యారు. వీరిలో మాతృభాష తెలుగులోనే ఎక్కువ మంది డుమ్కీ కొట్టారు. దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ పట్ల సాధారణంగా శ్రద్ధ తక్కువ. ఇంగ్లీష్ అంటే మన విద్యార్థులకు క్లిష్టంగా భావిస్తారు.అయితే ఈ రెండింటిలోనూ తక్కువ మంది ఫెయిల్ కావడం గమనార్హం. సైన్స్‌లో 54,272 మంది (59.5 శాతం), సోషల్ 38,066(41.80), మ్యాథ్స్ 39,722(43.60) మంది ఫెయిల్ అయ్యారు. ఇక ఇంగ్లీష్‌లో 8,771 మంది(9.6 శాతం), హిందీ 1,436 (1.6 శాతం) మంది ఉత్తీర్ణులు కాలేదు. తెలుగులో అత్యధికంగా 37,679(41.3 శాతం) మంది ఫెయిల్ అయ్యారు. వీరిలో బాలికల కంటే బాలురే ఎక్కువగా ఉన్నారు. 82.68 శాతం మంది బాలురు పాస్ కాగా, బాలికలు 87.9 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక.. 573 మంది (0.6శాతం) అన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు. 3,514 మంది(3.9 శాతం) ఐదు సబ్జెక్టులు, 8,268 మంది (9.1శాతం) నాలుగు సబ్జెక్టులు, 12,938 మంది(14.2 శాతం) మూడు సబ్జెక్టులు, 21,195 మంది (23.3 శాతం) రెండు సబ్జెక్టులు, 44,662 మంది (49 శాతం) ఒక సబ్జెక్టు ఫెయిల్ అయ్యారు.

కొరత లేకుండా మంచినీటి సరఫరా

జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి కేటాయిస్తున్నాం.. 24 గంటల్లోనే వాహనాల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి

» అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా డీలర్లు

» ప్రభుత్వ సేవల్లో ఏఐ వినియోగం పెంచాలి

» కలెక్టర్లు, ఉన్నతాధికారులకు సీఎం ఆదేశం



ఆర్‌టీజీఎస్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): ఈ వేసవికాలంలో రాష్ట్రంలో మంచినీటి కొరత రాకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మంచి నీటి సరఫరా కోసం ప్రతి జిల్లాకు ప్రత్యేకంగా రూ. కోటి చొప్పున విడుదల చేయాలని సీఎస్ జి.సాయిప్రసాద్‌ను ఆదేశించారు. సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, అధికారులు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులతో సీఎం సమావేశమయ్యారు. మంచి నీటి సరఫరాకు ప్రాధాన్యం ఇవ్వాలని, జిల్లాల్లో బోర్లు కూడా మరమ్మతులు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో వాహనాల రిజిస్ట్రేషన్లను మరింత సరళీకృతం చేయాలని రవాణాశాఖకు సీఎం సూచించారు. వాహన డీలర్లను అదనపు రిజిస్ట్రేషన్ అథారిటీగా గుర్తించేందుకు అనుమతిని ఇచ్చారు. వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 24 గంటల్లో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వం అందించే పౌర సేవల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం పెంచేందుకు వీలుగా నిపుణులతో కూడిన సలహామండలిని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో డ్రోన్ల వినియోగం పెంచేలా ఓ వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. అవేర్ సాంకేతికతను వినియోగించుకుని వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. తీవ్ర ఉష్ణోగ్రతలు నమోదవుతున్న ప్రాంతాల్లో వడగాడ్పులకు గురికాకుండా ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థల సేవలను తీసుకోవాలని చెప్పారు. అత్యవసర సేవలు మినహా అన్నీ ఆన్‌లైన్‌లోనే చేయాలన్నారు. ప్రభుత్వ శాఖల సేవలు సులువుగా అందించేందుకు, కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా ఉండేందుకు ఈ ఆన్‌లైన్ సేవలు పెంచాలని నిర్దేశించారు. పంటలకు ధర కల్పించే విషయంలోనూ రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని, ఎప్పటికప్పుడు మార్కెట్ ధరలను విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలతో సత్సంబంధాలు కూడా అవసరమని, కార్యదర్శుల స్థాయి అధికారులు నెలలో మూడు రోజులు, హెచ్‌ఓడీలు ఆరు రోజులు, కలెక్టర్లు ఎనిమిది రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించేలా అత్యుత్తమ విధానాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపితే అత్యుత్తమ ఫలితాలు వస్తున్నాయని చెప్పారు.

పారిశ్రామిక క్లస్టర్లకు లాజిస్టిక్స్ కనెక్టివిటీ

రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆర్టీజీఎస్ నుంచి ప్రొడక్ట్ పర్ఫెక్షన్ క్లస్టర్లపై సమీక్ష నిర్వహించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్ల పరిధిలో అభివృద్ధి చేయనున్న పారిశ్రామిక క్లస్టర్ల గురించి చర్చించారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈల్లోని ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలతో తయారు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో తయారయ్యే ఉత్పత్తులను స్థానిక, ప్రాంతీయ, దేశవిదేశీ మార్కెట్లకు చేర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశ్రామిక క్లస్టర్లకు రోడ్డు, రైల్వే, పోర్టు కనెక్టివిటీ ఉండేలా లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ మ్యాపింగ్ చేయాలని చెప్పారు.

పారిశ్రామిక క్లస్టర్ వద్ద టౌన్‌షిప్‌లు

ప్రతి పారిశ్రామిక క్లస్టర్ వద్ద ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్ ప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా ఎంఎస్ఎంఈల స్థాపనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో ఉండాలని నిర్దేశించారు. పారిశ్రామిక క్లస్టర్లలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించాలని చెప్పారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్ జరగాలన్నారు. యూనివర్సిటీల్లోనూ నైపుణ్య కోర్సులను హైబ్రిడ్ విధానంలో అందించే ఆలోచన చేయాలని సూచించారు.

'భోజనం'లో రాగిజావ మరో మూడేళ్లు

» లోకేశ్ సమక్షంలో శ్రీసత్యసాయి ట్రస్ట్‌తో ఒప్పందం



ఒప్పంద పత్రాలతో మంత్రి లోకేశ్, ఆర్‌జే రత్నాకర్ తదితరులు

అమరావతి, పుట్టపర్తి, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు అదనపు పోషకాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రస్తుతం శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో అమలు చేస్తున్న రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మరో మూడేళ్లు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 2026-29 కాలానికి విద్యార్థులకు రాగిజావ పంపిణీని కొనసాగించేందుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ (అవగాహన ఒప్పందం) కుదుర్చుకుంది. ట్రస్ట్ సహకారంతో రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు రాగి జావ పంపిణీని 2023, మార్చిలో ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 44 వేల పాఠశాలల్లో దాదాపు 33 లక్షల మంది విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ అడ్మిన్ కో-ఆర్డినేటర్ ఎస్.జి.చలం, శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఏపీ విభాగం అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావుతోపాటు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి రాజమార్గం!

(మొదటి పేజీ తరువాయి)

హైస్పీడ్ యాక్సెస్ కంట్రోల్ హైవేగా మారుస్తున్నారు. ఈ హైవేను రెండేళ్లలో పూర్తిచేసే లక్ష్యంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అడుగులు వేస్తున్నారు. అవసరమైన భూమి అందుబాటు, సేకరణ తదితర అంశాలకు సంబంధించి రెవెన్యూ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. అమరావతికి ఇప్పటికే చెన్నై-కోల్‌కతా హైవే (ఎన్‌హెచ్-16)లో నిర్మించిన విజయవాడ వెస్ట్‌బైపాస్‌తో నేరుగా చెన్నైకి కనెక్టివిటీ ఏర్పడింది. ఎన్‌హెచ్ 65 ద్వారా హైదరాబాద్‌తోనూ కనెక్టివిటీ ఉంది. బెంగళూరుతో అమరావతిని కూడా నేరుగా కలిపేందుకు వీలుగా ఈ కొత్త ప్రాజెక్టుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవేలో అద్దంకి నుంచి అమరావతి వరకు హైస్పీడ్ యాక్సిస్ కంట్రోల్ రోడ్డు నిర్మిస్తారు. బెంగళూరు-విజయవాడ హైవే ప్రకాశం జిల్లా అద్దంకి దగ్గర ఉన్న ముప్పవరం వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తుంది. ఎన్‌హెచ్-16నే కొత్త ప్రాజెక్టులో భాగంగా హైస్పీడ్ యాక్సెస్ కంట్రోల్ హైవేగా మార్చనున్నారు. ప్రస్తుత హైవేలో అద్దంకి నుంచి అమరావతి మధ్య 36చోట్ల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉన్నాయి. వీటిద్వారా ఆటోలు, ద్విచక్ర వాహనాలు హైవేలోకి వచ్చి ట్రాఫిక్ రద్దీ పెరిగి రాకపోకల వేగం తగ్గుతోంది. అందువల్ల ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలను నియంత్రించేలా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను కుదిస్తారు. ముప్పవరంలో ఒకచోట, ఓఆర్ఆర్‌తో అనుసంధానమయ్యే నారా కోడూరు, గుంటూరు నగరం, చిన్నకాకాని జంక్షన్ వద్ద.. ఇలా నాలుగైదు చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఇస్తారు. తద్వారా ఎక్స్‌ప్రెస్ వాహనాల రాకపోకలను సరళతరం చేస్తారు.

వచ్చే ఏడాది పనులు ప్రారంభం..

యాక్సిస్ కంట్రోల్ రోడ్డు నిర్మాణంలో ఇప్పటికే ఎన్‌హెచ్- 16 కింద అందుబాటులో ఉన్న భూముల రికార్డులను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అయితే రెండు ప్రధాన నగరాల నుంచి వచ్చే ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని యాక్సెస్ కంట్రోల్ రోడ్డును 12 లేన్ల వరకూ విస్తరించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. అందుకు తగినంత భూమి అందుబాటులో ఉందా.. లేదా? అన్న అంశాన్ని రెవెన్యూ శాఖ పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఉన్నట్లు ఆరు లేన్లు అలాగే ఉంచి యాక్సెస్ కంట్రోల్ చేస్తే కొత్తగా భూమి సేకరించాల్సిన అవసరం లేదు. అయితే రోడ్డును 12 లేన్లుగా విస్తరిస్తే మాత్రం భూమి అవసరం అవుతుంది. ఈ విషయంలో త్వరగా నిర్ణయం తీసుకుని 2027 నాటికి పనులు ప్రారంభించాలని, రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పని చేస్తున్నారు.

ఎట్టకేలకు.. ఒక్కరోజు!

» అనంతబాబు పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి

కాకినాడ, మే 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కస్టడీ పిటిషన్‌పై కాకినాడలోని స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. ఆయన్ను ఒకరోజు పోలీసు కస్టడీకి అనుమతి మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. అనంతబాబును 3 రోజుల పాటు విచారణ కోసం అప్పగించాలని దర్యాప్తు అధికారులు కోరారు. కనీసం 2 రోజులైనా ఇస్తారని పోలీసులు భావించినా న్యాయమూర్తి మాత్రం ఒక్కరోజే అనుమతించారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అనంతబాబును మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి కాకినాడ తీసుకురానున్నట్లు దర్యాప్తు అధికారి, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు 24 గంటల పాటు విచారణ చేపట్టనున్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సర్పవరం పోలీసు స్టేషన్ పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కాగా, అనంతబాబుపై దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఇప్పటికే నమోదయ్యాయి. తమకు అనుకూలంగా సాక్ష్యం చెప్పకపోతే చంపేస్తామని ఆయన బెదిరించి, నిర్బంధించిన నలుగురు యువకులు ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు కావడంతో ఈ కేసులో ఉన్నవారందరిపైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు.

ఆ ఇద్దరూ ఏమైనట్టు..?

సాక్షులను బెదిరించిన కేసులో ఏ2, ఏ3గా ఉన్న కడియాల చిన్నబాబు, కడియాల సతీశ్ ఆచూకీని పోలీసులు కనిపెట్టలేకపోతున్నారు. దాదాపు 15 రోజులుగా వారు పరారీలోనే ఉన్నారు. ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడంతో వారిని పట్టుకోవడం కష్టంగా ఉందని చెబుతున్నారు. వారి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిచి విచారించినా ఆచూకీ లభ్యం కావడం లేదని అంటున్నారు.

ఇఫ్కో కిసాన్ సెజ్‌లో మహానాడు

» రేపు ఉదయం భూమి పూజ.. పనులను పర్యవేక్షించిన మంత్రి నారాయణ

నెల్లూరు, మే 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో మే 27నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న మహానాడుకు వేదిక ఖరారయ్యింది. నగరానికి సమీపంలోని కొడవలూరు మండలంలోని ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రాంగణంలో మహానాడు నిర్వహించాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది. బుధవారం ఉదయం భూమి పూజకు ముహూర్తం ఖరారు చేశారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు.

పుష్కరాలకు పక్కాగా ఏర్పాట్లు: మంత్రి నారాయణ

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు. పుష్కరాల్లో మున్సిపల్ శాఖ తరపున చేపట్టాల్సిన పనులు, నిధుల అంచనాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వచ్చే ఏడాది జరిగే పుష్కరాల కోసం సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేస్తాయని చెప్పారు.

వృక్ష సంరక్షణ సలహా కమిటీ ఏర్పాటు

హైకోర్టు ఆదేశాల మేరకు 10మందితో వృక్ష సంరక్షణ సలహా కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ధాన్యం సేకరణకు రూ.1800 కోట్ల రుణం

2025-26 రబీ మార్కెటింగ్ సీజన్‌లో ధాన్యం సేకరణ కార్యకలాపాల కోసం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుంచి మార్క్‌ఫెడ్‌కు రూ.1,800కోట్లు మూలధన రుణానికి హామీ ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యుత్ ఉద్యోగుల వివాదం పాత బెంచ్‌కే: సుప్రీం

న్యూఢిల్లీ, మే 4(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య విద్యుత్ ఉద్యోగుల విభజన(కేటాయింపు) వివాదం మరోసారి సుప్రీంకోర్టుకు చేరింది. 'స్టేట్ క్యాడర్ విభజన కోసం నిర్దేశించిన నిబంధనలు, తీర్పులు 'జోనల్ క్యాడర్' ఉద్యోగులకు వర్తించవన్న పిటిషనర్ వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. దీనికి సంబంధించిన పిటిషన్లను గతంలో ఉద్యోగుల కేటాయింపు అంశాలను విచారించిన బెంచ్‌కే బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎం.హసన్ నజ్కీ వాదనలు వినిపించారు.

'ప్రజావ్యతిరేక' ఫలితం ఇదే!

» మంత్రులతో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): అధికారాన్ని ప్రజాక్షేమానికి వినియోగించకుండా, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తే ఎన్నికల్లో ప్రజలు వ్యతిరేకంగా తీర్పు ఇస్తారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అందుకు పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు ఫలితాలే నిదర్శనమన్నారు. ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు బాధ్యతతో వ్యవహరించాలని, వారు నిరంతరం అధికారంలో ఉన్న వారిని గమనిస్తుంటారని పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడవుతున్న తరుణంలో సీఎం చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం అందుబాటులో ఉన్న మంత్రులతో సచివాలయంలోని తన చాంబర్‌లో లంచ్ మీటింగ్ నిర్వహించారు.

మోదీ నాయకత్వంపై నమ్మకం: సీఎం

బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడం పట్ల సీఎం చంద్రబాబు సోమవారం 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయాలు ఎన్డీయేపైన, ప్రధాని మోదీపైన ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు.

విజయ్ అరంగేట్రం.. అదిరింది: లోకేశ్

మంత్రి లోకేశ్ కూడా విజయ్‌కు అభినందనలు తెలిపారు. అరంగేట్రంలో అదరగొట్టారని, ఈ విజయం ఓటర్ల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందన్నారు. కాగా, ప్రభంజనం సృష్టించిన టీవీకే అధినేత విజయ్‌ను హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో బాలకృష్ణ అభినందించారు.

లోకేశ్‌తో ప్రభుత్వ సలహాదారు మంతెన భేటీ

ఏపీ యోగా, నేచురోపతి విభాగం సలహాదారు,ప్రముఖ ప్రకృతి వైద్యనిపుణుడు మంతెన సత్యనారాయణ రాజు సోమవారం ఉండవల్లి నివాసంలో విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దశాబ్దాలుగా ప్రకృతి వైద్యం ద్వారా మంతెన సత్యనారాయణ రాజు అందిస్తున్న సేవలను లోకేశ్ కొనియాడారు.

ఫైటర్ జెట్స్.. మేడిన్ ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనలను రక్షణశాఖకు చెందిన రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. ఈ ప్రతిపాదనలపై రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ శాఖ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఏరో అండ్ డిఫెన్స్ పాలసీని ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ శాఖ రూపొందించింది. రాయలసీమలోని శ్రీ సత్యసాయి జిల్లాలో ఏరోస్పేస్ పరికరాల తయారీ రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధం కావడంతోపాటు.. ప్రతిష్ఠాత్మక జెట్ విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామంటూ ముందుకు రావడంతో రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ శాఖ వెంటనే ఆమోదం తెలిపింది. పుట్టపర్తి కేంద్రంలో డీఆర్‌డీవో దాదాపు 140 అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ)లను తయారు చేస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ. లక్ష కోట్ల పెట్టుబడులు వస్తాయని కేంద్ర ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. ఏడాది క్రితం సీఎం ఢిల్లీ వెళ్లినపుడు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమయ్యారు. యుద్ధ విమాన తయారీ కేంద్రం స్థాపనపై అప్పట్లో వారి మధ్య చర్చ జరిగింది.

అర్హులందరికీ పదోన్నతులు

» ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశం

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖ, దాని పరిధిలోని హెచ్‌ఓడీలు, వాణిజ్య పన్నుల శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను త్వరగా పూర్తిచేయాలని ఆ శాఖల మంత్రి పయ్యావుల కేశవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ అహ్మద్ బాబుతో మంత్రి పయ్యావుల భేటీ అయ్యారు. అర్హులందరికీ పదోన్నతులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. 1999 గ్రూప్ - 2 నోటిఫికేషన్ సీనియారిటీకి సంబంధించి కోర్టు కేసుల వల్ల తలెత్తిన అడ్డంకులను వెంటనే తొలగించాలని, ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన రీతిలో సమస్యను పరిష్కరించాలని సూచించారు.

29 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు ఖాళీ

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ పరిధిలో 2025-26 అడహక్ ప్యానెల్ సంవత్సరానికి 29 డిప్యూటీ కలెక్టర్ ఖాళీలు ఏర్పడ్డాయి. ఈమేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జి.సాయిప్రసాద్ జీఓ 660 ద్వారా ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఇందులో రిటైర్‌మెంట్ ద్వారా 25 ఖాళీలు ఏర్పడ్డాయి. మరో మూడు పోస్టులను రిజర్వ్‌చేయగా, ఒకటి స్వచ్ఛంద పదవీ విరమణ ద్వారా ఖాళీ ఏర్పడిందని ఉత్తర్వులో పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్‌గా పదోన్నతులు ఇచ్చే ప్రక్రియను రెవెన్యూ శాఖ ప్రారంభించింది. ఇది పూర్తికాగానే తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్ (డీసీ)లుగా పదోన్నతులు ఇచ్చేందుకు రంగం సిద్ధమవుతోంది. ఖాళీల నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏను ప్రభుత్వం ఆదేశించింది.

భూసేకరణ చట్టం ప్రిసైడింగ్ అధికారుల నియామకం

ఆంధ్రప్రదేశ్ భూసేకరణ, పునరావాసం, పునస్థాపన చట్టం-2013 (భూసేకరణ చట్టం) అమలు కోసం విశాఖపట్నం, విజయవాడ రీజియన్‌లకు ప్రిసైడింగ్ అధికారులను నియమిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ రీజియన్‌కు ప్రిసైడింగ్ అధికారిగా రిటైర్డ్ జిల్లా జడ్జి పి.భాస్కరరావు, విజయవాడ రీజియన్‌కు రిటైర్డ్ జిల్లా జడ్జి టి.వెంకటేశ్వర్లును నియమిస్తూ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు (జీఓ 652) జారీ చేశారు. విశాఖ రీజియన్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలు ఉంటాయి. విజయవాడ రీజియన్‌లో పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు ఉంటాయి. తిరుపతి రీజియన్‌లో కర్నూలు, అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్ కడప జిల్లాలు ఉంటాయి.

సాగు యంత్రాలకు 15 రోజుల్లో దరఖాస్తు చేసుకోండి

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో 2025-26 కింద వ్యక్తిగత పరికరాల కోసం అర్హులైన రైతులు బుధవారం నుంచి 15 రోజుల్లోగా ఆన్‌లైన్ అప్లికేషన్ https://eseed.ap.gov.in/FM/లో దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

రామోజీరావు లేకపోయినా.. ఆస్తులు జప్తు చేయొచ్చు!

» మార్గదర్శి కేసులో సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 4(ఆంధ్రజ్యోతి): మార్గదర్శి కేసులో ప్రధాన నిందితుడు రామోజీరావు లేకపోయినప్పటికీ, ఆస్తులు జప్తు చేయవచ్చని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వ్యక్తి మరణించినా, సంబంధిత సంస్థ ఉనికిలో ఉన్నప్పుడు క్రిమినల్ ప్రొసీడింగ్స్ ముగియవని తేల్చిచెప్పింది. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి రూ.వేల కోట్ల డిపాజిట్లు సేకరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. మార్గదర్శిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేస్తూ గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. "ఒక వ్యక్తి మరణించినంత మాత్రాన, ఆర్థిక సంస్థపై కొనసాగుతున్న క్రిమినల్ ప్రొసీడింగ్స్ ముగిసిపోవు. ఇది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన వ్యవహారం కాదు. ప్రజాధనానికి సంబంధించిన చట్టాల ఉల్లంఘన. అవసరమైతే ఆస్తులను అటాచ్ చేసి, ఆ మొత్తాన్ని బాధితులకు పంచవచ్చు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను జూలై 15కు వాయిదా వేసింది.

మామిడి నాణ్యత లేకే ధర తగ్గి ఉండొచ్చు: ఉద్యాన శాఖ

ఇబ్రహీంపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): నాణ్యత తగ్గడం వల్లే మామిడి ధరలు తగ్గి ఉండొచ్చని ఉద్యాన శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మామిడి ధర ఢమాల్ - రైతులు కుదేల్' శీర్షికన ఈ నెల 4న ప్రచురితమైన కథనానికి ఉద్యాన శాఖ అధికారులు వివరణ ఇచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో 22,896 హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేశారని, నల్లి తామర ఉధృతి వల్ల తోటల్లో పూత దెబ్బతిన్నదని, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల 20-25 శాతం దిగుబడులు తగ్గాయన్నారు. కోతల తొలి రోజుల్లో కాయలకు మంచి రేటు వచ్చిందని, రైతులకు నష్టాలు రాలేదన్నారు. తోతాపురి రకానికి మసి, రాతి మంగు ఎక్కువ ఉండటం వల్ల మార్కెట్లో ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. ఇతర రాష్ట్రాల్లోని మామిడి మార్కెట్లలోకి తెలంగాణ, రాయలసీమ మామిడి కాయలు రావడం వల్ల.. ఎన్టీఆర్ జిల్లాలో మామిడి ధరలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.

ఏపీ లాసెట్‌కు 80% హాజరు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఏపీ లాసెట్, పీజీఎల్‌సెట్ ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో 100 పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. తిరుపతిలోని అయాన్ డిజిటల్‌లో పరీక్షా కేంద్రాన్ని ఏపీ లాసెట్ ఛైర్ పర్సన్, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ ఆర్.ఉష, లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టి.సీతాకుమారి పరిశీలించారు. పరీక్షలకు 30 వేల మంది దరఖాస్తు చేసుకోగా.. మూడేళ్ల లా కోర్సుకు 78 శాతం, ఐదేళ్ల లా కోర్సుకు 83, ఎల్ఎల్ఎంకు 85.. మొత్తంగా 80 శాతం మంది హాజరయ్యారు.

ముందుగానే ఎల్‌నినో

- రుతుపవనాలపై ప్రభావం
- తక్కువ వర్షాలు.. అధికంగా ఉష్ణోగ్రతలు
- ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడి

విశాఖపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సంస్థల అంచనా కంటే ముందుగానే పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో రానున్నదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో భారత ఉపఖండంలో జూన్ నుంచి ప్రారంభం కానున్న నైరుతి రుతు పవనాలపై ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో లానినా ముగిసిందని, ప్రస్తుతం తటస్థ పరిస్థితులు కొనసాగుతున్నాయని, ఈ నెల నుంచి జూలై మధ్యలో ఎల్‌నినో ఏర్పడే అవకాశం ఉందని ప్రైవేటు వాతావరణ సంస్థ ఒకటి తాజాగా పేర్కొంది. ఎల్‌నినో వచ్చే ఏడాది జనవరి వరకు కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ రెండు విభాగాల నిపుణుల అంచనాకు అనుగుణంగా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా వస్తున్నందున దక్షిణాసియాలో నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని ప్రపంచ వాతావరణ సంస్థ తాజాగా వెల్లడించింది. భారతదేశంలో అనేక ప్రాంతాల్లో వర్షాలు తక్కువగా నమోదవుతాయని, దీంతో ఎక్కువ రోజులు వేడి వాతావరణం కొనసాగుతుందని హెచ్చరించింది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని పేర్కొంది. ప్రపంచంలో ఎక్కువ జనాభా కలిగిన ప్రాంతాల్లో దక్షిణాసియా ఒకటని, రుతుపవనాల్లో హెచ్చుతగ్గుల వల్ల వ్యవసాయం, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాలు, జల విద్యుత్ ఉత్పత్తి వంటి అంశాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

నేడు ఉత్తర కోస్తాకు భారీ వర్షసూచన

- పెదపారుపూడిలో 43.9 డిగ్రీల ఉష్ణోగ్రత

అమరావతి, విశాఖపట్నం, మే 4(ఆంధ్రజ్యోతి): కోస్తా, రాయలసీమ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో వేర్వేరుగా రెండు ద్రోణుల ప్రభావంతో మూడు నాలుగు రోజులు రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం కొనసాగుతుంది. సోమవారం పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ఎక్కువచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. పలుచోట్ల వడగాడ్పులు వీచాయి. 16 జిల్లాల్లోని 74 మండలాల్లో 41 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కృష్ణా జిల్లా పెదపారుపూడిలో 43.9, విజయవాడ తూర్పులో 43.1, నంద్యాల జిల్లా దొర్నిపాడులో 43.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ద్రోణి ప్రభావంతో మంగళవారం మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో మోస్తరు వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మిగిలిన ప్రాంతాల్లో ఎండ, ఉక్కపోత ఎక్కువగా ఉంటాయని తెలిపింది.



పెదబయలు సంతలో పాకపై కూలిన చెట్టు..

ఈదురుగాలుల బీభత్సం

- పాకపై కూలిన భారీ వృక్షం.. ముగ్గురు మహిళల మృతి
- మరో నలుగురికి తీవ్రగాయాలు

పెదబయలు, మే 4(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలులకు స్థానిక వారపుసంతలోని ఒక పాకపై భారీ వృక్షం కూలడంతో ముగ్గురు చిరు వర్తకులైన ఒడిశా మహిళలు మృతిచెందారు. మరో నలుగురు గాయపడ్డారు. భారీవర్షం కురుస్తుండడంతో ఒక పాకలో కొర్రా తిత్తమ్మ(30), కోడా ఇచ్చమ్మ(40), పి.మోనిమా(40)తోపాటు మరో నలుగురు తలదాచుకున్నారు. ఈదురుగాలులకు ఆ పాకపై చెట్టు పడడంతో తిత్తమ్మ, ఇచ్చమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. పి.మోనిమా, కె.పరిమిలకు తీవ్ర గాయాలు కావడంతో పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించాం'. అక్కడ చికిత్స పొందుతూ పి.మోనిమా మృతి చెందారు. కె.పరిమిలను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. మిగతా నలుగురికి స్థానిక పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం

తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.1,00,10,116 విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన అజ్ఞాత భక్తులు విరాళం డీడీని తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో రవిచంద్రకు అందజేశారు.

ఉన్నత విద్యా కమిషనరేట్‌కు అడ్మిషన్ల అధికారాలు

- ఉన్నత విద్యా మండలి అధికారాలు బదలాయింపు

అమరావతి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖను పునర్ వ్యవస్థీకరించి ఉన్నత విద్య కమిషనరేట్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం అందుకనుగుణంగా కమిషనరేట్‌కు పలు అధికారాలు అప్పగించింది. ప్రస్తుతం ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖల వద్ద ఉన్న అడ్మిషన్లు, అనుమతుల అధికారాలను కమిషనరేట్‌కు అప్పగించింది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం అధికారాల బదిలాయింపుపై 18 వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై అన్ని ఉన్నత విద్యా కోర్సుల, డిప్లొమా కోర్సుల అడ్మిషన్లను ఉన్నత విద్యా కమిషనరేటే చేపడుతుంది. అలాగే డిగ్రీ, లా, ఇతర కోర్సులు అందించే కొత్త కాలేజీల ఏర్పాటుకు అనుమతులను ఈ కమిషనరేటే జారీ చేస్తుంది. బీఈడీ అడ్మిషన్లు కూడా కమిషరేట్ నుంచే జరుగుతాయి. అయితే, ప్రవేశ పరీక్ష నిర్వహణ మాత్రం ఉన్నత విద్యామండలి పరిధిలోనే ఉంటుంది. మండలి ప్రవేశ పరీక్షలను నిర్వహించాక అడ్మిషన్లను కమిషనరేట్ చేపడుతుంది.

హజ్‌యాత్రకు బయల్దేరిన మరో 185 మంది

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన 185 మంది హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం-శంషాబాద్ విమానాశ్రయం నుంచి సోమవారం హజ్‌యాత్రకు బయలుదేరారు. శంషాబాద్ సమీపంలోని విడిది కేంద్రం నుంచి విమానాశ్రయానికి బయలుదేరిన వాహనాలను రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఏ షరీఫ్, మైనార్టీశాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, హజ్‌కమిటీ ఛైర్మన్ హసన్ బాషా, సీఈవో గౌస్ పీర్ జెండా ఊపి ప్రారంభించారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటలకు మొదటి విమానం, తర్వాత రెండు విమానాల్లో మొత్తం 185 మంది హజ్‌యాత్రకు పయనమైనట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. రాష్ట్రం నుంచి 1,202 మంది హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ఎంపిక చేసుకున్నారని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక

- మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ వెల్లడి

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తామని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ చెప్పారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వారి అవసరాలు, అభ్యర్థనలపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. గతనెల 7న విజయవాడలో జరిగిన ట్రాన్స్‌జెండర్ల సదస్సులో తెలుసుకున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్న హామీ మేరకు సోమవారం మంగళగిరిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధులతో ఆమె సమావేశమై, ప్రభుత్వానికి అందించే నివేదికపై చర్చించారు. సమాజంలో ట్రాన్స్‌జెండర్స్ గౌరవప్రదంగా జీవించడం, సమాన అవకాశాలు పొందటంపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకోసం మంత్రి లోకేశ్‌ను కలిసి సమస్యలు, అవసరాలను వివరించే అవకాశాన్ని ట్రాన్స్‌జెండర్స్ ప్రతినిధులకు ఆమె కల్పించారు. ట్రాన్స్‌జెండర్ల ఆవేదనను మంత్రి లోకేశ్ ఓపికగా విని, సానుకూలంగా స్పందించారని శైలజ వివరించారు.

పోలీసులూ.. దమ్ముంటే పట్టుకోండి!

- బండి నంబరిచ్చి సవాల్ విసిరిన దొంగ

చీపురుపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): పోలీసులకే సవాల్ విసిరాడు ఓ దొంగ! చేతనైతే తనను పట్టుకోవాలన్నాడు. బండి నంబరు కూడా ఇచ్చాడు. ఈ విచిత్రమైన ఘటన విజయనగరం జిల్లా చీపురుపల్లిలో వెలుగుచూసింది. చీపురుపల్లి పట్టణం లావేరు రోడ్డులో రావివలస జంక్షన్ వద్ద ఉన్న అభిరుచి చికెన్ షాపు తాళాలు పగలగొట్టి సోమవారం తెల్లవారుజామున ఓ దుండగులు లోపలికి ప్రవేశించాడు. అందులో ఉన్న రూ.2500 నగదు ఎత్తుకెళ్లాడు. ఆ పక్కనే ఉన్న కేవీఆర్ చికెన్ దుకాణంలోకీ చొరబడ్డాడు. అక్కడ ఏమీ లభించకపోవడంతో నగదు కౌంటర్ వద్ద ఉన్న పుస్తకంపై ఒక వాహనం నంబరు పెన్సిల్‌తో రాశాడు. 'దమ్ముంటే తనను పట్టుకోవాల'ని చాలెంజ్ చేస్తూ రాశాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. కాగా, గత నెల 10న కూడా అభిరుచి చికెన్ సెంటరులోనే దొంగతనం జరిగింది. అప్పట్లో రూ.32 వేలు మాయమయ్యాయి.

ఘన వ్యర్థాల సమర్థ నిర్వహణకు ఉన్నత స్థాయి కమిటీ

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా, కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ కో ఛైర్మన్‌గా, పీసీబీ సభ్య కార్యదర్శి కన్వీనర్‌గా, అటవీ, మున్సిపల్, పంచాయతీరాజ్, దేవాదాయ, వైద్య ఆరోగ్య శాఖల ముఖ్యకార్యదర్శులు, మున్సిపల్ డైరెక్టర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ, రైతుబజార్ల సీఈవోతోపాటు జాతీయ పర్యావరణ పరిశోధన సంస్థ, ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ ప్రొవైడర్స్, సిమెంట్ కంపెనీలు, హోటల్స్, రెస్టారెంట్ల ప్రతినిధులను సభ్యులుగా నియమించారు. భారత పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఘన వ్యర్థాల పర్యావరణ అనుకూల నిర్వహణను నిర్ధారించే ఉద్దేశంతో పర్యావరణ రక్షణ చట్టం-1986 కింద ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు2026ను గత జనవరి 27న నోటిఫై చేసింది. ఈ నియమాలు గత నెల 1నుంచి అమలులోకి వచ్చాయి. వీటి అమలు కోసం ప్రభుత్వం ఈ కమిటీని నియమించింది.

పెట్రోల్, డీజిల్ ధరలు పెంచితే రవాణా రంగంపై తీవ్ర ప్రభావం

- రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు

విజయవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ఆలోచనలను వెంటనే విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) దక్షిణ మండల ఉపాధ్యక్షుడు వై.వి.ఈశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు మూడేళ్లుగా అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ, ఆ లాభం దేశంలోని వినియోగదారులకు అందలేదని మంగళవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పెరిగిన ఇంధన ధరల కారణంగా రవాణా రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మళ్లీ ధరలను పెంచడం వల్ల లారీ యజమానులు, డ్రైవర్లు, సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇంధన ధరల పెంపు నిర్ణయంపై పునరాలోచించాలని ఈశ్వరరావు సూచించారు.

వారంలో 5.20 లక్షల మందికి వెంకన్న దర్శనం



- ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన క్యూలైన్ల నిర్వహణతో సాధ్యం

తిరుమల, మే 4(ఆంధ్రజ్యోతి): సమర్థవంతమైన క్యూలైన్ల నిర్వహణతో వారం రోజుల వ్యవధిలో 5.20 లక్షల మంది సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం లభించింది. వేసవి సెలవులు, పదవ తరగతి పరీక్షల ఫలితాల నేపథ్యంలో రద్దీ అధికంగా నెలకొనే అవకాశా లున్నాయనే అంచనాతో టీటీడీ ముందస్తు ప్రణాళికలు రూపొందించిన క్రమంలో అధికారులు అత్యధికంగా భక్తులకు దర్శనం చేయించగలిగారు. వాస్తవానికి నెల రోజుల ముందే టీటీడీ వేసవి ఏర్పాట్లు పూర్తిచేసింది. పైగా, ఏప్రిల్ 27వ తేదీ నుంచే సిఫారసు లేఖలపై ఇచ్చే వీఐపీ బ్రేక్ దర్శనాలను కుదించుకుంటూ వచ్చి ఈ నెల ఒకటో తేదీ నుంచి పూర్తిస్థాయిలో రద్దు చేయడంతో పాటు స్లాటెడ్ సర్వదర్శనం, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలను పరిమితం చేసింది. ఈ క్రమంలో సామాన్య భక్తులకే అధిక దర్శన సమయం లభించింది. ప్రత్యేకించి రెండు గంటల పాటు జరిగే అభిషేక సేవ ఉన్న శుక్రవారం కూడా 71,008 మందికి శ్రీవారి దర్శనం చేయించగలిగారు. గత శనివారం 91,008 మంది, ఆదివారం 83,091 మంది చొప్పున మొత్తం మూడు రోజుల్లో 2,45,104 మందికి స్వామి దర్శనం లభించింది. వీరిలో సామాన్య భక్తులే అధికం కావడం విశేషం. మరోవైపు నిరీక్షణ సమయం కూడా భారీగా తగ్గింది. గతంలో 12 నుంచి 20 గంటల పాటు ఉండే దర్శన నిరీక్షణ సమయం తగ్గిపోయి కేవలం 8 గంటల వ్యవధిలోనే సామాన్య భక్తులకు స్వామి దర్శనం లభించింది. మరోవైపు కంపార్టుమెంట్లు, షెడ్లు, వెలుపల క్యూలైన్లలోని భక్తులకు నిరంతరాయంగా అన్నపానీయాలను సరఫరా చేయడంతో దర్శనాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి నిరంతరం వివిధ విభాగాల అధికారులను అప్రమత్తం చేస్తూ సమన్వయంతో దర్శనాలు చేయించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు రద్దీపై నిఘా ఉంచి దర్శనాలు చేయించారు. ఇక 27వ తేదీ నుంచి 3వ తేదీ వరకు 2.16 లక్షల మంది తలనీలాలు సమర్పించగా, ఈ వారంరోజుల్లో రూ.28.58 కోట్ల హుండీ ఆదాయం లభించింది. 23.78 లక్షల మందికి అన్నప్రసాదాలు అందజేశారు. రూ.10.56 కోట్ల విలువైన 26.28 లక్షల లడ్డూలు విక్రయాలు జరిగాయి. రూ.84.80 లక్షల బంగారు డాలర్లను భక్తులకు విక్రయించారు. అలాగే 73,107 వాహనాలు తిరుమలకు వచ్చి వెళ్లాయి. ఇక, సోమవారం తిరుమలలో భక్తుల రద్దీ భారీగా తగ్గింది. తమిళనాడు ఎన్నికల ఫలితాల ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కేవలం రెండు గంటల వ్యవధిలోనే శ్రీవారి దర్శనం లభించింది.

నేషనల్ హెల్త్ మిషన్ ఎస్పీఓగా జె.విజయలక్ష్మి

- రెండేళ్ల తర్వాత పోస్టు భర్తీ
- ఆరోగ్య శాఖలో ఐదుగురికి జేడీలుగా పదోన్నతి

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో ఐదుగురు డిప్యూటీ డైరెక్టర్లకు ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్లు(జేడీ)గా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు ఆరోగ్య శాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్లుగా ఉన్న వి.వెంకట శేషారెడ్డి, జె.విజయలక్ష్మి, ఎస్.సృజన, ఆర్.గణపతిరావు, ఎల్.శ్రీనివాసరావుకు జేడీలుగా పదోన్నతి పొందారు. ప్రమోషన్ పొందిన వారికి పోస్టింగులు ఇస్తూ, 15 రోజుల్లోగా విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో ఉన్న వి.వెంకట శేషారెడ్డికి డీఎంఈ కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చింది. అలానే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖాళీగా ఉన్న నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్(ఎన్‌హెచ్ఎం ఎస్పీఓ) పోస్టును ఆరోగ్య శాఖ ఎట్టకేలకు భర్తీ చేసింది. కీలకమైన ఈ పోస్టులో జె.విజయలక్ష్మిని నియమించింది. అలానే విశాఖ ఆర్డీ కార్యాలయంలో ఉన్న ఎస్.సృజనను నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా నియమించింది. ఏపీ శాక్స్‌లో డీడీగా ఉన్న ఆర్.గణపతిరావుకు డీఎంఈ కార్యాలయంలో జేడీగా పోస్టింగ్ ఇచ్చింది. రాజమండ్రి ఆర్డీ కార్యాలయంలో డీడీగా ఉన్న ఎల్ శ్రీనివాసరావును ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ అడ్మిన్ ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

చిరుద్యోగికి పెద్ద బాధ్యతలు

- జూనియర్ అనలిస్ట్ చేతికి డ్రగ్ విభాగం
- జీఎం, ఫార్మసిస్టు, సూపరింటెండెంటు... అన్నీ అతనే
- మెడికల్ కార్పొరేషన్‌లో మరొక వివాదాస్పద ఉత్తర్వు

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడీసీ) అడ్డగోలు నిర్ణయాలకు చిరునామాగా మారుతోంది. కార్పొరేషన్‌లో డ్రగ్స్ జనరల్ మేనేజర్ పోస్టు చాలా కీలకం. ఇలాంటి కీలకమైన డ్రగ్స్ విభాగానికి రెండు వారాల క్రితం జనరల్ మేనేజర్‌గా ఒక జూనియర్ అనలిస్ట్‌ను నియమించారు. నిబంధనల ప్రకారం ఔషధ నియంత్రణ మండలిలో అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులను ఈ పోస్టుల్లో నియమించాలి. కానీ ఒక జూనియర్ అనలిస్ట్‌కు కార్పొరేషన్‌లో డ్రగ్ జీఎం బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాక.. డ్రగ్స్ విభాగంలో ఆర్థిక వ్యవహారాలు నిర్వహించే సూపరింటెండెంట్ పోస్టుకు సంబంధించిన అదనపు బాధ్యతలు కూడా సదరు ఉద్యోగికే కట్టబెట్టారు. దీనికోసం డ్రగ్స్ విభాగంలో రూ.కోట్ల బిల్లులు మొత్తం చిరుద్యోగి కనుసన్నల్లో నడిచే విధంగా నిబంధనలనూ మార్చారు. ఈ నిర్ణయం మరిన్ని విమర్శలకు దారితీసింది. ల్యాబ్‌లో పరీక్షలు చేయాల్సిన చిన్న ఉద్యోగి, ఏపీఎంఎస్ఐడీసీలో ఫార్మసిస్టుగా, డ్రగ్స్ విభాగం జనరల్ మేనేజర్‌గా, ఇప్పుడు ఆర్థిక వ్యవహారాలు చూసే సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నిబంధనలకు విరుద్ధంగా ఆరోగ్య శాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్ ఏపీఎంఎస్ఐడీసీ ఎండీగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బీఎఫ్‌సీ ఛైర్మన్‌గా కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయాలను సమీక్షించాల్సిన ఆయనే ఎండీ హోదాలో అజెండా సిద్ధం చేస్తే పారదర్శకతకు ప్రాధాన్యత ఎక్కడ ఉంటుందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అంబులెన్స్ డ్రైవర్ నిద్రమత్తుకు నలుగురి ప్రాణాలు బలి

- ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ
- తిరుపతి జిల్లా ఊరందూరులో ప్రమాదం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- అందరూ పశ్చిమబెంగాల్ వాసులు
- చికిత్స కోసం బెంగళూరు వెళ్తుండగా ఘటన
- మృతుల్లో ముగ్గురిది ఒకే కుటుంబం



లారీని ఢీకొట్టి ధ్వంసమైన అంబులెన్సు

శ్రీకాళహస్తి, మే 4(ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ డ్రైవర్ నిద్రమత్తు నలుగురి ప్రాణాలను బలిగొంది. మరో ఇద్దరిని తీవ్ర గాయాలపాలు చేసింది. ఉబ్బసం రోగిని ఎలాగైనా బతికించుకోవాలని అంబులెన్స్‌లో పశ్చిమబెంగాల్ నుంచి కర్ణాటక రాజధాని బెంగళూరుకు బయలుదేరిందా కుటుంబం. అయితే, ఆగి ఉన్న లారీని వెనుక నుంచి అంబులెన్స్ ఢీకొనడంతో రోగి సహా ముగ్గురు కుటుంబసభ్యులు, అంబులెన్స్ కో-డ్రైవర్ కూడా మృతి చెందారు. డ్రైవర్ సహా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిందీ ఘటన. పోలీసుల కథనం మేరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం హుగ్లీ ప్రాంతానికి చెందిన బ్రజా డోలుయి(48) తీవ్ర ఆస్తమా వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. స్థానిక వైద్యుల సలహా మేరకు ఆయనను బెంగళూరులోని ప్రముఖ ఆస్తమా వైద్యశాలకు తరలించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేశారు. బ్రజా డోలుయితోపాటు భార్య టగారి(35), అన్న జతిన్(63), టగారి స్నేహితురాలు థగోడిస్ శనివారం రాత్రి 10.30 గంటలకు హుగ్లీ నుంచి అంబులెన్స్‌లో బెంగళూరుకు బయలుదేరారు. డ్రైవర్ రాకేశ్ పండిత్(29) అంబులెన్స్‌ను నడుపుతుండగా, అతని సోదరుడైన కో-డ్రైవర్ రితేశ్ పండిత్(24) కూడా ఇదే వాహనంలో ఉన్నారు. డ్రైవర్ రాకేశ్ నిద్రమత్తులో ఊరందూరు వద్ద రేణిగుంట-నాయుడుపేట జాతీయరహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో బ్రజా డోలుయి, టగారి, జతిన్, రితేశ్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రాకేశ్, థగోడిస్‌లను పోలీసులు చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. మృతుల బంధువులకు సమాచారం అందించి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆకివీడు రామాలయంపై హైకోర్టులో పిటిషన్

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా, ఆకివీడు నగర పంచాయితీ పరిధిలోని పెదపేటలో రామాలయం నిర్మాణానికి అధికారులు అనుమతులు మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పెదపేటకు చెందిన వంగా జ్యోత్స్న మరో దీనిని దాఖలు చేశారు. ప్రభుత్వ భూమిలో మతపరమైన నిర్మాణం జరపడం సుప్రీం కోర్టు తీర్పుకి విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. హడావుడిగా రామాలయం నిర్మాణం జరుపుతున్నారని, అనుమతులు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సోమవారం పిటిషనర్ల తరఫు న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్... వ్యాజ్యాన్ని లంచ్ మోషన్‌గా స్వీకరించి విచారణ జరపాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్‌ను అభ్యర్థించారు. మంగళవారం విచారణ జరుపుతామని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

వారి వినతిపై 4 వారాల్లో నిర్ణయం తీసుకోండి

- గ్రామ, వార్డు సచివాలయాల కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్‌తో పాటు ప్రమోషన్ చానల్ రూపకల్పన విషయంలో గత ఏడాది జనవరి 27న ఉద్యోగుల సంఘం ఇచ్చిన వినతిని పరిగణనలోకి తీసుకొని నాలుగు వారాల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని గ్రామ-వార్డు సచివాలయాల కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్‌తో పాటు ప్రమోషన్ చానల్ రూపకల్పన చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ గ్రామ, వార్డు సచివాలయం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వలమల శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత ఏడాది జనవరి 27న అసోసియేషన్ సమర్పించిన వినతిని పరిగణనలోకి తీసుకొని తగిన ఉత్తర్వులు జారీ చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది కోటా కృష్ణ దీప్తి వాదనలు వినిపించారు.

15 వరకు వినతులు: డెడికేటెడ్ కమిషన్

అమరావతి/రాజమహేంద్రవరం, మే 4 (ఆంధ్రజ్యోతి): డెడికేటెడ్ కమిషన్‌కు వినతులు సమర్పించేందుకు గడువును ఈ నెల 15 వరకు పొడిగిస్తున్నట్లు కమిషన్ కార్యదర్శి డి.చంద్రశేఖర్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఉన్న గడువును పలు బీసీ సంఘాల అభ్యర్థన మేరకు పొడిగించారు. ఆయా సంఘాలు, వ్యక్తులు స్వయంగా కమిషన్ దృష్టికి కాని, ఈ మెయిల్ ద్వారా కాని, విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి పోస్టు ద్వారా కాని వినతి పత్రాలు అందించవచ్చని ప్రకటనలో తెలిపారు. బీసీల కులగణనతో పాటు వారి స్థితిగతుల అధ్యయనానికి ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను నియమించింది. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేయనుంది. కాగా సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సమీక్ష సమావేశాన్ని, బహిరంగ విచారణను నిర్వహించారు. గత ఎన్నికలకు సంబంధించిన సర్పంచ్ స్థానాల వివరాలు, బీసీలకు కేటాయించిన సీట్లు, గెలుపొందిన బీసీ అభ్యర్థులు వంటి వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ విచారణలో స్వీకరించిన వినతులను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


నిర్ణయాత్మక విజయాలు

దేశ భవిష్య రాజకీయాలమీద ఈ ఎన్నికల ఫలితాల ప్రభావం బలంగా ఉండబోతోంది. పార్లమెంట్ ఎన్నికల్లో చతికిల బడిన భారతీయ జనతాపార్టీకి సమధికోత్సాహాన్ని ఇచ్చిన తీర్పు ఇది. బీజేపీ, దాని మిత్రపక్షాల చేతుల్లో దేశంలోని 22 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయి. దేశవ్యాప్తంగా ఇంతటి విస్తరణ, ఆధిపత్యం ఆరున్నర దశాబ్దాల తరువాత చూస్తున్నాం. సభలో తగిన సంఖ్యాబలం లేక, రెండు పార్టీలమీద ఆధారపడిన బీజేపీ, తాను దేశ వ్యాప్తంగా చేయలేని చట్టాలను, చర్యలను రాష్ట్రాల స్థాయిలో దూకుడుగా అమలు చేయగల ధైర్యాన్ని, నైతిక శక్తినీ ఆ పార్టీకి ఈ ఎన్నికలు ఇచ్చాయి. విపక్షాల కంచుకోటలనీ, కూల్చడం అసాధ్యమనీ అనుకున్నవి కూడా వరుసగా కూలిపోతున్నాయి. గంగోత్రి నుంచి గంగాసాగరం వరకూ విస్తరించిన విజయం ఇది అన్నారు ప్రధాని నరేంద్రమోదీ. జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జన్మ స్థలాన్ని ఏడున్నర దశాబ్దాల తరువాత గెలుచుకున్నందుకు ఆయన సంతోషానికి అవధుల్లేవు.

హిందూత్వంతో ఇంకొంత వేళ్లూనడానికీ, విస్తరించడానికీ అసోం–బెంగాల్ మోడల్ ఇకపై బీజేపీకి మరింత ఉపకరిస్తుంది. హేమంత శర్మ విద్వేషపూరిత వ్యాఖ్యలు, బుల్‌డోజర్ కూల్చివేతలు అసోంలో ఆశించిన ఫలితాన్నిచ్చాయి. ఇక్కడి నియోజకవర్గాల పునర్విభజన, పొరుగున బెంగాల్‌లో ‘సర్’ పేరిట తృణమూల్ ఓటు బ్యాంకు అయిన ముస్లిం ఓటర్ల ఏరివేత ఈ విజయాలకు కారణమని విపక్షనేతలు ఆడిపోసు కోవడం సహజం. 90లక్షల మంది ఓటర్లను గాలికొదిలేసి, బెంగాల్‌ను బీజేపీకి అప్పగించి తనను నియమించినవారి రుణం జ్ఞానేశ్‌కుమార్ తీర్చుకున్నారట. అసోం, బెంగాల్‌లో బీజేపీ ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలు, బంగ్లాదేశ్ అక్రమ వలసదారులు ఏరివేత హామీలు బాగా పనిచేశాయి. లక్షలాదిమంది బంగ్లాదేశీ ముస్లింలు స్థానిక హిందువుల కూడు గూడు లాగేసుకుంటున్నారని, ఉద్యోగ ఉపాధులకు గండికొట్టి, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్న ప్రచారం ప్రభావం చూపింది. బంగ్లాదేశ్ నుంచి షేక్ హసీనా నిష్క్రమణ, మహ్మద్ యూనిస్ నాయకత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఏలుబడిలో హిందువులపై జరిగిన దాడులు ఈ సరిహద్దు రాష్ట్రాల్లో ముస్లిం వ్యతిరేకతను పెంచడానికి, హిందూ ఓటు బ్యాంకును సృష్టించుకోవడానికీ బీజేపీకి ఉపకరించాయి. బంగ్లాకు ఆనుకొని ఉన్న ఈ రెండు ప్రధాన రాష్ట్రాలు బీజేపీ చేతిలో ఉండటం ఆ దేశంతో భావి సంబంధాలను ప్రభావితం చేయవచ్చు.

మూడున్నర దశాబ్దాల పాటు కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న బెంగాల్‌ను ఏ తరహా వీధిపోరాటాలతో మమత లాక్కున్నదో, అంతకు మించిన యుద్ధతీవ్రతతో బీజేపీ ఆమె నుంచి దానిని ఇప్పుడు వశపరచు కుంది. మమతను ముస్లిం అనుకూల వ్యక్తిగా కంటే, హిందూ వ్యతిరేక శక్తిగా చూపడంలో బీజేపీ విజయం సాధించింది. పంచాయతీల్లో సైతం పార్లమెంట్ ఎన్నికల స్థాయిలో పోరాటం చేసే బీజేపీ, బెంగాల్ వశం కోసం సర్వశక్తులూ ఒడ్డింది, మమతను దించడానికి దారులన్నీ వాడు కుంది. మోదీ, అమిత్‌షాలు పాల్గొన్న 80 సభలు, ర్యాలీలు సువేందు అధికారి పోరాటానికి మరింత శక్తినిచ్చాయి. గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణాలనూ, రాష్ట్ర రాజధానిలోని అధిక స్థానాలనూ బీజేపీ వశం చేసుకుంది. కేరళలో మూడుస్థానాలు గెలుచుకోవడం కూడా శుభ శకునమే.

తమిళనాడులో అధికారం కొత్తగా పుట్టిన విజయ్ పార్టీకి పోయినా, డీఎంకే ఓడిపోవడం బీజేపీకి సంతోషం కలిగించే పరిణామం. విజయ్ ప్రభావం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనే కాదు, రాష్ట్ర రాజధానిలోనూ స్పష్టంగా ఉంది. ఐదు దశాబ్దాలుగా రెండు ద్రవిడ పార్టీల మధ్య అధికారాన్ని మారుస్తూ వచ్చిన తమిళులు వాటిని నిర్దయగా వెనక్కు నెట్టి, ద్రవిడోద్యమంతో ఏ బంధంలేని సినీ హీరోను విజేతను చేశారు. ఓ గుప్పెడు స్థానాలు తక్కువపడినప్పటికీ, విజయ్ గాలికి స్టాలిన్, కొందరు మంత్రులు కొట్టుకుపోవడం, ఏ పార్టీకైనా, కూటమికైనా స్పష్టమైన మెజారిటీ ఇచ్చే తమిళనాడులో తొలిసారిగా త్రిశంకు సభ ఏర్పడటం ఆశ్చర్యకరమైన పరిణామాలు. ఏ రాజకీయ అనుభవం లేకుండా, పార్టీ పెట్టిన స్వల్పకాలంలోనే ఇంతటి విజయాన్ని సాధించడం ఎన్టీఆర్‌ను గుర్తుకు తెస్తుంది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో కరడుగట్టిన బీజేపీ వ్యతిరేక పార్టీలు కూలిపోవడం విపక్ష కూటమికి ఎదురుదెబ్బ. కేరళలో మంచి విజయాన్ని సాధించడం కాంగ్రెస్‌కు పెద్ద ఉపశమనం.



గ్రహాలు రాంగ్ రూట్లో వెళ్తే?

మన జీవితంలో వేగం పెరిగింది, ప్రయాణాలు పెరిగాయి, కానీ సహనం తగ్గింది. అందుకే రోడ్లపై ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మనల్ని ఆపి ఆలోచింపచేయాల్సిన ఆలోచన ఒకటి ఉంది. ఈ విశ్వాన్ని నడిపిస్తున్న సౌర వ్యవస్థలో ఎన్నో యుగాలుగా గ్రహాలు వాటి కక్ష్య దాటి ఢీకొన్న ఘటనలు జరగలేదు. ఎందుకంటే– ప్రతి గ్రహం నిర్దేశిత కక్ష్యలోనే ప్రయాణిస్తుంది. సూర్యుడి చుట్టూ తిరిగే ఏ గ్రహమూ తన కక్ష్యను ఎప్పుడూ దాటదు. ఈ క్రమశిక్షణ వల్లే సౌర వ్యవస్థ 4.5 బిలియన్ సంవత్సరాలుగా స్థిరంగా ఉంది.

రోడ్‌పై ప్రయాణించేటప్పుడు మన లేన్ డిసిప్లిన్‌లో లోపాలపై గ్రహాలు చెప్పే పాఠాలు కొన్ని మనం గమనించాలి. సౌర వ్యవస్థలో మెర్క్యూరి గ్రహం సూర్యుడి చుట్టూ గంటకు 1,72,440 కి.మీ వేగంతో తిరుగుతుంటే, మన భూ గ్రహం గంటకు 1,07,280 కి.మీ వేగంతోను, నెప్ట్యూన్ గంటకు 19,440 కి.మీ వేగంతోను తిరుగుతున్నాయి. అయినా ఈ గ్రహాలు ఎప్పుడూ తమ కక్ష్యను విడిచి వెళ్ళలేదు. ఒక్క గ్రహం కక్ష్య దాటినా అది మహా విపత్తుకు దారితీస్తుంది. లక్షల కిలోమీటర్ల వేగంతో తిరిగే గ్రహాలు కక్ష్య దాటకుండా పరిభ్రమిస్తుంటే, గంటకు 60–80 కిలోమీటర్ల వేగంతో వెళ్ళే మన వాహనాలు మాత్రం నిర్దేశించిన మార్గాన్ని అతిక్రమించి, లేన్లు దాటి ప్రమాదాలకు గురై ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి.

పరిశోధనల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సుమారు 18 నుంచి 28శాతం వరకు ప్రమాదాలు లేన్ క్రమశిక్షణ లేకపోవడం వల్లే జరుగుతున్నాయి. 2023 సంవత్సరానికి రోడ్డు రవాణా & రహదారుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన జాతీయ డేటా ప్రకారం, భారతదేశంలో మొత్తం రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణాలు: లేన్ క్రమశిక్షణ లేకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్... ఇవే! ఈ కారణాల వల్ల 9,432 మంది మరణించారని తెలుస్తోంది. రోడ్డుపై క్రమశిక్షణ లేకపోవడం, అతివేగం లేదా మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని ఇది స్పష్టంగా గుర్తుచేస్తోంది. మన దేశంలో వాహన దారులు లేన్ మార్చేటప్పుడు సిగ్నల్ ఇవ్వకపోవడం, రాంగ్‌సైడ్ వెళ్ళడం,

> **సౌరవ్యవస్థ మనకు గొప్ప పాఠం చెబుతోంది. గ్రహాలు తమ కక్ష్యల్లో ఉండటం వల్లే విశ్వం సురక్షితంగా ఉంది. మనం కూడా అదే మార్గాన్ని అనుసరిస్తే మన రోడ్లు కూడా సురక్షితంగా ఉంటాయి. మనం లేన్‌లో ప్రయాణించడం అనేది ఒక నిర్ణయం కాదు, అది జీవితం పట్ల గౌరవం.**

ఓవర్ టేక్ చేయడానికి తొందరపడటం... ఇవన్నీ రోడ్డు ప్రమాదాలకు కారణాలు. చాలామంది డ్రైవర్లు లేన్ నియమాలను సరిగ్గా పాటించక పోవడం వల్ల ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. హైదరాబాద్ సమీపంలో జరిగిన ట్రక్కు ప్రమాదం మనకు గట్టి హెచ్చరిక. ఒక చిన్న లేన్ ఉల్లంఘన వల్ల 19 మంది ప్రాణాలు పోయాయి. ట్రక్కు డ్రైవర్ రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న లేన్‌లోకి వెళ్ళాడు. ఆ క్షణిక నిర్ణయం ప్రాణాంతకమైంది. ఇలాంటి ఘటనలు దేశవ్యాప్తంగా ఎన్నో జరుగుతున్నాయి. చాలామంది ట్రాఫిక్ సిగ్నల్ కోసం వేచి ఉండలేక వెంటనే ముందుకు వెళ్ళాలని తొందరపడటం, అవగాహన లోపంతో లేన్ మార్కింగ్‌లను పట్టించుకోకపోవడం, సిగ్నల్ ఇవ్వకుండా లేన్ మార్చడం, రాంగ్ సైడ్ వెళ్ళడం ద్వారా సమయం ఆదా చేయాలని భావించడంతో పాటు ట్రాఫిక్ నియమాలు కఠినంగా అమలు కాకపోవటం వంటి కారణాలు రోడ్లను ప్రమాద నిలయాలుగా మారుస్తున్నాయి.

కేవలం ట్రాఫిక్ పోలీసులే కాదు, ప్రతి డ్రైవర్ నియమానుసారమైన డ్రైవింగ్‌ను బాధ్యతగా తీసుకోవాలి. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పించాలి. సౌర వ్యవస్థ వంటి సృజనాత్మక ఉదాహరణలు ఉపయోగిస్తూ, అవగాహన కల్పిస్తే మరింత గుర్తుండి పోతుంది. లేన్ ఉల్లంఘనలకు భారీ జరిమానాలు విధించాలి. ఆధునిక టెక్నాలజీతో రూపొందించిన కెమెరాలు, ఏఐ టెక్నాలజీ ద్వారా పర్యవేక్షణ పెంచాలి. కొత్త వాహనాల్లో లేన్ డిపార్చర్ వార్నింగ్, లేన్ కీపింగ్ అసిస్ట్ వంటి సాంకేతికతలు ప్రమాదాలను తగ్గించేందుకు దోహదపడతాయి.

రోడ్డు అనేది అందరి సొంతం. మనం డ్రైవ్ చేసేటప్పుడు మన లేన్‌లో ఉండటం వల్ల మనవే గాక ఇతరుల ప్రాణాలనూ కాపాడిన వాళ్ళమవుతాం. ఒక డ్రైవర్ క్రమశిక్షణ పాటిస్తే అది మరొకరికి స్ఫూర్తి అవుతుంది. సౌర వ్యవస్థలో గ్రహాలు ఎప్పుడూ పోటీపడవు. మనం మాత్రం రోడ్లపై పోటీపడుతున్నాం. ఇదే ప్రమాదాలకు కారణం. మన ప్రయాణం సురక్షితంగా ఉండాలి. మన కుటుంబాలు మన కోసం ఎదురు చూస్తున్నాయి. కాబట్టి లేన్ మారేటప్పుడు సిగ్నల్ ఇవ్వాలి, రాంగ్ సైడ్ వెళ్ళకూడదు, వేగాన్ని నియంత్రణలో ఉంచుకోవాలి, ఇతర డ్రైవర్లను గౌరవించాలి. ఇవి చిన్న విషయాల్లా అనిపించినా, నిజానికి ప్రాణాలను కాపాడే అతిపెద్ద నిర్ణయాలు.

సౌరవ్యవస్థ మనకు గొప్ప పాఠం చెబుతోంది. గ్రహాలు తమ కక్ష్యల్లో ఉండటం వల్లే విశ్వం సురక్షితంగా ఉంది. మనం కూడా అదే మార్గాన్ని అనుసరిస్తే మన రోడ్లు కూడా సురక్షితంగా ఉంటాయి. మనం లేన్‌లో ప్రయాణించడం అనేది ఒక నిర్ణయం కాదు.. అది జీవితం పట్ల గౌరవం, రోడ్లపై క్రమశిక్షణ. అంటే.. జీవితానికి రక్షణ!



○ డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి
చైర్మన్, సర్వేజనా ఫౌండేషన్

ఇరాన్‌కు అంతటి శక్తి ఎక్కడిది?

ఇరాన్ అమెరికాల మధ్య జరుగుతున్న యుద్ధం తాలూకు ఆర్థిక ప్రభావం ప్రపంచం మీద పెరుగు తోంది. ఈ రెండు దేశాల మధ్య ఒక శాంతి సయోధ్య ఎప్పుడు కుదురుతుందా అని ప్రపంచ దేశాలన్నీ వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధాన్ని గెలిచేశానని ప్రకటించుకుంటూ, హోర్ముజ్ జలసంధికి వెయ్యి కిలోమీటర్ల దూరంలో నిల్చుని డాంబికాలు పలుకుతున్నాడు. కానీ వాస్తవం వేరేలా ఉంది. అత్యంత ధనిక దేశమూ, సైనికంగా శక్తి మంతమైన దేశమై ఉండి కూడా అమెరికా గగనతలం నుంచి ఇరాన్‌పై బాంబులు, టాంహాక్ క్షిపణులు వేయడం తప్ప ఇరాన్ నేల మీద కాలు పెట్టే సాహసం చేయడం లేదు. ఈ హోర్ముజ్ దిగ్బంధం ఇంకా ఇలా ఎన్నాళ్ళు కొనసాగుతుందో ఎవరికీ అంచనాకు చిక్కటం లేదు. అమెరికా నుంచి ఇండియా వరకు చమురు గ్యాస్ ధరల మంటలు ప్రజల్ని తాకుతున్నాయి. ఎవరు ముందు తలొగ్గుతారు, నష్టాన్ని సుదీర్ఘ కాలం భరించే శక్తి ఎవరికుందీ అన్న బలాబలాల పరీక్షగా ఇది కొనసాగు తున్నది. అందరూ ఇరాన్ తలొగ్గుతుందని ఎదురుచూస్తు న్నారు. కానీ వాస్తవానికి ఒకప్పటికీ ఇప్పటికీ భౌగోళిక రాజకీయాలు చాలా మారిపోయాయి. ఇరాన్ నేడు ఒక శక్తిమంతమైన దేశంగా పునరుత్థానం పొందింది.

1971 నాటికి మధ్య ఆసియాలో చమురు ఉన్న దేశాలు, తక్కిన దేశాలు అన్నీ అమెరికా సమర్థక దేశాలుగా మారిపోయి ఉన్నాయి. కానీ ఇరాన్ మాత్రం లొంగలేదు. ఇరాన్‌లో అమెరికా తెచ్చిపెట్టిన పాలకుడు రెజా పహ్లవి షా పట్ల క్రమంగా వ్యతిరేకత మొదలైంది. పాశ్చాత్య సంస్కృతి పట్ల, ముఖ్యంగా స్త్రీలు పాశ్చాత్య దుస్తులు వేసుకోవడం పట్ల కింది వర్గం పురుషుల నుంచి ఒక పితృస్వామ్య భావజాలంతో కూడిన ప్రతిఘటన మొదలైంది. ఇస్లామిక్ విలువలు ధ్వంసం అవుతున్నా యని సనాతనవాదుల నుంచి వ్యతిరేకత మొదలైంది. వియత్నాంలో అమెరికా యుద్ధం, అల్జీరియాలో ఫ్రాన్స్ ఘాతుకం, పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాక్రమణ వంటి పరిణామాల తర్వాత అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతి రేకంగా ఇరాన్‌లో ప్రజాభిప్రాయం గట్టిగా నాటుకుంది. ఖొమైనీ, అతని సమర్థకులు ఇరాన్‌ను ఒక ఇస్లామిక్ గణతంత్ర రాజ్యంగా ప్రకటించారు. ‘ఇస్లామిక్ విప్లవ రక్షణ సమితి’ అనే ఒక సాయుధ మిలిటరీ అనుబంధ సంస్థను స్థాపించారు. 1979లో దేశంలో అన్ని వ్యవస్థలనూ స్వాధీనం చేసుకుని ఒక ఇస్లామిక్ రాజ్యానికి స్థాపన చేశారు. ఎమర్జెన్సీ డిక్లేర్ చేసి వామపక్షవాదుల్ని, రెజా పహ్లవీ షా సమర్థకులందరినీ జైల్లో వేశారు. ఇస్లామిక్ కౌన్సిల్ నిర్ణయించిన పరిధిలో ప్రజాస్వామ్యం అమలు అయ్యే వ్యవస్థను తయారు చేశారు. పేద వర్గాల కనీస అవసరాలను ఫ్రీ రేషన్ ద్వారా తీరుస్తూ ప్రజాదరణ పొందారు. అమెరికాను ప్రపంచ శత్రువుగా ప్రకటించి, ‘అమెరికా చావు రావాలి’ అని నినాదాలు ఇచ్చి, ప్రచార మాధ్యమాల్లో రోజూ అమెరికాని అవమానించే ప్రకట నలు చేసేవారు. 1979 విప్లవం జరిగిన కొన్ని నెలలకు ఒక రోజు వందమంది విద్యార్థులు అమెరికా రాయబార కార్యాలయంలోకి వెళ్లి, 64 మంది దౌత్య సిబ్బందిని బందీలుగా పట్టుకున్నారు. వారిని విడిపించడానికి ‘ఆపరేషన్ ఈగిల్ క్లా’ పేరుతో అమెరికా కమెండోలను



పంపిస్తే వారి హెలికాప్టర్లు ఇరాన్ ఎడారిలో కూలి పోయాయి. చివరికి అమెరికా ఏడాదిపాటు బతిమిలాడి, ఇరాన్‌కి చెందిన 8 బిలియన్ డాలర్లను ఇచ్చిన తర్వాతే బందీలకు విముక్తి లభించింది. ఇది ఇరాన్‌కు అతి పెద్ద విజయం. అమెరికా ప్రెసిడెంట్ జిమ్మీ కార్టర్‌కు అతిపెద్ద అవమానం. అప్పటి నుంచి ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడం దీర్ఘకాలిక లక్ష్యంగా అమెరికా ఎదురు చూస్తూనే ఉంది.

1981లో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ని ఉసిగొలిపి ఇరాన్‌పై ఒక విఫల యుద్ధం చేయించింది. ఎనిమిదేళ్ళ ఆ యుద్ధంలో ఇరాన్ అజేయంగా నిలవడమే గాక తమ దేశాన్ని ఎలా నిర్మాణం చేయాలో, ఎలా రక్షించుకోవాలో నేర్చుకుంది. ఒక దీర్ఘకాలిక రక్షణ వ్యూహాన్ని కూడా అమలు చేయటం ప్రారంభించింది. పాలస్తీనా అంశాన్ని అన్ని గల్ఫ్ దేశాలూ వదిలేసి, అబ్రహం తీర్మానం అని ఇజ్రాయెల్‌తో వాణిజ్య సంబంధాలు పెట్టుకున్న సందర్భంలో, ఇరాన్ మాత్రం అన్ని నష్టాలనూ భరిస్తూ, పాలస్తీనా ప్రజలకు తన ధర్మంగా మద్దతు ఇచ్చింది. 1984లో లెబనాన్‌లో హిజ్బుల్లా సంస్థను నిర్మించి, లెబనాన్‌ను ఇజ్రాయెల్ ఆక్రమణ నుంచి విముక్తి చేసి కాపాడే శక్తిగా దాన్ని రూపొందించింది. 1991లో సోవియెట్ యూనియన్ పడిపోయిన దశలో సిరియాకు మద్దతు ప్రకటించి ఇజ్రాయెలీ దాడుల నుంచి రక్షించే బాధ్యతను తీసుకుంది. తమపై టెర్రరిస్టు దేశం అనే ముద్రపడినా భయపడకుండా తన నైతిక కోణాన్ని ఇరాన్ స్పష్టంగా అన్ని విధానాల్లో అమలు చేసింది.

అమెరికా వ్యతిరేక రాజకీయాల వల్ల ఇరాన్ చాలా నష్టపోయిన మాట వాస్తవం. అమెరికన్ ఆంక్షల వల్ల తన చమురును చవకగా అమ్ముకుని ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. అయినప్పటికీ, ఇరాన్ తన అంతర్గత అధికారాన్ని నిలబెట్టుకోగలిగింది. ఆత్మ నిర్భరతను నిర్మించుకోవడానికి యూనివర్సిటీల్లో సైన్స్ టెక్నాలజీ విద్యలకు ప్రాధాన్యమిచ్చింది. అణు విద్యుత్, వ్యవసాయ సాంకేతికత, పెట్రో కెమికల్స్, కెమికల్స్ వంటి రంగాల్లో భారీగా అభివృద్ధి సాధించింది. విచిత్రంగా, ఒకపక్క హిజాబ్ వేసుకోవాలని బలవంతపెడుతూనే, స్త్రీలను ఆరోగ్య, విద్య, సాంకేతిక రంగాల్లో విపరీతంగా ప్రోత్సహించింది. ముస్లిం దేశాల్లో అత్యధికమైన మహిళా కార్మికులు గలిగిన ప్రత్యేకమైన దేశంగా ఎదిగింది.

రెజా పహ్లవి షా మొదలుపెట్టిన అణు ఇంధన కార్య క్రమాన్ని ఇరాన్ పునరుద్ధరించింది. దీనితో ఆ దేశం అణు బాంబు తయారు చేస్తోందని ఇజ్రాయెల్ పుకార్లు పుట్టిం చింది, ఇరాన్‌పై అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఎమర్జెన్సీ మందులు కూడా దిగుమతి చేసుకోనీకుండా అమెరికా నిషేధం విధించింది. ఇరాన్ నుంచి గ్యాస్ దిగుమతికి పైపులైన్ నిర్మాణం చేద్దామన్న భారత్‌ను బెదిరించి ఆపింది. కానీ ఇంత అష్టదిగ్బంధనంలోనూ ఇరాన్ లొంగిపోయేకన్నా పోరాడడమే సరైన మార్గమన్న కర్బలా స్ఫూర్తిని ప్రదర్శించింది. తమ దేశంపై ఏదో ఒక రోజు ఇజ్రాయెల్–అమెరికాలు దాడి చేస్తాయని ముందే ఊహించిన ఇరాన్.. ఆ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఒక పథకం ప్రకారం సిద్ధమైంది. ఈలోపు మారిన గ్లోబల్ పరిస్థితులు కూడా ఇరాన్‌కు కలిసొచ్చాయి.

> **ఈ యుద్ధంలో అమెరికా గత అరవై రోజులుగా ఇరాన్‌పై వేల దాడులు చేసింది. ఇరాన్ వైమానిక, నౌకాదళ శక్తిపైన, ఆర్థిక వసతుల మీద బాంబులు వేసింది. రెండు వేల మందికి పైగా ప్రజలను చంపింది. అయినా ఆత్మస్థైర్యం కోల్పోని ఇరాన్‌ను చూస్తే అది సాధారణ దేశం కాదు అనిపిస్తుంది.**

2014 తరవాత చైనా–రష్యాలకు వ్యతిరేకంగా అమెరికా చేసే రహస్య యుద్ధం ఇరాన్‌కు ఒక కొత్త జీవితాన్నే ఇచ్చింది. తన మీద దాడి చేస్తే ఎదుర్కోవడానికి కొన్ని వేల క్షిపణులను అండర్‌గ్రౌండ్ గుహల్లో రహస్యంగా నిర్మించి ప్రపంచాన్నే ముక్కున వేలు వేసుకునేలా చేసు కుంది. వీటికి రష్యా, చైనాల సహకారం ఉందన్నది జగ మెరిగిన సత్యం. ఈ రోజు ఇరాన్ దగ్గర 4 వేల కిలోమీటర్లు ప్రయాణించగల హైపర్ మిస్సైల్స్ ఉన్నాయి. టెలివీవ్, హైఫాలను తన క్షిపణులతో గట్టిగా కొట్టి చూపించింది కూడా. కొత్తగా వచ్చిన డ్రోన్ టెక్నాలజీ మీద దృష్టి సారించి ఎంతో విలువైన రాడార్లను, విమానాశ్రయాలను, నౌకలను అతి చౌకగా ధ్వంసం చేయగలిగే FPV డ్రోన్లను తయారు చేసింది. ఈ డ్రోన్ యుద్ధతంత్రం వల్లనే నేడు అమెరికా దగ్గర మిస్సైళ్ళు అయిపోయి, యుద్ధం ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే ఇరాన్ హోర్ముజ్ సంధిని నియంత్రించే మినీ సబ్‌మెరైన్లను తనకు కావాల్సిన రీతిలో సొంత శక్తితో తయారు చేసుకో గలిగింది. హోర్ముజ్‌ను మూసివేసే శక్తి ఇరాన్‌కు ఉందన్న స్పృహ అమెరికాకు లేకపోవడం దాని అహంకారానికి పరాకాష్ఠ. మారిన బహుళ ధ్రువ ప్రపంచంలో చైనా, రష్యాలను తన ప్రత్యర్థులుగా అమెరికా ప్రకటిస్తోంది. దాంతో ఆ దేశాలు కూడా అదే రీతిన స్పందించాల్సిన అవసరం కలుగుతోంది. అందువల్లనే ఆ దేశాలు ఇరాన్‌ను తమ వ్యూహాత్మక భాగస్వామిగా చేసుకున్నాయి. అమెరికాతో పోరులో ఇరాన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ దేశాలు ఓడిపోనివ్వవు. అందుకే రష్యా ఎస్–400 అనే బ్రహ్మాండమైన రక్షణ వ్యవస్థను ఇరాన్‌కు ఇచ్చింది. రాబోయే రోజుల్లో ఇంకా ఆయుధాలిస్తుంది. మరోపక్క ఎన్ని దేశాలు తిరస్కరించినా చైనా ఇరాన్ చమురును కొనే కస్టమర్ అయ్యింది.

ఈ యుద్ధంలో అమెరికా గత అరవై రోజులుగా ఇరాన్‌పై వేల దాడులు చేసింది. ఇరాన్ వైమానిక, నౌకా దళ శక్తిపైన, ఆర్థిక వసతుల మీద బాంబులు వేసింది. రెండు వేల మందికి పైగా ప్రజలను చంపింది. ఇరాన్ సుప్రీం ఇమాం అలీ ఖొమైనీని, అతని భార్యను, కూతు రును, అల్లుడిని, ఇంటలిజెన్స్ చీఫ్ లరిజాను, ఇంకా 39 మందికి పైగా నాయకులను హతమార్చింది. అయినా ఆత్మస్థైర్యం కోల్పోని ఇరాన్‌ను చూస్తే అది సాధారణ దేశం కాదు అనిపిస్తుంది. వలీ నస్ర్ వంటి మేధావుల ప్రతిపా దన ప్రకారం, ఇరాన్ సోషల్ సైకాలజీ మూడు పునాదుల మీద నిర్మితమైంది. మొదటిది– ఇరాన్ సమాజం ఎప్పుడూ కర్బలాలో షియా విషాదాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఘటనా భావజాలాన్ని నిర్మించుకుంది. రెండు, ఇస్లామిక్ సంప్రదాయంతో పాటు ప్రజాస్వామ్యం, ఆత్మనిర్భరత, సాంకేతిక స్వతంత్రతను నమ్ముకుంది. మూడు, తన అవసరాల కోసమని తన విలువలను తాకట్టు పెట్టే రాజకీయాలు ఆ దేశం ఎన్నడూ చేయలేదు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు తాను ఓడిపోయానని చెప్పడం ఇష్టం లేదు. న్యాయంగా అమెరికా గల్ఫ్ వదిలి పెట్టి వెళ్లడమే ఈ సమస్యకు పరిష్కారం. అది ఎప్పటికైనా జరగాల్సిందే. గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌తో సంధి చేసుకుని శాంతియుత సహజీవనం చేయక తప్పదు. ఇక ఇజ్రా యెల్‌ను కట్టడి చేసుకునే బాధ్యత అమెరికాదే. అఖండ జియోనిస్ట్ ఇజ్రాయెల్ ఇక అసాధ్యం. నెతన్యాహు తన నేరాలను తప్పించుకోవడానికి చేసే చివరి యుద్ధం ఇది అని విమర్శకులు అంటున్నారు. మారిన భౌగోళిక రాజకీ యాలను భారత్ సరిగా అర్థం చేసుకుంటుందా లేక అమెరికాకు దాసోహం అంటుందా అన్నది చూడాలి.

■ ప్రొ. ఆర్.వి.రమణమూర్తి

తొలి మాండలిక నాటిక ‘తుఫాన్’

తెలుగు నాటక పరిషత్ వ్యవస్థలో అసలు సిసలైన మాండలికాన్ని ఉపయోగించి ఆధునిక తెలుగు సాంఘిక నాటక మాండలిక పితామహునిగా రాణించిన ఖ్యాతి పులుగుండ్ల రామకృష్ణయ్యకు దక్కింది. ‘తుఫాన్’ నాటిక రచనతో పూర్తిస్థాయి మాండలిక నాటకాలు రావటానికి ఆద్యులైన పులుగుండ్ల కృషి చిరస్మరణీయమైనది. తెలుగు నాటకరంగం ఇప్పటికీ ఈ తుఫాన్ నాటికను గుర్తుంచుకుని ఉంది.

తెలుగు సాంఘిక నాటక చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిన తుఫాన్ నాటికను 1946లో పులుగుండ్ల రచించారు. 1948లో ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీలలో దాన్ని ప్రదర్శించగా, ‘ఉత్తమ రచన’గా ఆ నాటిక ఎంపికై, పులుగుండ్లకు బహుమతిని తెచ్చిపెట్టింది. నాడు ఈ నాటికను ఆంధ్ర సమాజం పక్షాన ప్రదర్శించేవారు. ఆంధ్ర సమాజం నిర్వాహకులలో తూములూరి శివరామయ్య, రేబాల దశరథరామిరెడ్డి, పులుగుండ్ల రామ కృష్ణయ్య, సినీ నటుడు రమణారెడ్డి, గాడేపల్లి రామయ్య వంటి ప్రము ఖులు ఉండేవాళ్ళు. ఈ నాటికలోని రమాదేవి పాత్రను రామతిలకం, శేషమ్మ వంటి గొప్ప నటీమణులు పోషించేవారు. ఆకాశవాణి మద్రాస్ కేంద్రం నుంచి అనేకసార్లు ఈ నాటిక ప్రసారమైంది. శ్రీ వేంకటేశ్వర విశ్వవి ద్యాలయం వారు ఎంఏ తెలుగు విద్యార్థులకు పాఠ్యాంశంగా కూడా ఈ నాటికను ప్రవేశపెట్టారు. 1965లో పోలీస్ సంక్షేమ నిధికి ఎన్టీ రామారావు విరాళాలు సేకరించినప్పుడు... ఈ తుఫాన్ నాటికను కాంతారావు, రాజ నాల, రమణారెడ్డి వంటి వారు రాష్ట్రంలో విస్తృతంగా ప్రదర్శించారు. ఈ నాటికలోని రాఘవరెడ్డి పాత్ర పోషణకు గానూ గాడేపల్లి రామయ్యకు ‘మద్రాసు తెలుగు సంఘం’ రజత పథకాన్ని, రేబాల పట్టాభిరామిరెడ్డి బంగారు పథకాన్ని బహూకరించారు.

> **తుఫాన్ నాటికలో– గ్రామాల్లో రెడ్డి సామాజికవర్గంలోని ఇళ్లల్లో ఉండే మాండలికాన్ని, ఆ తీరుతెన్నులను సహజంగా, సంపూర్ణంగా ఆవిష్కరించారు. దీనిపై సామాజికంగా ఏమైనా వ్యతిరేకత వస్తుందేమోనని, సరైన ఆదరణ లభించదేమోనని నిర్వాహకులు మొదట వెనకడుగు వేశారు. కానీ, ప్రదర్శన అనంతరం ప్రేక్షకాదరణ విపరీతంగా లభించటంతో ఆ నాటికను ఇరవై అయిదుసార్లు ప్రదర్శించారు!**



పులుగుండ్ల రామకృష్ణయ్య నెల్లూరు సమీపంలోని దర్బాలమెట్ట కండ్రిగలో 1911 మే 5న జన్మించారు. నెల్లూరు వీఆర్ హైస్కూల్లో సుదీర్ఘ కాలం ఉపాధ్యాయులుగా పనిచేస్తూనే నాటక రంగానికి కొత్త రూపురే ఖలు తీసుకువచ్చారు. ‘తలవని తలంపు, విముక్తి, వాపస్, విజయపతాకం, గాంధీ బాల్యం...’ వంటి నాటి కలను రచించారు. కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలం నాటకాన్ని శకుంతల పేరుతో పూర్తి వ్యవ హారికంలోకి పులుగుండ్ల అనువదించారు. తుఫాన్ నాటికలో– గ్రామాల్లో రెడ్డి సామాజికవర్గంలోని ఇళ్లల్లో ఉండే మాండలికాన్ని, ఆ తీరుతెన్నులను సహజంగా, సంపూర్ణంగా ఆవిష్కరించారు. దీనిపై సామాజికంగా ఏమైనా వ్యతిరేకత వస్తుందేమోనని, సరైన ఆదరణ లభించదేమోనని నిర్వాహకులు మొదట వెనకడుగు వేశారు. కానీ... ఆత్రేయ, తూములూరు శివరామయ్య, రేబాల దశరథరామిరెడ్డి, రమణారెడ్డి వంటి ప్రముఖుల భరోసాతో నాటికను ఆ ఏడాది అక్టోబర్ 19న నెల్లూరు దసరా ఉత్సవాల్లో మొదటిసారిగా ప్రదర్శించారు. ప్రేక్షకాదరణ విపరీ తంగా లభించటం, అన్ని సామాజికవర్గాల వారు కూడా ఆనందంగా స్పందించడంతో ఆ నాటికను ఇరవై అయిదుసార్లు ప్రదర్శించారు! వీరి శకుంతల నాటకాన్ని ఎస్వీ యూనివర్సిటీలో పీయూసీ వారికి ఉపవాచ కంగా కూడా ప్రవేశపెట్టారు. 2002 నవంబర్ ఒకటో తేదీన పులుగుండ్ల రామకృష్ణయ్య దివికేగినా, మాండలిక నాటకాలకు జీవ ప్రదాతగా చరి త్రలో ఎప్పటికీ ఆయన నిలిచే ఉంటారు.

○ ఈతకోట సుబ్బారావు

(నేడు పులుగుండ్ల రామకృష్ణయ్య జయంతి)

ఏపీ పురోగతికి అంతర్జాతీయ గుర్తింపు

ఒక దేశం లేదా రాష్ట్రం ఆర్థికంగా ఎదగాలంటే కేవలం వనరులు ఉంటే సరిపోదు, వాటిని సంపదగా మార్చగల విజన్ ఉన్న నాయకత్వం కావాలి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ప్రతిష్ఠాత్మక ‘ద ఎకనమిక్ టైమ్స్’ సంస్థ ‘బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్’ పుర స్కారంతో గౌరవించడం ఆ విజన్‌కు లభించిన అంతర్జాతీయ గుర్తింపు. ఇది కేవలం ఒక వ్యక్తికి దక్కిన గౌరవం కాదు; గత అయిదేళ్ల అనిశ్చితి నుంచి ఆంధ్రప్రదేశ్ మళ్ళీ ప్రగతిపథంలోకి మళ్లిందని, పెట్టుబడులకు మళ్ళీ సురక్షిత మైన స్వర్గధామంగా మారిందని ప్రపంచానికి చాటి చెప్పే బలమైన సంకేతం. ఆధునిక భారతదేశ ఆర్థిక చరిత్రలో కొన్ని పేర్లు కేవలం పదవులకే పరిమితం కావు, అవి ఒక శకానికి నాంది పలుకుతాయి. అటు వంటి పేర్లలో చంద్రబాబుది అగ్రస్థానం. విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థను, అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని అతి తక్కువ కాలంలోనే తిరిగి పెట్టుబడుల స్వర్గధామంగా మార్చడం ఆయన పరిపాలనా దక్షతకు నిదర్శనం.



చంద్రబాబు సంస్కరణల ప్రస్థానం నేటిది కాదు. 1990వ దశకంలో ప్రపంచం ఇంకా గ్లోబలైజేషన్ వైపు అడుగులు వేస్తున్న తరుణంలోనే ఆయన హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చి భారతదేశాన్ని సాఫ్ట్‌వేర్ రంగంలో అగ్రగామిగా నిలిపారు. నేడు నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన ముందున్న సవాలు మరింత పెద్ద దైనా, అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ సుల భతర వాణిజ్యంలో (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ప్రథమ స్థానంలో ఉండేది, కానీ నేడు ఆయన దానిని మరో మెట్టు ఎక్కించి ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ అనే సరికొత్త లక్ష్యంతో ముందుకు వెడుతున్నారు. పారి శ్రామిక అనుమతుల ప్రక్రియలో ఎర్ర తివాచీ పరిచి, నిర్ణయాల్లో వేగాన్ని పెంచడం ద్వారా పెట్టుబడిదారులలో అచంచలమైన నమ్మకాన్ని కలిగించారు. ఈ నమ్మకమే కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే సుమారు రూ.20 లక్షల కోట్ల మేర పెట్టుబడుల ఒప్పందాలు రాష్ట్రానికి వచ్చేలా చేసింది. ఇది ఒక నాయకుడిపై ఉన్న నమ్మకం మాత్రమే కాదు, ఆ నాయకుడు సృష్టించిన వ్యవస్థపై ఉన్న భరోసా.

చంద్రబాబు సంస్కరణలు కేవలం ఐటీ రంగమే కాకుండా, భవిష్యత్తు అవసరాలైన గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్, తయారీ రంగాలను ఏపీకి రప్పించడంలో అసాధారణమైన చొరవను చూపుతున్నాయి. ఎకనమిక్ టైమ్స్ జ్యూరీ సైతం ఆయనలోని ‘టెక్నాలజీ బేస్డ్ గవర్నెన్స్’ను ప్రత్యేకంగా ప్రశంసించడం గమనార్హం. ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత, జిల్లా కలెక్టర్లకు నిర్దిష్టమైన రేటింగ్ సిస్టమ్, పెట్టుబడిదారులకు ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా ‘ఎస్క్రో అకౌంట్’ల వంటి వినూత్న ఆలోచనలు భారత దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలబెట్టాయి. సునీల్ భారతీ మిట్టల్, సజ్జన్ జిందాల్, ఉదయ్ కోటక్ వంటి భారత పారిశ్రామిక దిగ్గజాలతో కూడిన జ్యూరీ ఏకగ్రీవంగా చంద్రబాబును ఎంపిక చేయడం వెనుక ఆయన పట్ల పారిశ్రామిక లోకంలో ఉన్న క్రెడిబిలిటీ స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో అరుణ్ జైట్లీ, ఎస్.జైశంకర్ వంటి జాతీయ స్థాయి మేధావులు అలం కరించిన ఈ వేదికపై ఇప్పుడు మన నాయకుడు నిలవడం ప్రతి తెలుగువాడి ఆత్మగౌరవాన్ని హిమాలయాలంత ఎత్తుకు తీసుకెళ్లింది. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా, విశాఖను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ఆయన సంకల్పానికి ఈ ‘బిజినెస్ రిఫార్మర్’ అవార్డు ఒక శక్తిమంతమైన ఊతాన్నిస్తుంది. రాజకీయాలకు అతీతంగా, అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ గౌరవాన్ని రాష్ట్ర పునర్నిర్మాణానికి ఒక శుభసూచకంగా, ‘బ్రాండ్ ఆంధ్రప్రదేశ్’ పునరుజ్జీవంగా భావిస్తున్నారు.

చంద్రబాబు నాయకత్వం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రథానికి ఇరుసు లాంటిది. ఒక నాయకుడికి విజన్ ఉంటే, ఆ విజన్ వెనుక ఒక జాతి కదిలితే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో ఆయన నిరూపిస్తున్నారు. ఈ అవార్డు కేవలం ఒక వేడుక కాదు, ఇది ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శకానికి నాంది, రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో ఒక మైలురాయి.

• కలిశెట్టి అప్పలనాయుడు
లోక్‌సభ సభ్యులు, విజయనగరం



గుంటూరు ఛానల్‌ను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, అప్పటి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే బూర్ల (పాత చిత్రం)

20 ఏళ్ల కల నెరవేర్చిన పెమ్మసాని

- గుంటూరు చానల్ ఆధునికీకరణకు రూ.369.20 కోట్ల మంజూరు
- కేంద్ర మంత్రి ప్రతిపాదనకు ప్రభుత్వం అనుమతి

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల గుంటూరు జిల్లా ప్రజల కల సాకరమైంది. 33 వేల ఎకరాల ఆయకట్టుకు, 33 గ్రామాల ప్రజలకు ఆసరా ఏర్పడింది. ప్రజలకు ఇచ్చిన హామీని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నిలబెట్టుకున్నారు. గుంటూరు చానల్ ఆధునికీకరణకు రూ.369.20 కోట్లు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. కృష్ణా డెల్టా సిస్టంలో భాగంగా 0 నుంచి 47 కిలోమీటర్ల వరకు ప్రధాన, అనుబంధ కాల్వల సమగ్ర అభివృద్ధి పనులకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం జి.ఒ.ఆర్.టి నంబరు 217 విడుదల చేసింది. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ గుంటూరు జిల్లాలో సాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేసి, రైతులకు స్థిరమైన నీటి సౌకర్యాలను పెంచుతుందని పేర్కొన్నారు. ఆధునికీ కరణ తో నీటి వినియోగ సామర్థ్యం పెరిగి, వ్యవసాయ ఉత్పాదకతకు ఊతం లభిస్తుందన్నారు. ఈ గుంటూరు చానల్ ఆధునికీకరణ కోసం మంత్రి నారా లోకేశ్, పొన్నూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, రామాంజనేయులు కూడా కృషి చేశారన్నారు. 'రైతుకు నీరు అందితేనే అభివృద్ధి సాధ్యం.. ఈ ప్రాజెక్ట్ ఆ దిశగా కీలక అడుగు' అని పేర్కొన్నారు. ప్రాజెక్ట్‌ను త్వరితగతిన ప్రారంభించేందుకు కృషి చేస్తామని చెప్పారు. గుంటూరు ప్రాంతానికి ఈ కీలక ప్రాజెక్ట్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

- కృష్ణా నది కుడి ఒడ్డున ప్రకాశం బ్యారేజి పైప్రాంతం నుంచి ప్రారంభమయ్యే ఈ కాలువ సుమారు 47 కిలోమీటర్ల పొడవుతో తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని, గుంటూరు, చెబ్రోలు, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాలకు సాగు నీరు అందిస్తోంది. 27 వేల ఎకరాల ఆయకట్టు లాభపడుతోంది. గుంటూరు, మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు..33 గ్రామాలకు తాగునీటి సరఫరాలో కీలకంగా ఉంది.
- పెరుగుతున్న అవసరాల దృష్ట్యా గుంటూరు కాలువ ప్రాజెక్ట్‌ను 30 కిలోమీటర్ల విస్తరణ చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీంతో అదనంగా 41 గ్రామాలకు తాగునీరు, సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

దశాబ్దాల కల నెరవేరింది



గుంటూరు చానల్ ఆధునికీకరణకు నీటిపారుదల శాఖ నిధులు మంజూరు చేయడం శుభపరిణామం. నాటి మా పోరాటం ఫలించింది. పెదకాకాని, చేబ్రోలు మండలాల రైతుల దశాబ్దాల కల నెరవేరింది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- ధూళిపాళ్ళ నరేంద్ర, ఎమ్మెల్యే, పొన్నూరు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



గుంటూరు చానల్ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు. ఇక పర్చూరు, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల గ్రామీణుల తాగు, సాగు నీరుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. 2017లోనే ప్రాజెక్టుకు టెండర్లు పిలిచినా.. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది.

- రామాంజనేయులు, ఎమ్మెల్యే, ప్రత్తిపాడు

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ చర్యల్లో భాగంగా ఆన్‌లైన్ వేదికగా కూటమి ప్రభుత్వం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలిసారిగా 13 నుంచి 19 ఏళ్ల మధ్య కౌమార విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 'ఆంధ్రప్రదేశ్ స్కూల్ హెల్త్ వెల్నెస్ ప్రోగ్రాం' కింద డిజిటల్ పోర్టల్‌ను రూపొందించింది. వైద్య సేవల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న ప్రభుత్వం తాజాగా ప్రివెన్షన్ విధానంలో విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణ ప్రాధాన్యం గురించి శాస్త్రీయంగా వివరిస్తోంది.



కౌమారానికి.. ఆరోగ్య పాఠం

- విద్యార్థుల కోసం నిర్దిష్ట ఆరోగ్య సమాచారం
- వైద్య, ఆరోగ్యశాఖ ఏపీఎస్ హెచ్‌డబ్ల్యూపీ పోర్టల్
- 11 అంశాల్లో షార్ట్ వీడియో పాఠాలు
- ఈ-లెర్నింగ్, హెల్త్ క్విజ్ పోటీలు
- 80 శాతం మార్కులొస్తే..సర్టిఫికెట్లు
- ఆహార్యం, ఆరోగ్య నిర్మాణానికి సరికొత్త వేదిక

గుంటూరు మెడికల్, మే 4 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులు, మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా అవసరమైన సమాచారం పొందుతారు. ఈ క్రమంలో రకరకాల కారణాల వల్ల విశ్వసనీయత లేని సమాచారంతో తప్పుదోవపడుతున్నారు. ఈ ధోరణికి చెక్ పెట్టేందుకు.. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా.. నిర్దిష్ట విశ్వసనీయ, శాస్త్రీయ సమాచారాన్ని స్వీయ విధానంలో (సెల్ఫ్ లెర్నింగ్) నేర్చుకునేలా 'ఏపీ ఎస్ హెచ్‌డబ్ల్యూపీ' పోర్టల్‌ను అందుబాటులోనికి తెచ్చామని రాష్ట్ర ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. రాష్ట్ర కిశోర ఆరోగ్య కార్యక్రమంలో 'డిజిటల్ లెర్నింగ్ మేనేజ్‌మెంటు సిస్టం' ఈ-పోర్టల్‌ను రూపొందించారు. దీనిపై అవగాహనకు మాస్టర్ ట్రైనర్లతో పాటు జిల్లాలో 150 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకుల చొప్పున శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

11 అంశాలపై సమగ్ర వివరణ

ఈ పోర్టల్‌లో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా 11 ప్రధాన అంశాల సమాచారాన్ని (మిగతా 7వ పేజీలో)

మ్యాజిక్.. మురుగు మాయం



మార్టూరు మండలం చిమ్మిరిబండలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్

పల్లెల్లో మురుగు, వర్షపు నీటి నిర్వహణలో ప్రభుత్వం మ్యాజిక్ చేస్తోంది. ఇంకుడు గుంతల తరహాలో విస్తృతంగా మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కాలువల నీరు నేరుగా భూమిలోకి ఇంకడం ఈ మ్యాజిక్ డ్రెయిన్‌ల ప్రత్యేకత. ఇవి బహుళ ప్రయోజనకరం. మురుగు సమస్య తీరి, తద్వారా దోమల వ్యాప్తిని పూర్తిగా అరికట్టవచ్చు. ఈ విధానం ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నిధులు ఆదా చేయడంతో పాటు.. భూగర్భ జలాలు పెరుగుదలకు దోహద పడుతుంది. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ ఆర్థిక భారం కూడా తగ్గనుంది. మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణం ప్రయోగాత్మకంగా పలు గ్రామాల్లో చేపట్టారు. వీటి ఫలితాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం అన్ని గ్రామాలకు విస్తరించాలని ప్రభుత్వం సంకల్పించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 11 గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద డ్రెయిన్‌లు నిర్మిస్తున్నారు. మొత్తం 7.23 కిలోమీటర్లు పనులు చేపట్టగా.. ఇప్పటికే 3.66 కిలోమీటర్ల పొడవున పనులు పూర్తయ్యాయి.

పల్లెల్లో మురుగు సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఉమ్మడి జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా 11 గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు
- క్షేత్రస్థాయి అనంతరం.. గ్రామాల్లో విస్తరణ
- వడపోతగా వ్యర్థ జలాలు భూమిలోకి ఇంకడం ప్రత్యేకత
- భూగర్భ జలాల పెంపునకు దోహదం
- కాంక్రీట్ డ్రెయిన్ కంటే చాలా తక్కువ వ్యయం
- ప్రజారోగ్యానికి భరోసా..దోమల బెడదకు చెక్..



ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

టీడీపీ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్లు నిర్మించారు. కానీ, చాలా చోట్ల మురుగు కాలువలు నిర్మించలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ కాలువల నిర్మాణం జరగలేదు. దీంతో మురుగంతా రోడ్లపైకి చేరి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. దోమల బెడద అధికమై.. పల్లె ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమమే.. ఈ మ్యాజిక్ డ్రెయిన్‌లు. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు నేరుగా భూమిలోకి ఇంకే విధంగా కాలువలు నిర్మిస్తారు. సిమెంట్ రోడ్డుకు పక్కన ఈ మ్యాజిక్ డ్రెయిన్‌లు నిర్మిస్తున్నారు.

11 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్ట్..

మూడు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద 11 గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణం చేపట్టారు. పల్నాడు జిల్లాలోని దుర్గి, ఈపూరు, క్రోసూరు, నాదెండ్ల మండలాల్లోని నాలుగు గ్రామాల్లో పనులు ప్రారంభించారు. దుర్గి మండలం ఓబులేసునిపల్లెలో 560 మీటర్ల పొడవున నాలుగు మ్యాజిక్ డ్రెయిన్‌లు చేపట్టగా.. మూడు కాలువల నిర్మాణం 410 మీటర్ల పొడవున పూర్తయింది. ఈపూరు మండలం గుండేపల్లిలో 1,225 మీటర్ల పొడవునా.. 12 కాలువల పనులు ఆరంభించగా.. ఆరు కాలువలు 650 మీటర్ల పొడవున పూర్తయ్యాయి. క్రోసూరు (మిగతా 7వ పేజీలో)



ఉపాధికి ఊరట!

- శ్రామికుల ఖాతాల్లో వేతన బకాయిలు
- ఫిబ్రవరి 23 వరకు చేసిన పనులకు చెల్లింపులు
- పనుల విషయంలో గత విధానమే అమలు
- ఈ నెలలోనూ పాత పద్ధతే..
- పెండింగ్ పనుల పూర్తికి మరికాస్త గడువు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

నాలుగు రోజుల నుంచి ఉపాధి హామీ పథకం శ్రామికుల ఖాతాల్లో వేతన బకాయిలు జమ అవుతున్నాయి. వారంలో అందరికీ డబ్బులు పడతాయని డ్వామా విభాగం చెబుతోంది. గత డిసెంబరు 6 నుంచి ఫిబ్రవరి 23 వరకు పరిమితి పెట్టుకుని.. అప్పటి వరకు ఉన్న బకాయిలను తొలి దశలో జమ చేస్తున్నారు. మరో రెండు నెలల వేతనాలు కూడా విడుదల అవుతాయనే ధీమాను డ్వామా వ్యక్తం చేస్తోంది. ఇది శ్రామికులకు ఊరట కాగా, ఉపాధి పథకానికి వీబీ జీ రామ్‌జీగా పేరు మార్చిన కేంద్రం.. నూతన మార్గదర్శకాలు మే నెల వరకు మినహాయించి, పాత విధానమే కొనసాగుతుందని చెప్పడం కాంట్రాక్టర్లకు సాంత్వన కలిగించింది. గ్రామాల్లో 20 పనులు మాత్రమే మనుగడలో ఉండాలనే నిబంధన అమలు కూడా వాయిదా పడడంతో పెద్ద ఎత్తున పనులు జరుగుతున్నాయి.

పెండింగ్ చెల్లింపులు ఇలా..

గతేడాది డిసెంబరు మొదటి వారం వరకు మాత్రమే శ్రామికులకు వేతనాలు జమ చేసిన కేంద్రం ఆ తర్వాత విడుదల చేయలేదు. ఎట్టకేలకు ఏప్రిల్ నెల చివరి వారంలో బకాయిలు మొత్తం విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిసెంబరు నుంచి ఏప్రిల్ ముగింపు వరకు దాదాపు రూ.10 కోట్ల బకాయిలు ఉపాధి శ్రామికులకు చెల్లించాల్సి ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరి 23 వరకు కటాఫ్ పెట్టుకుని వారి ఖాతాల్లో దాదాపు రూ.7 కోట్ల వరకు జమ అయ్యే ప్రక్రియ కొనసాగుతోంది. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాల్లో దాదాపు రూ.17 కోట్ల వరకు బకాయిలు ఉండగా, ప్రస్తుతం శ్రామికుల ఖాతాల్లో రూ.11 కోట్ల వరకు జమ అవుతున్నాయి. పెండింగ్ వేతనాలకు మోక్షం కల్పించడంతో శ్రామికులు పెద్ద ఎత్తున జలధార పనుల్లో పాల్గొనే అవకాశం ఏర్పడింది.

ఒత్తిడి నుంచి ఉపశమనం

ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే ఉపాధి హామీ పథకం పేరును వీబీ జీ రామ్‌జీగా (మిగతా 7వ పేజీలో)



ఉష్ణోగ్రత

5-5-26	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	38	28
నరసరావుపేట	40	25
రెంటచింతల	42	25
బాపట్ల	36	28
చీరాల	36	28

దుర్గమ్మ భూములు దోచేశారు!



పాములపాడులోని దుర్గగుడికి చెందిన భూమి

- తాడికొండ మండలం పాములపాడులో విలువైన 70 సెంట్లు
- మరో 235 చదరపు గజాలు కూడా హాంఫట్
- రికార్డుల పరిశీలనలో గుర్తించిన దుర్గగుడి ఈవో
- భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు

విజయవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి మండలం ధరణికోట గ్రామానికి చెందిన బొందలపాటి రాజమ్మ 2004, ఆగస్టు 23న తనకున్న స్థిరాస్తుల్లో కొంత భూమిని పలు దేవాలయాలకు విరాళంగా ఇచ్చారు. తాడికొండ మండలం పాములపాడు గ్రామంలోని సర్వే నెంబరు 433లో మొత్తం 10 ఎకరాల 30 సెంట్లు ఉండగా, అందులో 64 సెంట్లు, సర్వే నెంబరు 432లో మరో ఆరు సెంట్ల మెరక భూమిని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని కనకదుర్గమ్మకు పసుపు, కుంకుమ కింద విరాళంగా ఇచ్చారు. అదే గ్రామంలో గ్రామ కంఠానికి చెందిన 235 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని బండి బాటతో సహా కనకదుర్గమ్మ గుడికి చెందేలా వీలునామా రాశారు. ఈ రెండు భూములను 2013 డిసెంబరు 1న గుంటూరులో రిజిస్ట్రేషన్ చేయించారు. దుర్గగుడితో పాటు పల్నాడు జిల్లాలోని అమరేశ్వరస్వామి ఆలయం, కడప జిల్లాలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి, పెనుగంచి ప్రోలులోని తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానానికి, శ్రీశైలంలోని శ్రీమల్లి కార్జున స్వామి దేవస్థానానికి, భద్రాచలంలోని భద్రాద్రి దేవస్థానానికి తనకున్న స్థిరాస్తులను విరాళాలుగా రాసి గుంటూరులో రిజిస్ట్రేషన్ చేయించారు.

దుర్గగుడి భూములు కబ్జా

దుర్గగుడికి ఇచ్చిన పాములపాడులోని 70 సెంట్ల భూమిని కొందరు స్థానికులు కబ్జా చేశారు. 235 చదరపు గజాల స్థలాన్ని దాత రాజమ్మ బంధువులు ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టారు. దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన భూముల రికార్డులను ఈవో శీనానాయక్ పరిశీలిస్తుండగా, పాములపాడులో ఈ భూములు ఉన్నట్టు గుర్తించారు. ఆలయ అధికారులను వివరాలు అడిగి తెలుసుకోగా, భూములను స్థానికంగా కొందరు ఆక్రమించుకున్నారని వెల్లడించారు. కబ్జాకు గురైన 70 సెంట్ల భూమిలో దేవస్థానం పేరిట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, ఆ బోర్డును తొలగించారని వివరించారు. దీనిపై స్పందించిన ఈవో పూర్తి వివరాలను తెలుసుకుని కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే భూములు ఉన్న ప్రాంతంలోని అధికారుల సహాయం తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్నెన్నో ఆశలు

- నేటి సాయంత్రం జిల్లాపై సీఎం సమీక్ష

గుంటూరు, మే 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అధ్యక్షతన గుంటూరు జిల్లా సమీక్షకు షెడ్యూల్ ఖరారైంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఉండవల్లిలోని సీఎం నివాసంలో సమావేశం జరగనుంది. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్, మంత్రి నాదెండ్ల మనోహర్.. మిగతా ఐదుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కావాలని సీఎంవో నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. కలెక్టర్ సాయికాంత్ వర్మ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. కాగా జిల్లా అభివృద్ధికి ఏ ప్రాజెక్టులు అవసరమో నివేదించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు నివేదికలతో సమీక్షకు సిద్ధమయ్యారు. పెండింగ్ ప్రాజెక్టులు, మంగళగిరిలో గోల్డ్ అండ్ జెమ్స్ పార్కు, చేనేత క్లస్టర్, ప్రత్తిపాడులో మెడికల్ హబ్, ఈఎస్ఐ ఆస్పత్రి, మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్, గుంటూరు నగరంలో ఆర్‌వోబీల నిర్మాణం, గుంటూరు చానల్, నల్లమడ, నల్లా డ్రెయిన్ల ఆధునికీకరణ, ఎన్‌టీఆర్ మానస సరోవరం, తెనాలి మునిసిపల్ మార్కెట్, మంగళగిరి - తెనాలి - నారా కోడూరు రహదారి తదితర పనులను సీఎంకు నివేదించి, అనుమతులు, నిధులు కోరనున్నారు.

బియ్యం..కయ్యం

రేషన్ డీలర్లు వర్సెస్ సీఎస్ డీటీలు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల ప్రారంభం నుంచి రేషన్ డీలర్లు, పౌర సరఫరాల ఉప తహసీల్దార్ల(సీఎస్ డీటీలు) మధ్యన వార్ నడుస్తోంది. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల పేరుతో డీటీలు కొన్ని రేషన్ షాపుల్లో తనిఖీలు చేస్తున్నారు. స్టాకు హెచ్చు తగ్గుల నేపథ్యంలో.. డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి, షాపు సీజ్ చేస్తున్నారు. దీనిని డీలర్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. స్టాకు సక్రమంగానే ఉన్నా.. డీటీలే ఆటోలో బియ్యం బస్తాలు తీసుకొచ్చి అన్‌లోడింగ్ చేసి.. స్టాకు అదనంగా ఉందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని గళం విప్పుతున్నారు. ఈ వ్యవహారం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో పరస్పర ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. మే నెల రేషన్ పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. కొంతమంది డీలర్లు నేరుగా కార్డుదారులకు కేజీ బియ్యానికి రూ.14 నుంచి రూ. 15 వరకు చెల్లించి ఆ స్టాకుని రేషన్ మాఫియాకి చేర్చి లబ్ధి పొందుతున్నారు. కొంతమంది డీలర్లు.. పలుకుబడితో రేషన్ షాపు మంజూరు చేయించుకుని ఇతర డీలర్లకు సబ్ లీజుకు ఇచ్చేశారు. డీలర్లు, సీఎస్ డీటీలు మధ్య ఒప్పందం కుదిరితే ఎలాంటి సమస్య తలెత్తడం లేదు. ఎప్పుడైతే ఇరువర్గాల మధ్యన భేదాలు తలెత్తుతాయో అప్పుడు పరస్పర చర్యలకు ఉపక్రమిస్తున్నారు. జిల్లాలో 972 షాపులు ఉంటే యాక్టివ్‌లో 928 మాత్రమే ఉన్నాయి. దీనిని పరిగణనలోకి తీసుకొంటే 34 షాపులను అధికారులు సీజ్ చేసినట్లు స్పష్టమవుతోంది.

ఉపాధ్యాయులు కృషి చేస్తే పాస్ అవుతారు



మాట్లాడుతున్న డీఈవో సలీమ్ బాషా

గుంటూరు(విద్య),మే 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ప్రత్యేక రెమిడియల్ శిక్షణ ఇచ్చేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ డాక్టర్ సలీమ్ బాష సూచించారు. సోమవారం పరీక్ష భవన్‌లో జిల్లాలోని పధానో పాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 11 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఫెయిల్ అయ్యారని, ఉపాధ్యాయులు కృషి చేస్తే సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మినిమం స్టడీ మెటీరియల్, 20 రోజుల ప్రణాళిక ఇచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు, తెనాలి ఉప విద్యాశాఖ అధికారులు ఏసురత్నం, శాంతకుమారి, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ కార్యదర్శి తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి మ్యాచ్ | వేదిక ఢిల్లీ
ఢిల్లీ X చెన్నై | రా.7.30

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర‌రే
పంజాబ్	9	6	2	1	13	0.855
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	10	6	4	0	12	0.644
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	10	6	4	0	12	-0.147
చెన్నై	9	4	5	0	8	0.005
ఢిల్లీ	9	4	5	0	8	-0.895
కోల్‌కతా	9	3	5	1	7	-0.539
ముంబై	10	3	7	0	6	-0.649
లఖ్‌నవూ	9	2	7	0	4	-1.076

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు

రోహిత్ రికెల్టన్ షో


రికెల్టన్ (32 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్లతో 83)

2 ఐపీఎల్‌లో 20 అంత కన్నా తక్కువ బంతుల్లోనే ఎక్కువ హాఫ్ సెంచరీలు (5) చేసిన రెండో బ్యాటర్‌గా పూరన్. అభిషేక్ (6) ముందున్నాడు.

లఖ్‌నవూపై ముంబై ఘన విజయం

ముంబై: ప్లేఆఫ్స్ అవకాశాలు దాదాపుగా మూసుకుపోయిన వేళ.. మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ అదరగొట్టింది. వెటరన్ ఓపెనర్ రోహిత్ శర్మ (44 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 84) చాలా రోజుల తర్వాత బరిలోకి దిగి మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతడికి రికెల్టన్ (32 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్లతో 83) సహకరించడంతో సోమవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో ముంబై నెగ్గింది. పది మ్యాచ్‌ల్లో ఈ జట్టుకిది కేవలం మూడో విజయం. అలాగే మిగిలిన నాలుగు మ్యాచ్‌లనూ గెలిచి మిగతా టీమ్స్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అటు కేవలం 4 పాయింట్లతో ఉన్న లఖ్‌నవూకు ఇది వరుసగా ఆరో ఓటమి, దీంతో ఈ జట్టు కూడా దాదాపుగా నిష్క్రమించినట్టే. ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 228 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (21 బంతుల్లో 1 ఫోర్, 8 సిక్సర్లతో 63), మార్ష్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 44), హిమ్మత్ (31 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 40 నాటౌట్), మార్‌క్రమ్ (25 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 31 నాటౌట్) రాణించారు. బాష్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో ముంబై 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 229 పరుగులు చేసి గెలిచింది. సిద్ధార్థ్‌కు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గా రికెల్టన్ నిలిచాడు.

ఛేదన జోరుగా..: భారీ ఛేదనను ఆత్మవిశ్వాసంతో ఆరంభించిన ముంబై ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు రోహిత్, రికెల్టన్‌ల ధాటికి లఖ్‌నవూ బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. ముందుగా రికెల్టన్ జోరు చూపించినా.. కాస్త కుదురుకున్నాక రోహిత్ జోరు ఆరంభమైంది. ఆరో ఓవర్‌లో 4,4,6,6తో రోహిత్ ఒక్కసారిగా గేరు మార్చాడు. దీంతో ముంబై పవర్‌ప్లేలో 71 పరుగులతో నిలిచింది. 22 బంతుల్లో రికెల్టన్, 27 బంతుల్లో రోహిత్ ఫిఫ్టీలు పూర్తి చేశారు. తొమ్మిదో ఓవర్‌లో రికెల్టన్ 6,4,6తో 23 రన్స్ సమకూరాయి. అలాగే మొహిసిన్ ఓవర్‌లోనూ 4,6,6తో చెలరేగిన అతడు ఐదో బంతికి ఇన్‌గ్లిస్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 143 పరుగుల భాగస్వామ్యానికి చెక్ పడింది. అటు రోహిత్ మాత్రం బౌండరీలతో తన దూకుడు కొనసాగించడంతో పరుగుల వేగం తగ్గలేదు. సెంచరీ దిశగా సాగుతున్న హిట్‌మ్యాన్‌ను స్పిన్నర్ సిద్ధార్థ్ 14వ ఓవర్‌లో అవుట్ చేశాడు. అప్పటికి ఆరు ఓవర్లలో 52 పరుగులే కావాల్సి ఉండడంతో ముంబై ఇబ్బందిపడలేదు. తిలక్ (11), సూర్య (12) విఫలమైనా నమన్ ధిర్ (23 నాటౌట్) చివరికంటా నిలిచి 8 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.


రోహిత్ (44 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 84)

పూరన్ ఎదురుదాడి: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్ మెరుపు వేగంతో సాగింది. నికోలస్ పూరన్ సీజన్‌లో తొలిసారి బ్యాట్ ఝుళిపించాడు. అతడికి ఓపెనర్ మార్ష్ సహకరించడంతో ముంబై బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. దీంతో 250 పరుగులు కూడా ఖాయమే అనుకున్న వేళ ఈ ఇద్దరి నిష్క్రమణ తర్వాత జట్టు లయ తప్పింది. దీనికి తోడు డెత్ ఓవర్లలో ముంబై బౌలర్లు మరింత కట్టడి చేయడంతో ఎల్ఎస్‌జీ ఆశించిన స్కోరు చేయలేకపోయింది. మార్ష్ తొలి ఓవర్‌లోనే 6,4తో బ్యాట్‌కు పనిజెప్పాడు. కానీ మూడో ఓవర్‌లో ఓపెనర్ ఇన్‌గ్లిస్ (13)ను స్పిన్నర్ ఘజన్‌ఫర్ అవుట్ చేశాడు. అటు బుమ్రా ఓవర్‌లో మార్ష్ 6,4,4తో 21 పరుగులు రాబట్టగా.. వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన పూరన్ ఐదో ఓవర్‌లో మూడు సిక్సర్లతో చెలరేగాడు. ఘజన్‌ఫర్ ఓవర్‌లోనూ అతడు 4,6,6 బాదగా ఎల్ఎస్‌జీ 90/1తో పవర్‌ప్లేలో తమ అత్యధిక స్కోరును సాధించింది. అలాగే 16 బంతుల్లోనే పూరన్ హాఫ్ సెంచరీ కూడా పూర్తయ్యింది. ఎనిమిది ఓవర్లలోనే 123 పరుగులు చేసిన లఖ్‌నవూ దూకుడుకు పేసర్ బాష్ బ్రేక్ వేశాడు. తొమ్మిదో ఓవర్‌లో అతడు పూరన్, మార్ష్ ఇద్దరినీ పెవిలియన్‌కు చేర్చి ముంబైకి రిలీఫ్‌నిచ్చాడు. దీంతో రెండో వికెట్‌కు 35 బంతుల్లోనే 94 పరుగుల తుఫాన్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత మధ్య ఓవర్లలో పరుగులు నెమ్మదించగా, కెప్టెన్ పంత్ (15)తో పాటు తొలి ఐపీఎల్ ఆడిన అక్షత్ (11) ఒక్క ఓవర్ వ్యవధిలోనే పెవిలియన్‌కు చేరారు. ఈ దశలో హిమ్మత్, మార్‌క్రమ్ క్రీజులో నిలిచి ఆరో వికెట్‌కు అజేయంగా 68 రన్స్ జత చేశారు. 15 ఓవర్లలోనే 175/5 స్కోరుతో నిలిచిన లఖ్‌నవూ 240 రన్స్ చేయగలదని అంచనా వేశారు. కానీ చివరి మూడు ఓవర్లలో పుంజుకున్న ముంబై బౌలర్లు కేవలం ఒక్క ఫోర్‌తో 22 పరుగులే ఇవ్వడంతో ఎల్ఎస్‌జీ 220+ రన్స్‌తో సరిపెట్టుకుంది.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్ష్ (సి) నమన్ (బి) బాష్ 44, ఇంగ్లిస్ (సి) సూర్య (బి) ఘజన్‌ఫర్ 13, పూరన్ (సి) రికెల్టన్ (బి) బాష్ 63, పంత్ (సి) రికెల్టన్ (బి) జాక్స్ 15, మార్‌క్రమ్ (నాటౌట్) 31, అక్షత్ రఘువంశీ (సి అండ్ బి) రఘుశర్మ 11, హిమ్మత్ (నాటౌట్) 40; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 228/5; వికెట్ల పతనం:** 1-29, 2-123, 3-125, 4-148, 5-160; **బౌలింగ్:** చాహర్ 4-0-43-0, బుమ్రా 4-0-45-0, ఘజన్‌ఫర్ 4-0-50-1, జాక్స్ 2-0-34-1, బాష్ 2-0-20-2, రఘుశర్మ 4-0-36-1.

ముంబై: రికెల్టన్ (సి) ఇన్‌గ్లిస్ (బి) మొహిసిన్ 83, రోహిత్ (సి) షమి (బి) సిద్ధార్థ్ 84, తిలక్ (సి) మార్‌క్రమ్ (బి) సిద్ధార్థ్ 11, సూర్యకుమార్ (సి) పూరన్ (బి) షమి 12, నమన్ (నాటౌట్) 23, జాక్స్ (నాటౌట్) 10; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.4 ఓవర్లలో 229/4; వికెట్ల పతనం:** 1-143, 2-177, 3-189, 4-213; **బౌలింగ్:** షమి 4-0-53-1, మొహిసిన్ 4-0-47-1, ప్రిన్స్ 3-0-24-0, అవేశ్ 3.4-0-56-0, సిద్ధార్థ్ 4-0-47-2.

ముఖేష్ డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముఖేష్ రెండు స్వర్ణాలు కొల్లగొట్టాడు. సోమవారం జరిగిన 25 మీటర్ల జూనియర్, సీనియర్ రెండు విభాగాల్లోనూ ముఖేష్ చాంపియన్‌గా నిలిచాడు. న్యూఢిల్లీలోని కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన ఈ పోటీల్లో 25 మీ., పిస్టల్ ఈవెంట్ రెండు విభాగాల్లోనూ ముఖేష్ 584/600 స్కోరు సాధించి, అగ్రస్థానంలో నిలిచాడు. రెండు విభాగాల్లోనూ సూరజ్ శర్మ (మధ్యప్రదేశ్) రజతం, శ్రవణ్ శశిధర్ (కర్ణాటక) కాంస్యం దక్కించుకున్నారు.

జిమ్నాస్టిక్స్‌లో వైష్ణవికి పసిడి



జాతీయ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అమ్మాయి వైష్ణవి వ్యాస్ స్వర్ణంతో మెరిసింది. భువనేశ్వర్‌లో జరిగిన ఈ పోటీల్లో టేబుల్ వాల్ట్ విభాగంలో అద్భుత ప్రదర్శనతో పసిడి పతకం దక్కించుకుంది. బ్యాలెన్సింగ్ బీమ్‌లో ఐదో స్థానం, ఆల్ రౌండ్ విభాగంలో ఏడో స్థానం సాధించింది.

పవర్‌లిఫ్టింగ్‌లో తపస్యకు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యూరో-ఆసియా పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సంగారెడ్డి లిఫ్టర్ సూరినేని తపస్య పసిడితో మెరిసింది. కిర్గిస్థాన్‌లో జరిగిన ఈ పోటీల్లో అండర్ 13-15లో 48 కిలోల విభాగంలో తపస్య మొత్తంగా 247.5 కిలోల బరువెత్తి మొదటి స్థానాన్ని సొంతం చేసుకుంది. అంతేకాక స్క్వాట్, డెడ్‌లిఫ్ట్‌లో తన వయో విభాగంలో ప్రపంచ రికార్డులను తపస్య నమోదు చేసింది.

'మయామి' విజేత కిమి



మయామి గార్డెన్స్: మెర్సిడస్ ఎఫ్-1 డ్రైవర్, 19 ఏళ్ల ఆండ్రియా కిమి ఆంటోనెల్లి వరుసగా మూడో ఫార్ములా వన్ విజయాన్ని అందుకున్నాడు. కిమి.. మయామి గ్రాండ్ ప్రీ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. మెక్‌లారెన్‌కు చెందిన నోరిస్, పియాస్ట్రీ 2, 3 స్థానాలు దక్కించుకున్నారు.

లింగ వివక్షను దాటి..

ట్రాన్స్‌జెండర్ అంపైర్‌గా రితిక శ్రీ



సంకల్పం.. పట్టుదల ఉంటే సాధించలేనిదేమీ ఉండదనేదానికి ఉదాహరణ రితిక శ్రీ. సామాజిక వివక్ష, విమర్శలను దాటుకొని దేశంలోనే తొలి ట్రాన్స్‌జెండర్ అంపైర్‌గా ఎదిగిన ఆమె.. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. తమిళనాడులోని సేలానికి చెందిన రితిక.. 2021 నుంచి సేలం, కోయంబత్తూర్ సర్క్యూట్‌లో అంపైరింగ్ చేస్తోంది. ప్రస్తుతం కోయంబత్తూర్ జిల్లా క్రికెట్ సంఘం లీగ్‌లో మ్యాచ్ అధికారిగా వ్యవహరిస్తోంది.

ముత్తురాజ నుంచి..

రితిక శ్రీ అసలు పేరు ముత్తురాజ. జన్మతహః పురుషుడు. మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా చదివిన అతడు.. మొహాలీలోని ఓ కాల్ సెంటర్‌లో పనిచేసేవాడు. అప్పుడు ఐపీఎల్ మ్యాచ్‌లను చూస్తూ క్రికెట్ పట్ల ఆకర్షితుడయ్యాడు. కొవిడ్ సమయంలో ఇబ్బందులు ఎదురుకావడంతో.. స్వస్థలానికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో అంపైరింగ్ చేయాలనే ఆలోచన రావడంతో.. ఆ దిశగా ప్రయత్నించి సమాచారం తెలుసుకొన్నాడు. 'సేలం జిల్లా అంపైర్ల కమిటీ చైర్మన్ జయరామన్‌ను కలవడంతో.. కెరీర్‌కు ఓ దిశ లభించింది. డిస్ట్రిక్ ప్యానెల్‌లోని ఇతరులు కూడా అంపైరింగ్ పాఠాలు చెప్పడం కెరీర్‌కు లాభించింద'ని చెప్పాడు.

అర్థం చేసుకొని.. అండగా నిలిచారు..

అయితే, బయటకు పురుషుడిలా ఉన్నా.. తనలోని స్త్రీ గురించి మాత్రం చెప్పడానికి ఎంతో ఇబ్బందిపడినట్టు రితిక శ్రీ తెలిపింది. తాను పూర్తి ఆడదానిగా మారాలనుకొంటున్న విషయం జయరామన్ దంపతులకు చెబితే.. వారు తనను అర్థం చేసుకొని మద్దతుగా నిలిచారని చెప్పింది. అంపైరింగ్‌లో నిలదొక్కుకొన్నాక.. లింగ మార్పిడి చికిత్స చేయించుకోవాలని సలహా ఇవ్వడంతో అలాగే చేశానని పేర్కొంది. 2024లో శస్త్రచికిత్స చేయించుకొన్న తర్వాతి ఏడాది నుంచి మళ్లీ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టినట్టు చెప్పింది. తమిళనాడు క్రికెట్ సంఘం స్టేట్ అంపైర్ ప్యానెల్‌కు ఆహ్వానించే దరఖాస్తుల్లో 'థర్డ్ జెండర్'ను చేర్చడం తన పట్టుదలకు గుర్తింపు అని రితిక శ్రీ సంతోషం వ్యక్తం చేస్తోంది.

హోటల్‌లో గర్ల్‌ఫ్రెండ్స్‌కు నో!

వచ్చే ఐపీఎల్ నుంచి బీసీసీఐ నిబంధన



న్యూఢిల్లీ: ఐపీఎల్ సందర్భంగా గర్ల్‌ఫ్రెండ్స్ ఆయా క్రికెటర్లతో కలిసి హోటళ్లలో ఉండకుండా నిబంధన రూపొందించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ విషయాన్ని వచ్చే బోర్డు సమావేశంలో చర్చించనుందని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు. ఆ నిబంధనను వచ్చే ఐపీఎల్ నుంచి అమలు చేయాలనుకుంటోందట. భార్యలు, ఇతర కుటుంబ సభ్యులు క్రికెటర్లతో హోటల్‌లో ఉంటే పర్లేదుకానీ..గర్ల్‌ఫ్రెండ్స్‌తోనే చిక్కని బీసీసీఐ భావిస్తోంది. హార్దిక్ పాండ్యా, యశస్వీ జైస్వాల్, ఇషాన్ కిషన్, అర్ష్‌దీప్ సింగ్ గర్ల్‌ఫ్రెండ్స్‌తో చెట్టపట్టాలేసుకొని తిరుగుతున్నట్టు బీసీసీఐ తేల్చింది. క్రికెటర్లు డేటింగ్‌లో ఉండడంపై బీసీసీఐకి ఎలాంటి ఆక్షేపణ లేదు. కానీ కొందరు ఆటగాళ్లు వారితో హోటల్ గదుల్లో ఉండడాన్ని బీసీసీఐ వ్యతిరేకిస్తోంది. క్రికెటర్ల గర్ల్‌ఫ్రెండ్స్‌లో కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్లున్నారు. వారు సున్నితమైన సమాచారాన్ని సోషల్‌మీడియాలో పంచుకొంటే ప్రమాదమని బీసీసీఐ భావిస్తోంది.

బిజినెస్

దీర్ఘకాలిక మూలధనమే మనకు ఇంధనం

మార్కెట్ ఆధారిత నిధులై ఉండాలి
కమోడిటీ డెరివేటివ్స్‌పై నియంత్రణకు బ్యాంకులు, బీమా కంపెనీలకు నో


సెబీ చీఫ్ పాండే

ముంబై: భారత్‌కు దీర్ఘకాలిక మూలధనం అవసరమని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే అన్నారు. అది కూడా మార్కెట్ ఆధారిత నిధులై ఉండాలని స్పష్టం చేశారు. అలా అయితేనే అది మన ఆర్థిక వ్యవస్థకు ఇంధనంలా పని చేస్తుందన్నారు. ఐఎంసీ క్యాపిటల్ మార్కెట్ సదస్సుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. పెట్టుబడుల సమీకరణలో రుణ పత్రాల మార్కెట్.. ఈక్విటీ మార్కెట్‌కు చోదకశక్తిగా మారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, కంపెనీలకు అవసరమైన దీర్ఘకాలిక నిధులు సమకూర్చేలా ఉండాలని పాండే కోరారు. పెట్టుబడుల ఎంపికలోనూ మదుపరులకు పూర్తి స్వేచ్ఛ ఉండాలన్నారు. మార్కెట్ అభివృద్ధి, మదుపరుల రక్షణ రెండూ కలిసికట్టుగా ఉండాలని స్పష్టం చేశారు. 'నష్టభయాన్ని నియంత్రిస్తూనే మార్కెట్‌కు సంబంధించి అన్ని విభాగాలను అభివృద్ధి చేయాలన్నది మా అభిమతం' అన్నారు.

ఆర్‌బీఐ, ఐఆర్‌డీఏఐ సుముఖంగా లేవు

బ్యాంకులు, బీమా సంస్థలు కమోడిటీ డెరివేటివ్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతించడంపైనా సెబీ చీఫ్ పాండే స్పష్టత ఇచ్చారు. బ్యాంకులను నియంత్రించే ఆర్‌బీఐ కానీ, బీమా కంపెనీలను నియంత్రించే ఐఆర్‌డీఏఐ కానీ ఇందుకు ఏ మాత్రం సముఖంగా లేవన్నారు. ఇందుకు కొన్ని సముచిత కారణాలు కూడా ఉన్నట్టు తెలిపారు. పెన్షన్ పథకాలు.. కమోడిటీ డెరివేటివ్స్‌లో పెట్టుబడులు పెట్టడాన్ని అనుమతించే విషయన్ని పీఎఫ్‌ఆర్‌డీఏ పరిశీలిస్తోందని పాండే వెల్లడించారు. అయితే దీనిపై పీఎఫ్‌ఆర్‌డీఏ నిర్ణయం ఇప్పటికే తీసుకుందా? లేదా? అనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. ఆంత్రోపిక్ మైథోస్‌తో పాటు ఇతర కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత టూల్స్‌తో మార్కెట్‌కు పొంచి ఉన్న ముప్పుపైనా పాండే మాట్లాడుతూ.. దీనిపై త్వరలోనే మార్కెట్ వర్గాల అవగాహన కోసం కొన్ని మార్గదర్శకాలు జారీ చేస్తామని వెల్లడించారు.

పసిడి ధరల్లో మరింత పారదర్శకత

ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్‌ను ప్రవేశపెట్టిన ఎన్ఎస్ఈ • కొనుగోలు చేసిన రిసీట్స్‌కు సమానమైన బంగారం సెబీ అధీకృత లాకర్లలో భద్రం



న్యూఢిల్లీ: దేశంలో పసిడి ధరల నిర్ధారణను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడంతో పాటు బంగారం మార్కెట్‌ను సంఘటితంగా మార్చేందుకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) సోమవారం ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్స్ (ఈజీఆర్)ను ప్రవేశపెట్టింది. సెబీ నియంత్రిత, భద్రమైన, సాంకేతికంగా ఆధునిక ప్లాట్‌ఫామ్ ద్వారా జరిగే ఈ విలువైన లోహం క్రయ, విక్రయాలు సంప్రదాయ బులియన్ మార్కెట్, ఫైనాన్షియల్ మార్కెట్ మధ్య అంతరాన్ని పూడ్చగలవని ఎన్ఎస్ఈ పేర్కొంది. భౌతిక బంగారంపై యాజమాన్య హక్కును కల్పించే డీమెటీరియలైజ్డ్ సెక్యూరిటీయే ఈజీఆర్. మీరు కొనుగోలు చేసే ఈజీఆర్ యూనిట్లను డీమ్యాట్ ఖాతాలో ఎలక్ట్రానిక్ రూపంలో కలిగి ఉండవచ్చు. అలాగే, మీరు కొనుగోలు చేసిన ఈజీఆర్ యూనిట్లకు సమానమైన బంగారాన్ని సెబీ అధీకృత లాకర్లలో భద్రంగా నిల్వ చేస్తారు. ఎన్ఎస్ఈ ద్వారా ఈ యూనిట్ల క్రయ, విక్రయాలు జరిపేందుకు, తక్కువ మొత్తంలోనూ కొనుగోలు చేసే సదుపాయం ఉంటుంది. అంతేకాదు, ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న మీ బంగారాన్ని అవసరమైతే లోహంగానూ మార్చుకోవచ్చు. మరో స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్ఈ 2022 అక్టోబరులోనే ఈజీఆర్‌లను ప్రవేశపెట్టింది.

కేజీ బంగారం డీమ్యాట్ రూపంలోకి..

ఈజీఆర్‌ల ద్వారా పసిడి వర్తకానికి సమగ్ర, పారదర్శక వ్యవస్థను సృష్టించడం, సమర్థవంతమైన ధర నిర్ధారణ, మెరుగైన మార్కెట్ కార్యకలాపాలకు వీలుకల్పించడంతో పాటు జువెలర్లు, రిఫైనర్లు, వర్తకులు, ఇన్వెస్టర్లు సహా సంబంధిత వర్గాల్లో విశ్వసనీయత పెంచడమే తమ ఉద్దేశమని ఎన్ఎస్ఈ వెల్లడించింది. అలాగే, కేజీ బంగారాన్ని విజయవంతంగా డీమెటీరియలైజ్ చేయడం జరిగిందని ఎక్స్ఛేంజీ తెలిపింది. బంగారం క్రయవిక్రయ లావాదేవీల్లో ఈజీఆర్‌ల ప్రవేశం కీలక పరిణామం కానుందని ఎన్ఎస్ఈ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సీబీడీఓ) శ్రీరామ్ కృష్ణన్ అన్నారు.

ఈజీఆర్‌ల అవసరం ఎందుకు..?

- దేశీయ బులియన్ మార్కెట్లో అసంఘటిత వాటాయే అధికం. పైగా, బంగారం ధర నగరాన్ని బట్టి మారుతుంటుంది. పసిడి నాణ్యత ధ్రువీకరణకు హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేసినప్పటికీ, ఈ రెండు అంశాలు గోల్డ్ మార్కెట్లో ఇప్పటికీ విశ్వసనీయత లోపానికి కారణమవుతున్నాయి. బంగారం క్రయ, విక్రయాలను పూర్తిగా సంఘటితం చేయడంతో పాటు దేశమంతా ఒకే రేటు విధానాన్ని తీసుకొచ్చేందుకు ఈజీఆర్‌లు దోహదపడనున్నాయి.
- దేశంలో డిజిటల్ గోల్డ్, ఆన్‌లైన్ పసిడి పథకాల్లో పెట్టుబడులు ఊపందుకున్నాయి. అయితే, అందులో అనియంత్రిత సంస్థల పథకాలే అధికం. "తమ నియంత్రణ పరిధిలోకి రాని డిజిటల్ గోల్డ్ పథకాల్లో పెట్టుబడులకు రక్షణ ఉండదని, సెక్యూరిటీస్ లేదా కమోడిటీ డెరివేటివ్స్‌గా గుర్తింపు లేనందున అవి సెక్యూరిటీస్ మార్కెట్ రక్షణ పరిధిలోకి రావని" సెబీ ఇదివరకే స్పష్టం చేసింది. అయితే డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి సెబీ నియంత్రిత ఈజీఆర్‌లు భద్రమైన సాధనం.
- ఈజీఆర్‌ల ద్వారా చిన్న మొత్తంలోనూ పసిడిలో పెట్టుబడి పెట్టవచ్చు. అలాగే, కంపెనీల షేర్లలాగే ఎక్స్ఛేంజీ ద్వారా సులభంగా ఈ యూనిట్ల క్రయవిక్రయాలు చేపట్టవచ్చు.

రుణాల రద్దు ప్రచారాలు నమ్మొద్దు

నమ్మితే నిండా మునగడం ఖాయం: ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు రద్దు చేయబోతున్నాయన్న ప్రచారాన్ని ఏ మాత్రం నమ్మొద్దని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రజలను హెచ్చరించింది. రుణ బకాయిలు రద్దు చేయిస్తామని అందుకు కొద్దిగా ఫీజు చెల్లించాలని ఇటీవల కొంతమంది వ్యక్తులు, సంస్థలు ప్రచారం చేస్తున్నట్టు వార్తలు రావడంతో ఆర్‌బీఐ ఈ హెచ్చరిక చేసింది. ఇలాంటి తప్పుడు ప్రకటనలతో ఎవరైనా మిమ్మల్ని సంప్రదిస్తే నేరుగా మీరు రుణాలు తీసుకున్న బ్యాంకులు, ఆర్థిక సంస్థలను సంప్రదించాలని కోరింది. లేకపోతే నిండా మునగడం ఖాయమని హెచ్చరించింది. ఇలా ప్రచారం చేసే కేటుగాళ్లు, సంస్థల వివరాలను దర్యాప్తు సంస్థలకు తెలియజేయాలని కోరింది.

2025-26లో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.23.40 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కేంద్ర ప్రభుత్వ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5.12 శాతం పెరిగి రూ.23.40 లక్షల కోట్లకు పైగా నమోదయ్యాయి. కానీ గత ఆర్థిక సంవత్సరానికి సవరించిన లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోయాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రత్యక్ష పన్ను వసూళ్ల లక్ష్యాన్ని రూ.25.20 లక్షల కోట్ల (వాస్తవ బడ్జెట్ అంచనా) నుంచి రూ.24.21 లక్షల కోట్లకు సవరించింది. అయినా ఈ స్థాయిలో పన్ను వసూళ్లు జరగలేదు. ఫిబ్రవరి 1న ప్రకటించిన 2025-26 బడ్జెట్‌లో ఆదాయ పన్నును తగ్గించడం వల్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు నిస్తేజంగా ఉండటానికి కారణమైనట్టు తెలుస్తోంది.

పెట్రోల్, డీజిల్ నష్టాలను ప్రభుత్వం భరించదు..

ఆ భారమంతా కంపెనీలదే..
కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి సుజాత శర్మ

న్యూఢిల్లీ: పశ్చిమాసియా యుద్ధంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ).. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన (ఏటీఎఫ్) అమ్మకాలపై ఎదుర్కొంటున్న నష్టాలను భరించడం తమ వల్ల కాదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఆ నష్టాలు భరించే ఆలోచన కూడా లేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ స్పష్టం చేశారు. గత నాలుగేళ్లుగా ఓఎంసీలు వీటి ధరలు పెంచలేదు. ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తవడంతో ఈ నష్టాల్ని కొంతైనా భర్తీ చేసుకునేందుకు ఓఎంసీలు త్వరలోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఓఎంసీలు గత నెల దేశీయ విమానయాన సంస్థలకు సరఫరా చేసే ఏటీఎఫ్ ధరను 25 శాతం, విదేశీ విమానయాన సంస్థలకు సరఫరా చేసే ఏటీఎఫ్ ధరను 5 శాతం పెంచాయి. లీటరుకు రూ.25 నుంచి రూ.28 వరకు నష్టం వస్తున్నా ప్రభుత్వ ఒత్తిడితో నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, గత రెండు నెలలుగా ఓఎంసీలు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచకుండా సంయమనం పాటించాయి. ఇప్పుడు ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం ఇక వడ్డింపే తరువాయి అని భావిస్తున్నారు. అయితే ఈ వడ్డింపు ఒకేసారి ఉంటుందా? లేక దశల వారీగా ఉంటుందనేది తేలాల్సి ఉంది.

గోద్రేజ్ ప్రాపర్టీస్ లాభంలో 70% వృద్ధి

న్యూఢిల్లీ: గోద్రేజ్ ప్రాపర్టీస్.. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో రూ.3,806.65 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.649.88 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం 70 శాతం (రూ.381.99 కోట్లు) వృద్ధి చెందింది. కాగా మార్చితో ముగిసిన 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ.8,410.88 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.1,850.20 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.10 (200 శాతం) డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

మార్కెట్‌కు ఎన్నికల ఫలితాల దన్ను

సెన్సెక్స్ 356 పాయింట్లు అప్ ▸▸ మళ్లీ 24,000 ఎగువకు నిఫ్టీ

ముంబై: ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మార్కెట్ అంచనాలకు అనుగుణంగా ఉండటంతో పాటు ఆశాజనక త్రైమాసిక ఫలితాలు, బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు సోమవారం లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ ఒక దశలో 997.25 పాయింట్ల వరకు ఎగబాకి 77,910.75 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో చివరికి సూచీ 355.90 పాయింట్ల వృద్ధితో 77,269.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 121.75 పాయింట్ల లాభంతో 24,119.30 వద్ద ముగిసింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.95 లక్షల కోట్లు పెరిగి రూ.467.24 లక్షల కోట్లకు (4.92 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 22 లాభపడ్డాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.2,835.62 కోట్లు, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐ) రూ.4,764.16 కోట్ల నికర కొనుగోళ్లు జరిపారు.

రికార్డు కనిష్ఠానికి రూపీ

ఒక్కరోజులో 39 పైసలు క్షీణత
రూ.95.23 వద్ద ముగింపు

భారత కరెన్సీ సరికొత్త ఆల్‌టైం రికార్డు కనిష్ఠానికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం 39 పైసలు క్షీణించి రూ.95.23 వద్ద ముగిసింది. ఏప్రిల్ 30, మార్చి 30న ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఎక్స్ఛేంజీ రేటు రూ.95 స్థాయిని దాటినప్పటికీ, ఈ మార్క్ ఎగువన ముగియడం మాత్రం ఇదే మొదటిసారి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, గరిష్ఠ స్థాయి ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదల, వృద్ధి మందగమనం భయాల నేపథ్యంలో రూపీ మరింత క్షీణించిందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	525
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర | **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	135	విజయవాడ	123
వరంగల్	135	గుంటూరు	123
కరీంనగర్	135	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	118
కర్నూలు	135	నెల్లూరు	123
విశాఖపట్నం	124	అనంతపురం	123
గోదావరి	123		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,50,900 ▼	1,38,300 ▼	2,69,000 ▼
విజయవాడ	1,53,000 ▼	1,41,000 ▼	2,55,000 ▲
విశాఖపట్నం	1,50,000 ▼	1,38,350 ▼	2,70,000 ▲
రాజమండ్రి	1,51,000 ▲	1,38,000 ▼	2,70,000 ▼
ప్రొద్దుటూరు	1,51,500 ▼	1,39,380 ▼	2,48,000 ▼
ముంబై	1,48,100 ▼	1,35,660 ▼	2,40,120 ▼

ఎంఈఐఎల్ నుంచి జీఈ వెర్నోవాకు ఆర్డర్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) నిర్మించే 1.35 గిగావాట్ల అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజ్ జలవిద్యుత్ ప్లాంట్ కోసం ఒక్కోటి 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన తొమ్మిది పంప్డ్ స్టోరేజ్ యూనిట్లను సరఫరా చేసే భారీ ఆర్డరును దక్కించుకున్నట్టు అమెరికాకు చెందిన జీఈ వెర్నోవా సోమవారం వెల్లడించింది. ఈ ప్రాజెక్టు 2030 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. 1.35 గిగావాట్ల అప్పర్ సీలేరు ప్రాజెక్టు దేశంలోని అతిపెద్ద పంప్డ్ స్టోరేజ్ జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలువనుందని పేర్కొంది.

అమరావతిలో సెంట్రల్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం

తుళ్లూరు (ఆంధ్రజ్యోతి): అమరావతి నగరంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేస్తోంది. ఈ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించి సోమవారం నాడు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎన్‌బీసీసీ మధ్య ఒప్పందం కుదిరింది. సెంట్రల్ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ హెడ్ ఎం.పిచ్చయ్య సమక్షంలో విజయవాడ ప్రాంతీయ కార్యాలయ అధికారి ఈ. వెంకటేశ్వరావు, ఎన్‌బీసీసీ తరపున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. ఎస్‌రావు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు.

అమరావతిలో రాజా వాసిరెడ్డి స్మృతివనం

● ఆయన జ్ఞాపకాలతో మ్యూజియం ఏర్పాటు ● ఆదేశాలు జారీ చేసిన పురపాలకశాఖ

గుంటూరు(ఆంధ్రజ్యోతి), మే 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో 'రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు స్మృతివనం, మ్యూజియం' స్థాపనకు కీలక ముందడుగు పడింది. రాజా వాసిరెడ్డి స్మృతివనం ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వానికి వచ్చిన ప్రతిపాదనల నేపథ్యంలో సోమవారం రాష్ట్ర పురపాలకశాఖ ఆదేశాలు జారీ చేసింది. గతంలో గుంటూరులో జరిగిన వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 200వ వర్ధంతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో వాసిరెడ్డి స్మృతివనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు రాష్ట్ర పురపాలకశాఖ నుంచి అధికారికంగా మెమో జారీ అయింది. అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు చేసిన ప్రతిపాదనను పరిశీలిస్తూ, ఈ ప్రాజెక్టును అమలులోకి తీసుకురావాలని అవసరమైన చర్యలు చేపట్టాలని సీఆర్డీఏ కమిషనర్‌కు ప్రభుత్వం సూచించింది. ఈ స్మృతివనం, మ్యూజియం ద్వారా అమరావతి స్థాపకుడు, రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడి చరిత్ర, 'సేవలు, సాంస్కృతిక వారసత్వం భవిష్యత్ తరాలకు అందనున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక మైలురాయిగా నిలవనుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఐదుగురు సీనియర్ అసిస్టెంట్‌లకు పదోన్నతి

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యపన్నులశాఖ జోన్-3 పరిధిలో ఐదుగురు సీనియర్ అసిస్టెంట్‌లకు గ్రూప్ ఆఫ్ సర్వీస్ ట్యాక్స్ ఆఫీసర్ (జీఎస్‌టీఓ)లుగా పదోన్నతి కల్పిస్తూ గుంటూరు నోడల్ జాయింట్ కమిషనర్ కమిషనర్ మాధవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జాయింట్ కమిషనర్ 2 డివిజన్ పరిధిలో పనిచేస్తున్న నారాయణమ్మను జాయింట్ కమిషనర్ గుంటూరు-1 కార్యాలయానికి, అజయ్‌కుమార్‌ను బ్రాడీపేట సర్కిల్ నుంచి విజయవాడ రీజనల్ కార్యాలయానికి, బలరామ్‌ను పట్నంబజారు సర్కిల్ నుంచి విజయవాడ రీజినల్ కార్యాలయానికి, శ్రీరామ్‌ను నెల్లూరు జాయింట్ కమిషనర్ కార్యాలయం నుంచి నెంబర్ 2 సర్కిల్ ఆఫీస్‌కు, తిరుమలదేవిని మార్కాపురం నుంచి తెనాలి సర్కిల్‌కి పదోన్నతిపై పోస్టింగ్ కల్పించారు. ఇటీవల 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు జీఎస్‌టీఓలుగా పదోన్నతి కల్పించారు. మొత్తం 16 మందికి పదోన్నతి కల్పించినట్లయింది.

10లోపు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలి



పాఠశాల బస్సులను తనిఖీ చేస్తున్న డీటీసీ సీతారామిరెడ్డి

గుంటూరు(తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలకు చెందిన బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను ఈ నెల 10వ తేదీలోపు పొందాలని జిల్లా ఉపరవాణ కమిషనర్ సీతారామిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం వివిధ పాఠశాలలకు చెందిన బస్సులను ఆయన తనిఖీ చేశారు. ఎమర్జెన్సీ ద్వారం, ఫైర్ ప్రమాణాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్టు, సీటుకు సీటుకు మధ్య గ్యాప్, డ్రైవర్ అనుభవం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బస్సుల తనిఖీ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 106 బస్సులను తనిఖీ చేసినట్టు చెప్పారు. అధికారులు పరిశీలన అనంతరం ఆటోమెటిక్ ఫిట్‌నెస్ సెంటర్‌ల వద్దకు వెళ్లి సర్టిఫికెట్ పొందాలని సూచించారు. ఈ తనిఖీలలో మోటారు వాహన తనిఖీ అధికారులు మల్లీశ్వరీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

దాతల భాగస్వామ్యంతో క్రీడారంగం అభివృద్ధి

● శాప్ చైర్మన్ రవినాయుడు



క్రీడాకారులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

గుంటూరు(తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో పాటు దాతలు ముందుకు వస్తే క్రీడారంగం మరింత అభివృద్ధి చెందుతుందని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో జరుగుతున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి, చిక్కీలు పంపిణీ చేశారు. టెన్నిస్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడల క్యాంపులను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రవినాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ, యువజన సేవలశాఖ, స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా బాలికలకు సమ్మర్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో పరిమిత స్థాయిలో మాత్రమే క్యాంపులు నిర్వహించేవారని, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతో విస్తృత స్థాయిలో ఈ కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. వేసవి శిబిరం పూర్తిగా ఉచితమని, విద్యార్థులు వేసవి సెలవులను క్రీడలకే కేటాయించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు, వ్యాపారవేత్తలు ముందుకొచ్చి పిల్లలకు ఆహారం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీతో ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడా కారులకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. క్రీడలకు సంబంధించిన సమాచారం, సర్టిఫికెట్లు, పోటీలు, ప్రభుత్వ కార్యక్రమాల వివరాలు 'క్రీడా యాప్'లో అందుబాటులో ఉంచామని, ఈ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కా ర్యక్రమంలో శాప్ బోర్డ్ డైరెక్టర్ సంతోష్ కుమార్, మాజీ కార్పొరేటర్ మీరావలీ, డీఎస్‌డీవో అఫ్రోజ్ ఖాన్, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధికి ఊరట!

(5వ పేజీ తరువాయి)

మార్చడంతో పాటు నూతన విధానం అమల్లోకి వస్తుందని అందుకు తగ్గట్లుగా డ్వామా సిద్ధంగా ఉండాలనే ఆదేశాలు కేంద్రం నుంచి వచ్చాయి. ముఖ్యంగా పెండింగ్ పనులు పూర్తి చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విషయంలో కాంట్రాక్టర్లపైన తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. తమకు బిల్లులు చెల్లించకుండా పనులు పూర్తి చేయాలని ఒత్తిడి తేవడం ఎంతవరకు సమంజసమని కాంట్రాక్టర్లు గట్టిగానే ప్రశ్నించారు. దీంతో పాటు గ్రామం యూనిట్‌గా 20 పనులు మాత్రమే జరుగుతుండాలని, ఒకటి పూర్తయ్యాక మరొకటి అప్‌లోడ్ చేయాలనే నిబంధన కూడా వీబీ జీ రామ్‌జీ నూతన మార్గదర్శకాలలో ఉంది. పేరు మార్పు, నూతన విధానం అమలు ఏప్రిల్ నెల వరకు మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం దానిని మే వరకు పొడిగించడంతో అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు ఊపిరి పీల్చుకున్నారు.

పెండింగ్ పనుల పూర్తికి దొరికిన సమయం...

కొత్త విధానం అమలుకు మరికాస్త సమయం కేంద్రం తీసుకోవడంతో పెండింగ్ పనుల పూర్తి చేయడానికి వీలు క లిగింది. వివిధ కారణాలతో నిర్మాణం మధ్యలోనే నిలిచి పోయిన పనుల పూర్తికి డ్వామా అధికారులు ప్రత్యే క డ్రైవ్ చేపడుతున్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం తోడు బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ప్రతి పంచా యతీ పరిధిలో కొండల్లా పెండింగ్ పనులు పేరుకుపోయాయి. బాపట్ల జిల్లాలో ఇలాంటివి దాదాపు 15 వేల వరకు పెండింగ్ చూపెడుతుండగా, మూ డు జిల్లాల పరిధిలో దా దాపు 50 వేల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అసలు ప్రా రంభం కాని పనులను ఇప్పటికే క్లోజ్ చేసిన పంచాయతీ రాజ్‌శాఖ.. మధ్యలో ఆగిపోయిన పను ల పూర్తికి చర్యలు చేపట్టిం ది. ఈ క్రమంలో ఏళ్ల నాటి పనులకు సంబంధించిన అగ్రిమెంట్ పత్రాలు, ఎం బుక్ రికార్డులు దొరకడం సవాల్‌గా మారడంతో పాటు బిల్లుల చెల్లింపులో కూడా అనేకమైన సాంకేతికపరమైన చిక్కులు ఎదురవడం కూడా ఇబ్బం దికరంగా మారింది. నిబం ధనల ప్రకారం ఉన్న పనులను క్లోజ్ చేసే విష యంలో జిల్లా పరిధిలోని అధికారులే నిర్ణయం తీసు కుంటుండగా,చిక్కులతో కూడుకున్న వాటి విషయం లో ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

కౌమారానికి.. ఆరోగ్య పాఠం

(5వ పేజీ తరువాయి)

అందుబాటులో ఉంచారు. ఆరోగ్య సంరక్షణ, మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత సంబంధాలు ఎలా ఉండాలి? నైతిక విలువలు - ప్రాధాన్యం, పౌష్టికాహారం ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, ఇతర అంశాల గురించి 15 నిమిషాలలోపు ఉండేలా వీడియోలను తెలుగు, ఆంగ్ల భాషల్లో ఉంచారు. విద్యార్థులు పరస్పరం మాట్లాడుకుంటే ఎలా ఉంటుందో అలా వివిధ అంశాలపై వీడియో పాఠాలను రూపొందించారు. ఉదాహరణకు బాలికల రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, మత్తు పదార్థాల వాడకంతో వచ్చే ఆరోగ్య క్షీణత, సోషల్ మీడియా ప్రభావ నష్టాలపై వీడియో పాఠాలు ఉన్నాయి. అలాగే ఈ-లెర్నింగ్, క్విజ్ పోటీల్లో పాల్గొనవచ్చు. ఆన్‌లైన్ పరీక్షలు రాసిన వారికి వైద్య ఆరోగ్య శాఖ ద్వారా సర్టిఫికెట్లు జారీ చేస్తారు.

ప్రభుత్వ శాఖల సమన్వయం

బాలబాలికలే నేరుగా దైనందిన జీవన విధానంలో అన్ని వివరాలు తెలుసుకునేలా 'ఏపీఎస్ హెచ్‌డబ్ల్యూపీ' పోర్టల్‌ను వైద్య ఆరోగ్య శాఖ సిద్ధం చేసింది. రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమం, ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ, యూనిసెఫ్, విద్యాశాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, మంగళగిరి ఎయిమ్స్ భాగస్వామ్యంతో సమగ్ర డిజిటల్ వేదికగా పోర్టల్ రూపొందింది. ఇందులోని ప్రతి సమాచారం చట్టాలు, ప్రభుత్వ నిబంధనలకు లోబడి పొందుపరిచిందే.

రిజిస్ట్రేషన్ విధానంలో..

ఈ పోర్టల్‌లోనే చైల్డ్ హెల్ప్‌లైన్, టెలీ మానస్ హెల్ప్ లైన్, ఇతర హెల్ప్ లైన్ల సమాచారం ఉంది. విద్యార్థులు రిజిస్ట్రేషన్ విధానంలో పోర్టల్‌లో సమాచారాన్ని తెలుసుకునే సౌకర్యాన్ని వైద్య ఆరోగ్య శాఖ కల్పించింది. ప్రతి ఈ-మాడ్యుల్ నుంచి ప్రశ్న - జవాబు రూపంలో క్విజ్ ఉంటుంది. 80 శాతం మార్కులు విద్యార్థులకు ప్రతిభ ఆధారిత సర్టిఫికెట్లు ఆటోమేటిగ్గా జారీ అవుతున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిరంతరం జరుగుతుంది. పేరు, మొబైల్ నంబరు, మెయిల్ ఐడీతో లాగిన్ అవ్వొచ్చు.

శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. బుధవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు వారం రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఏర్పాట్లను దేవాదాయశాఖ చేపట్టింది. తరలి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు అవసరమైన క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయ నున్నారు. కల్యాణానికి వచ్చిన భక్తులందరికి అన్నదానం చేయనున్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావా లని ఈవో అనుపమ, ప్రధాన అర్చకులు రత్నాకరం సత్యనారాయణ గౌతమ కోరారు.

జాతీయ షూటింగ్‌లో ముఖేష్‌కు రెండు స్వర్ణాలు



స్వర్ణ పతకాలతో ముఖేష్

గుంటూరు (క్రీడలు), మే 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ సోమవారం రెండు స్వర్ణ పతకాలను సాధించాడు. 24వ కుమార్ సురేంద్ర సింగ్ మెమోరియల్ నేషనల్ పిస్టల్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని డాక్టర్ కర్నిసింగ్ షూటింగ్ రేంజ్‌లో జరుగుతున్నాయి. ఈ పోటీల్లో సీనియర్ 25 మీటర్ల పిస్టల్ మెన్ ఈవెంట్‌లో ఒకటి, జూనియర్ విభాగంలో ఒక స్వర్ణాన్ని ముఖేష్ గెలుచుకున్నాడు.

రేపటి నుంచి నాటిక పోటీలు

పొన్నూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి 25వ రజతోత్సవ ఆహ్వాన నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ అధ్యక్షుడు సూరినేని ఆంజనేయులు నాయుడు తెలిపారు. స్థానిక కళాపరిషత్ కళా వేదిక వద్ద సోమవారం ఆహ్వాన నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆంజనేయులు నాయుడు మాట్లాడుతూ, స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాధ్ కళావేదికపై 11వ తేదీ వరకు ఈ పోటీలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 6వ తేదీన అందరూ మంచివారే కానీ, మాతృత్వం నాటికలు ప్రదర్శించనున్నట్లు చెప్పారు. 7వ తేదీన సూక్తం, చెరిగిపోని చిరునామా, 8వ తేదీన కన్నీటికి విలువెంత, దేవుణ్ని చూశా, 9వ తేదీన ఇది అతని సంతకం, మంచి మనసులు, స్త్రీ మాత్రేనమః, 10వ తేదీన అమ్మ చెక్కిన బొమ్మ, ఫోటో, 11వ తేదీన సత్య హరిశ్చంద్ర పూర్తి నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు, పొన్నూరు కళాపరిషత్ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాపరిషత్ నిర్వాహకులు

అత్తోటలో బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

● నిర్వాహకుడి అరెస్టు ● 106 మద్యం బాటిళ్లు సీజ్



పోలీసుల అదుపులో బెల్ట్‌షాపు నిర్వాహకుడు

కొల్లిపర,మే 4 (ఆంధ్ర జ్యోతి): పోలీసులు ఓ బెల్ట్‌షాపుపై ఆకస్మిక దాడులు నిర్వహించి నిర్వాహకుడిని అరెస్టు చేయడంతో పాటు 106 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మండల పరిధిలోని అత్తోట గ్రామం లో పుష్పా బిర్యానీ పాయింట్ యజమాని దైవాల సాయి సుబ్రమణ్యం అక్రమంగా మద్యం తెచ్చుకుని బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. సమాచారం అందడంతో ఆదివారం రాత్రి పోలీసులు బిర్యానీపై ఆక స్మిక దాడులు నిర్వహించారు. సాయిసుబ్రమణ్యాన్ని అరెస్టు చేసి 106 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

మ్యాజిక్.. మురుగు మాయం

(5వ పేజీ తరువాయి)

మండలం గాదెవారిపాలెంలో 1,041 మీటర్లు.. 12 కాలువల నిర్మాణం చేపట్టగా 4 కాలువలు 278 మీటర్ల పొడవున పూర్తి చేశారు. నాదెండ్ల మండలం బుక్కాపురంలో 750 మీటర్లకు.. ఏడు మ్యాజిక్ డ్రెయిన్లు ప్రారంభించగా.. ఒక కాలువ 75 మీటర్లు పూర్తయింది.

బాపట్ల జిల్లా చినగంజాం మండలం నీలాయపాలెంలో 600 మీటర్ల ఐదు పనులు చేపట్టగా అన్ని పనులు పూర్తయ్యాయి. మార్టూరు మండలం చిమ్మిరిబండలో 700 మీటర్ల పొడవున ఏడు పనులు పూర్తయ్యాయి. వేమూరు మండలం పోతుమర్రులో 885 మీటర్ల పనులకు.. 536 మీటర్ల పొడవున ఆరు పనులు పూర్తయ్యాయి.

గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చింతలపూడిలో 350 మీటర్ల పొడవునా.. నాలుగు పనులు చేపట్టగా ఒక్క పని కూడా పూర్తి కాలేదు. మేడికొండూరు మండలం మంగళగిరిపాడులో 334 మీటర్లలో ఐదు పనులు చేపట్టగా 53 మీటర్ల పొడవున ఒక్క కాలువ నిర్మాణం పూర్తి చేశారు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో 190 మీటర్ల పొడవునా.. రెండు పనులు పూర్తయ్యాయి. తెనాలి మండలం కొలకలూరులో 595 మీటర్లు.. 8 కాలువల నిర్మించగా.. 230 మీటర్ల మూడు పనులు పూర్తి చేశారు.

మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం..ప్రయోజనం

మ్యాజిక్ డ్రెయిన్లు సిమెంట్ రోడ్ల పక్కగా నిర్మిస్తారు. సాంప్రదాయ కాంక్రీట్ డ్రెయినేజీలు ప్రత్యామ్నాయం. వ్యర్థ జలాలను సహజ పద్ధతిలో శుద్ధి చేసి.. భూమిలోకి ఇంకేలా చేసి, కలుష్యం, దోమల బెడద తగ్గించే ఒక బృహత్తర కార్యం. దీని నిర్మాణ ఖర్చు కాంక్రీట్ కాల్వల కంటే చాలా తక్కువ. కాంక్రీట్ డ్రెయిన్ నిర్మాణం 100 మీటర్లకు రూ.4 లక్షలు వ్యయం అయితే.. మ్యాజిక్ డ్రెయిన్‌కు రూ.90 వేలే ఖర్చు అవుతుంది. మ్యాజిక్ డ్రెయిన్ రెండు అడుగుల లోతు, అర మీటరు వెడల్పుతో తవ్వ తారు. రాళ్లు, కంకర, ఇసుకతో పొరలుగా నింపుతారు. కాలువకు 50 మీటర్లకు ఒక ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తారు. ఈ గుంత కింద నుంచి గ్రేడెడ్ రాళ్లు, కంకర, ఇసుక వంటి పొరలను ఏర్పాటు చేస్తారు. కందకంలోకి ఇళ్ల నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు చేరడంతో.. సహ జంగానే వడకట్టి నేలలోకి ఇంకేలా చేస్తుంది. దీంతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. పర్యావరణ హితానికి మ్యాజిక్ డ్రెయిన్‌లు దోహదప డనున్నాయి. నీటి యాజమన్య సంస్థ పర్యవేక్షణలో ఈ పనులు జరుతున్నాయి.

ఆలోచింపజేస్తున్న నాటికలు

తెనాలి అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం ఖాజీపేట నాటకశాల వద్ద సాయి ఆర్ట్స్ కొలకలూరు, కొలంకపురి నాటక పరిషత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆహ్వాన నాటికల పోటీలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. సోమవారం మూడు నాటికలు ప్రదర్శించారు. విజయవాడ సాంస్కృతిక సమితి కళాకారులు ప్రదర్శించిన మమ్మల్ని బతకనివ్వండి నాటికను సుఖమంచి కోటేశ్వరరావు రచించి, దర్శకత్వం వహించారు. నెల్లూరు క్రాంతి ఆర్ట్ థియేటర్ కళాకారులు ప్రదర్శించిన ఫొటో నాటికను వెంకటేశ్వరరావు రచించగా సురేష్‌బాబు దర్శకత్వం వహించారు. న్యూఢిల్లీ కృష్ణ తెలుగు థియేటర్ కళాకారులు మరో పుత్తడి బొమ్మ నాటిక ప్రదర్శించారు. ఈ నాటికను పిటి మాధవ్ రచించగా చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. గోపరాజు రమణ, విజయ్ నాటికల ప్రదర్శనలను పర్యవేక్షించారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కారంపూడి, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 2026-2027 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. 3, 4, 5తరగతుల్లో ప్రతి తరగతికి 40 చొప్పున, 6, 7ల్లో 16, 8లో 12, 9లో 14 సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	140, 149, 160
చికెన్ విత్ స్కిన్(కిలో)	270.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	280.00

మిర్చియార్డు సమాచారం

(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,16,970
అమ్మకాలు	1,12,846
నిల్వ	26,778

నాన్ ఏసీ కామన్ వెరైటీ

334	13500	22800
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	21500
4884	----	----
సూపర్ 10	----	----

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	13500	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14500	22500
దేవనూరు డీలక్స్	15000	22000
ఆర్మూరు	13000	19200

334	----	----
నెంబరు. 5	----	----
273	----	----
341	----	----
4884	----	----
సూపర్ 10	----	----

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	----	----
బ్యాడిగి 355	----	----
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	11000



మోతీలాల్ నగర్ వాసులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

మోతీలాల్ నగర వాసులకు తోడుగా ఉంటా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): మోతీలాల్ నగర్ నిర్వాసితులను తన సొంత కుటుంబ సభ్యులుగా భావించి అండగా నిలుస్తాననే మాటపై నిలబడతానని, ఏ కష్టమొచ్చినా తోడుగా ఉంటానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం మోతీలాల్ నగర్ నిర్వాసితుల్లో 40 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చిత్త శుద్ధితో వ్యవహరిస్తామని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో అభివృద్ధిలో భాగంగానే మోతీలాల్ నగర్ లో ఇళ్ల కూల్చివేత చేపట్టారని చెప్పారు. వైసీపీ నాయకులు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. గత పదేళ్లలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి ఆనవాళ్లు ఎక్కడా కనిపించ లేదని, తాము అధికారం చేపట్టిన కేవలం 18 నెలల కాలంలోనే వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అభివృద్ధి అనే పదానికి అర్థం తెలియని వాళ్లు పేదల ఇళ్లపై రాజకీయం చేస్తుంటే ప్రజలు చీదరించుకుంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో దాసరి రాజామాస్టారు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం సహించం : కమిషనర్



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలో డ్రెయిన్ క్రాస్ తాగునీటి పైప్‌లైన్ల విషయంలో ఇంజినీరింగ్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కమిషనర్ కె.మయూర్ అశోక్ హెచ్చరించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో డ్రెయిన్ క్రాస్ పైప్‌లైన్ల షిఫ్టింగ్, పూడికతీత పనులు, చలివేంద్రాల నిర్వహణ, బిల్స్ నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ తదితర అంశాలపై సోమవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ బ్రాడీపేటలో డ్రెయిన్ క్రాస్ పైప్‌లైన్ల విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత ఎమినిటీ కార్యదర్శి, ఏఈ, డీఈఈ, ఈఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎస్‌ఈని ఆదేశించారు. మంగళవారం సాయంత్రానికి ఈఈల సంతకాలతో పూర్తిస్థాయి నివేది కను సమర్పించాలన్నారు. అదేవిధంగా చలివేంద్రాల్లో తాగునీటిని సక్ర మంగా ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెండ్ చేస్తామని, మొదటి హెచ్చరికగా గోరంట్ల ప్రాంత ఎమినిటి కార్యదర్శి, ఏఈ, డీఈఈలకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, అదనపు కమిషనర్ (ఇంచార్జి) సాంబశివరావు, ఈఈ లు సుందర్రామిరెడ్డి, విష్ణు, వేణు, కళ్యాణరావు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై అధికారులు త్వరితగతిన స్పందించాలి

ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారంపై అధికారులు త్వరితగతిన స్పందించాలని, ప్రజా సమస్యలపై అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ కె.మయూర్ అశోక్ హెచ్చరించారు. సోమవారం జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 48 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ఇన్‌చార్జి) జి.సాంబశివ రావు, డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

జలధార పనులు త్వరగా ప్రారంభించాలి

● జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): జలధార-జలహారతి పనులు త్వరగా ప్రారంభం కావాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. జలధార, పీజీఆర్ఎస్, రీసర్వే, ఉపాధి హామీ తదితర అంశాలపై సోమవారం జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జలధార జలహారతి పనులు మంజూరు అయినప్పటికీ, పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతున్నట్లు ఆన్‌లైన్‌లో స్పష్టమౌతోందన్నారు. పనులు త్వరగా ప్రారంభం చేయడమే కాకుండా వాటిని వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలు పరిష్కరించుటకు వాటిపై 48 గంటలలో చర్యలు చేపట్టాలన్నారు. జనగణన వేగవంతం చేయాలని, సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కారం చేసుకుంటూ జనగణన చేయాలని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకాలను బుధవారం నాటికి పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లాడ్జీలు, హోటల్స్‌పై పోలీసుల ఆకస్మిక దాడులు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ వకుల్ జిందాల్ అదేశాల మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గల పలు లాడ్జీలు, హోటల్స్‌లో నల్లపాడు సీఐ పి.భాస్కర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సరిగా ఉన్నాయా లేదా అనే వివరాలు పరిశీలించారు. హోటల్స్, లాడ్జీలు, అతిధి గృహాల్లో వ్యభిచారం, పేకాట, క్రికెట్ బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగితే సంబంధిత వ్యక్తులతో పాటు ఆయా హోటళ్ళ నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. హోటళ్ళు, లాడ్జీలలో సీసీ కెమెరాలు తప్పనిసరి అన్నారు.

30 క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం

● ముగ్గురిపై కేసు నమోదు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న 30 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు తూర్పు పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ బండేల భాస్కరరావు నగరంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో సాధారణ తనిఖీల చేస్తున్న సమయంలో శ్రీనగర్ ప్రాంతానికి చెందిన తిరుమలశెట్టి క్రాంతి కుమార్, సంగడిగుంట ప్రాంతానికి చెందిన శ్రీహరి, రాజాగారితోటకు చెందిన వనమాల వెంకటేశ్వర్లు (వాహన డ్రైవర్) ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం బ్లాక్ మార్కెట్‌కు మళ్లిస్తున్నట్లు గమనించారు. డీటీ వెంకటేశ్వర్లు మధ్యవర్తుల సమక్షంలో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని, రవాణా చేస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. లాలాపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విజయ్ గెలుపు బడుగు, బలహీనవర్గాల విజయం

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో టీవీకే పార్టీ అధినేత విజయ్ గెలుపు దేశంలోని బడుగు, బలహీనవర్గాల విజయమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ తెలిపారు. తమిళనాడులో జోసెఫ్ విజయ్‌కుమార్ ఘన విజయం సాధించటంపై హర్షం వ్యక్తం చేస్తూ దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో లాడ్జి సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తమిళనాడులో టీవీకే అధినేత విజయ్ దళపతి పార్టీ స్థాపించిన అనతికాలంలోనే అధికార పగ్గాలు చేపట్టటం దేశ రాజకీయ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని సృష్టించారన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా హేమప్రసాద్, మహిళా అధ్యక్షురాలు మేరి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి, గోళ్ళ క్రాంతికుమార్, డేవిడ్ విలియమ్స్, నరసింహరావు, వాసు, సముద్రాల కోటేశ్వరరావు, నరసింహరావు, కోటిరత్నం తదితరులున్నారు.

ప్రజల సంతృప్తి స్థాయి మెరుగుపడాలి

● జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ
● పీజీఆర్ఎస్‌కు 204 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ, డిప్యూటి కలెక్టర్ గంగరాజు తదితరులు

గుంటూరు(తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని అధికారులకు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆర్డీవో శ్రీనివాస్, డిప్యూటి కలెక్టర్ గంగరాజుతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇతర సమస్యలపై 199, రెవెన్యూ క్లినిక్‌కు 5 మొత్తం 204 అర్జీలు అందాయి. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, అగ్రికల్చరల్ జేడీ పద్మావతి, ఉద్యానశాఖ డీడీ రవీంద్రబాబు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డీపీవో నాగసాయికుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వీ, డ్వామా పీడీ శంకర్, దేవదాయ, ధర్మదాయ సహాయ కమిషనర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికునికి గుర్తింపు కార్డు ఇవ్వాలి

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డు ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు కోరారు. ఈ మేరకు జనతా వారధి కార్యక్రమంలో భాగంగా పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డులో ఉన్న పథకాలపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారించాలి

పాతగుంటూరు, యాదవ పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని జాయింట్ కలెక్టర్‌కు ఆ పాఠశాల కమిటీ సభ్యుడు బట్టా శివ రామకృష్ణ, శ్రీను, ప్రసాదు ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో 10 టీచర్ల పోస్టులకు ఒక్కో ఉద్యోగానికి పాఠశాల కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి రూ 30 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపించారు. బైలా ప్రకారం ఎన్నికలు నిర్వహించడం లేదని, కనీసం జనరల్ బాడీ సమావేశం కూడా ఏర్పాటు చేయడం లేదన్నారు.

బొంతపాడు వద్ద ఉన్న అనధికార మార్కెట్‌ను మూసివేయాలి

నగరపాలక సంస్థకు చెందిన కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లోకి సరుకులు, కూరగాయలు, రైతులను రానివ్వకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వ్యాపారస్తులు అర్జీ అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి, బొంతపాడు వద్ద మార్కెట్ మూసి వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

గుంటూరు(తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ పాల్గొని నలుగురు దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.15 వేల విలువైన విద్య ఉపకరణాలను అందజేశారు. ఉపకరణాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎన్. వెంకటరవణప్ప తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవితం

● మంత్రి సత్యకుమార్

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): 'యోగాసనాల ప్రాధాన్యంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలి. ఆరోగ్య కర జీవితానికి యోగా అవసరం' అని మంత్రి సత్యకుమార్ అన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా డేని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం విజయవాడలోని ఆయుష్ కార్యాలయంలో యోగా డే ఏర్పాట్లపై సమీక్షించారు. యోగా ప్రచార, అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉద్యోగులు, రోటరీ, లయన్స్ క్లబ్ ఇతర సమాజ సేవా సంస్థలను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న యోగా శిక్షకులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించి కార్యక్రమాల నిర్వహణపై వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. అమరావతి పరిధిలో సీఎం చంద్రబాబు అధ్యక్ష తన యోగా డేని నిర్వహించేలా ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో యోగాసనాలు వేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని కమిషనర్ రోణంకి గోపాలకృష్ణను ఆదేశించారు. యోగా, ప్రకృతి వైద్యం సలహాదారు మంతెన సత్యనారాయణరాజు పలు సూచనలు చేశారు. ఆయుష్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బ్రాడీపేట 4/1వ లైనులోని రఘుమ్యాన్షన్‌లో ఉన్న భారతీయ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోర్టు ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించింది. సోమవారం సంస్థ వ్యవస్థాపకుడు చిగురుపాటి రవీంద్రబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. రవీంద్రబాబు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా తాము ఏటా వేసవికాలంలో కోర్టుకు వచ్చే న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారులు వడదెబ్బ భారిన పడకుండా ఉండేందుకు మజ్జిగని పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుధారాణి, శ్రీదేవి, లక్ష్మి పాల్గొన్నారు.



మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న భారతీయత సంస్థ ప్రతినిధులు

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

గుంటూరు(తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి) : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేవరకు పోరాటాలు తప్పవని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ స్పష్టం చేశారు. స్థానిక బ్రాడీపేట, జ్యోతి నిలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు ఎస్సీ హోదా లభించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈనెల 20న లాడ్జి సెంటర్‌లోని ఎల్ఈఎం మైదానంలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ నుదురుపాటి చంద్రమోహన్, బత్తుల అనిల్‌కుమార్, జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి విజయ్‌కుమార్, నల్లపు నీలంబరం, పాస్టర్ పురుషోత్తమ చౌదరి, గద్దె రత్నశ్రీ, శిఖా సురేష్, మద్దు ప్రేమజ్యోతిబాబు, టి.నరసింహారావు, మాల్యాద్రి, శేషయ్య పాల్గొన్నారు.

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా వెంకట్రావు

గుంటూరు కార్పొరేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి): బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా జి.వెంకట్రావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం నూతన కమిటీతో కలిపి ఆయన బాధ్యతలు స్వీకరించారు. నగరంలోని పలకలూరు రోడ్డులో గల గుంటూరు క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా జి.వెంకట్రావు, సెక్రటరీగా కే.మహేష్, ట్రెజరర్‌గా జి.శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ రామకోటయ్య, వల్లభనేని వెంకటేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, శేషగిరిరావు, సబ్కా స్టేట్ కోఆర్డినేటర్ శివకుమార్, జయరాం, కె.వెంకట్రావు, బిల్డర్స్ పాల్గొన్నారు.

కాశీఖండంపై ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు(తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం కాశీఖండంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త ఎంవీ సత్యవతి ప్రవచిస్తూ శ్రీనాథ మహాకవి రచించిన కాశీఖండం ప్రధానంగా కాశీ క్షేత్ర పవిత్రతను, మహిమను చాటిచెప్పే అద్భుత కావ్యమన్నారు. శ్రీనాథుని అద్భుత పదప్రయోగాలతో ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుందన్నారు.

6 నుంచి ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ

గుంటూరు(క్రీడలు), మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అరండల్‌పేట మాజేటి గురవయ్య పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 6 నుంచి జూన్ 6 వరకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏసీఏ త్రీ మెన్ కమిటీ సభ్యులు టీవీఎస్ శివరామకృష్ణ, సీహెచ్‌వీ నాగరాజు, జీవీఎస్ శరత్‌బాబు తెలిపారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో 10 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల లోపు క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

బెంగాల్‌లో దుష్ట పాలనకు సమాధి : దర్శనపు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : బెంగాల్‌లో దుష్ట పాలనకు ప్రజలు సమాధి కట్టారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో మూడు రాష్ట్రాల్లో కాషాయ జెండా ఎగురవేయడం శుభపరిణామమన్నారు. కమ్యూనిస్టు భావజాలం భారత దేశం నుంచి పూర్తిగా తుడిచి వేయడం, అదేవిధంగా తమిళనాడులో హిందూ వ్యతిరేకి పార్టీ అయిన డీఎంకే పార్టీని ప్రజలు ఓడించడం అభినందనీయమన్నారు. అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాలలో తిరిగి మరోసారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం సంతోషకరమన్నారు.

యోగాతో శారీరక, మానసిక ధృఢత్వం



యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న అదనపు ఎస్పీ హనుమంతు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): యోగాతో శారీరక ధృఢత్వంతో పాటు మానసిక స్థిరత్వం, ఆలోచనా సామ ర్థ్యం మెరుగుపడతాయని ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు అన్నారు. సోమవారం పోలీస్ పరేడ్ మైదానంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి యోగా అభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ, యోగా, ధ్యానం అభ్యాసంతో మనిషి ఆలోచనా విధానం, సామర్థ్యం మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి , పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్, డీసీఆర్బీ-1 సీఐ ప్రభాకర్, వెల్ఫేర్ ఆర్ఐ సురేష్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చూపించింది ఓ పొలం.. విక్రయించింది మరొకటి

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన దంపతులు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ఒక పొలాన్ని చూపించి మరో పొలాన్ని విక్రయించి మోసం చేశారంటూ అమరావతి రోడ్డులోని నగరాలు ప్రశాంతినగర్‌కు చెందిన సిద్ధినేని పవన్ కుమార్, శ్వేత దంపతులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. గోరంట్లకు చెందిన ఇరువురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లుగా పరిచయమై తమకు తాడికొండ అడ్డరోడ్డులో 22.5 సెంట్ల పొలాన్ని చూపారన్నారు. రూ.73 లక్షలకు ఒప్పందం కుదిరగా రూ.51 లక్షలు తీసుకున్నారన్నారు. తీరా రిజిస్ట్రేషన్‌కు సిద్ధమైన తరుణంలో తమకు చూపిన పొలం వేరేదని తెలిసిందన్నారు. ఆ స్థలం హై టెన్షన్ విద్యుత్తు లైన్ తీగల కింద ఉందన్నారు. విచారించగా తమకు చూపిన ఒప్పంద పత్రం కూడా ఫోర్జరీ సంతకాలతో సృష్టించినట్లు తెలిసిందన్నారు. గట్టిగా నిలదీయడంతో డబ్బు వెనక్కు ఇస్తామని చెప్పారని, అయితే తమకు కేవలం రూ.20 లక్షల మాత్రమే ఇచ్చారని, ఇంకా రూ.31 లక్షలు ఇవ్వాల్సి ఉందని అడుగుతుంటే బెదిరిస్తున్నారని బాధిత దంపతులు వాపోయారు.

షాపులు కబ్జా చేసేందుకు రౌడీలతో దాడులు

పదహారేళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలంలో తాము షాపులు కట్టుకొని జీవనం సాగిస్తుంటే ఇప్పుడు వాటిని కబ్జా చేసేందుకు కొందరు రౌడీలతో దాడులు చేయిస్తున్నారని బాధితులు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్పీ స్కూల్ ఎదురు 326 చదరపు గజాల స్థలాన్ని 2011లో గోపిశెట్టి జానకమ్మ వద్ద తాము కొనుగోలు చేశామని, అందులో తాను బుక్ షాపు పెట్టుకున్నానని శేషయ్య, అలాగే బోటిక్ పెట్టుకున్నానని కంకిపాటి రాఘవేంద్రరావు, చికెన్ షాప్‌కు అద్దెకిచ్చానని అజీజ్, పాత సామాన్ల షాపు పెట్టుకున్నామని కొండలు పేర్కొన్నారు. అయితే డోకిపర్రు రాజు అనే వ్యక్తి మరో 40 మందితో షాపులపై దాడి చేసి తమను ఖాళీ చేయాలని బెదిరిస్తున్నాడని వాపోయారు. తనకు రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయని, మమ్మల్ని ఏమీ చేయలేరని నిందితులు బెదిరిస్తున్నారని వారి నుంచి తమకు, తమ ఆస్తికి రక్షణ కల్పించాలని బాధితులు వేడుకున్నారు.

అద్దె చెల్లించలేదని దాడి

అద్దె చెల్లించలేదని ఇంటి యజమాని తమపై దాడి చేసి ఇంటి నుంచి గెంటేశాడని బాధిత మహిళలు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. పాతగుంటూరులోని ఆంజనేయస్వామి గుడి వెనుక వీధిలో ప్రభుత్వ ఉద్యోగి నాగరాజు ఇంటిలో తాముపై అంతస్తులో ఉంటుండగా, నాగరాజు కింది పోర్షన్‌లో ఉంటున్నారన్నారు. గత నెల 23న తమపై నాగరాజు దాడి చేసి కొట్టి ఇంటికి తాళం వేసి బయటకు గెంటివేశా రన్నారు. అప్పటి నుంచి తాము పెదకాకాని దర్గాలో తలదాచుకుంటు న్నామని, పోలీసు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తమ ఇంటి సామాను, దుస్తులు తమకు ఇప్పించాలని వారు వేడుకున్నారు.

నష్టం వచ్చినా లాభం ఇవ్వాలని బెదిరిస్తున్నారు

అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా ఎగుమతులు నిలిచిపోయి పొగాకు వ్యాపారంలో నష్టం వస్తే, తన తోటి వ్యాపార భాగస్వాములు వడ్డీతో సహా లాభాలు ఇవ్వాల్సిందేనని, లేదంటే చంపేస్తామని బెదిరిస్తున్నారని లాలాపేట పెద్ద మసీదు ప్రాంతానికి చెందిన వ్యాపారి మొహమ్మద్ అబ్దుల్ కరీం బేగ్ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తన వ్యాపార భాగస్వాములు పాత గుంటూరుకు చెందిన సయ్యద్ కరామత్, లాలాపేటకు చెందిన సయ్యద్ మన్సూర్‌పై తగు చర్యలు తీసుకుని, తనకు రక్షణ కల్పించాలని ఆయన వేడుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్స్, విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష్మీపురం మెయిన్‌రోడ్డు, అశోక్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.



ఎమ్మెల్యే గళ్ళా మాధవికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఫిజియోథెరపిస్టులు

ఎమ్మెల్యే మాధవికి ఫిజియోథెరపిస్టుల అభినందనలు

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా నియమితులైన గళ్ళా మాధవిని పలువురు నేతలు, ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్ యాదవ్ ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకట హరికృష్ణ, సుభాని తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా ఫిజియోథెరపీ రంగానికి ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫిజియోథెరపీ విభాగాలను ఆధునీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. వారి వినతులను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి సంబంధిత అంశాలను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైన పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్ర మంలో ఏడుకొండలు, ఇమ్రాన్ ఖాన్, రాజేంద్ర ప్రసాద్, దయాకర్‌రావు, నాగజ్యోతి, హారిక, ఫిజియోథెరపీ కాలేజీ ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.

అమరావతిపై విష ప్రచారం మానుకోవాలి

● వైసీపీ నేతలకు గాదె హితవు



సమావేశంలో మాట్లాడుతున్న గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతిపై దుష్ప్రచారం మానుకోవాలని వైసీపీ నేతలకు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు హితవు పలికారు. సోమవారం లాడ్జి కూడలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, వైసీపీకి చెందిన సజ్జల రామకృష్ణారెడ్డితో సహా వారి నేతలంతా రాజధాని అమరావతిపై విమర్శలు చేయడం ఆనవాయితీగా మారిందని గాదె మండిపడ్డారు. రాజధానిలో అద్దాల కోసం విపరీతంగా ఖర్చు చేస్తున్నారంటూ విష ప్రచారం చేయడం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ కార్యాలయాలకు, ఇతర సంస్థలకు ఆ పార్టీ రంగులు వేసేందుకే రూ.2 వేలకోట్లు ఖర్చు పెట్టిన విషయం మర్చిపోయారా అంటూ గాదె ధ్వజమెత్తారు. అంతర్జాతీయ స్థాయిలో రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతోందని అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్దిష్టమైన విధి విధానాలతో ప్రణాళిక బద్ధంగా రాజధాని నిర్మాణం చేస్తున్నట్లు ఆయన వివరించారు. సమావేశంలో జనసేన నాయకులు శిఖా బాలు, నక్కల వంశీ, కొండూరు కిషోర్, మత్తి భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు క్లబ్‌లో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు శ్రీకారం

● రూ.6 కోట్లతో నిర్మాణానికి భూమి పూజ



మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు భూమిపూజ నిర్వహిస్తున్న పూర్ణచంద్రరావు

గుంటూరు (తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు క్లబ్ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు భూమి పూజ జరిగింది. క్లబ్ అధ్యక్షుడు వడ్లమూడి పూర్ణచంద్రరావు, ఉపాధ్య క్షుడు పాతూరి కిరణ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్ల మూడి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, గుంటూరు క్లబ్‌ను ఆధునిక సదుపా యాలతో అభివృద్ధి చేసి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సభ్యులకు క్రీడలతో పాటు విశ్రాంతి, ఆహ్లాద వాతావరణం కల్పించేలా ఈ కాంప్లెక్స్‌ను రూపొందిస్తున్నామని చెప్పారు. పికిల్‌బాల్, షూటింగ్, స్నూకర్ వంటి ఇండోర్ క్రీడలకు అనుకూలంగా అత్యాధునిక సదుపాయాలతో ఇండోర్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి భూపెన్, కమిటీ సభ్యులు సూర్యదేవర తిరుమల దేవ్, కిరణ్, వెంకట్, భూపెన్, బచ్చు రమేష్, నరేంద్రబాబు, గోలి శ్రీనివాసు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు



మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), మే 4 (ఆంధ్రజ్యోతి): ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో విజయం సాధించిన సందర్భంగా బీజేపీ శ్రేణులు సోమ వారం నగరంలో సంబరాలు నిర్వహించాయి. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో లక్ష్మీపురం వాజ్‌పేయి సర్కిల్ వద్ద ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం టపాసులు పేల్చి, మిఠాయిలు పంచు కున్నారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో సాధించిన విజయం కార్యకర్తల త్యాగఫలమని, ప్రజలు అభివృద్ధి కోసం బీజేపీకి మద్దతు ఇచ్చారని అన్నారు. సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు మాట్లాడుతూ, అస్సాం, పుదుచ్చేరిలో పార్టీ స్థానాన్ని నిలబెట్టుకోగా, పశ్చిమ బెంగాల్‌లో అద్భుత విజయం సాధించిందన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని, రానున్న ఎన్నికల్లో బీజేపీ మరింత విజయాలు సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లాడ్జిలో యువకుడి అనుమానాస్పద మృతి



రాజేశ్ కుమార్ (ఫైల్)

గుంటూరు, మే 4 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కోమలి లాడ్జిలో హైదరాబాద్ చిరునామా కలిగిన యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట గోల్కా వెజిటబుల్ మార్కెట్ చిరునామా కలిగిన బూర రాజేష్ కుమార్ సుమారు 10 రోజుల నుంచి గుంటూరు రైల్వే స్టేషన్ రోడ్‌లోని కోమలి డార్మెటరీ లాడ్జిలో ఉంటున్నాడు. ఈ నెల 1న సాయంత్రం 7.00 గంటలకు బాత్రూంలోకి వెళ్లి ఎంతసేపటికి రాకపోయేసరికి లాడ్జి యజమాని బాత్రూం తలుపు తీసి చూడగా చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని కొత్తపేట పోలీసులు మార్చురీలో భద్రపరిచారు. మృతుడిని గుర్తించిన వారు కొత్తపేట సీఐ ఎం.వీరయ్య చౌదరికి 86888 31320లో, ఎస్సై సుబ్బారావు 8688831608లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు...

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి చెందారు. సుమారు 45 సంవత్సరాలు వయసు గల గుర్తుతెలియని వ్యక్తి గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మధువన్ హోటల్ ఎదురుగా రోడ్డు డివైడర్‌పై మృతి చెందాడు. సుమారు 50 సంవత్సరాలు వయసు గల మరో గుర్తుతెలియని వ్యక్తి గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద మృతి చెందాడు. సోమవారం స్థానికుల సమాచారంతో కొత్తపేట పోలీసులు మృత దేహాలను ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. మృతులను గుర్తించిన వారు కొత్తపేట సీఐ వీరయ్య చౌదరికి 8688831320లో గానీ, పోలీస్ స్టేషన్‌కు 0863 2221815లో గానీ, ఏఎస్సై శ్రీనివాసరెడ్డికి 9849272293లో గానీ తెలియజేయాలని పోలీసులు కోరారు.



విజిల్ పోడు

ఓటముల్లో త్వరలో సెంచరీ

రాహుల్‌పై బీజేపీ వ్యంగ్యం

ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై 'ఎక్స్'లో బీజేపీ వ్యంగ్య వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే కాంగ్రెస్ 99 ఎన్నికల్లో ఓడిపోయిందని, త్వరలోనే 100కు చేరుకుంటుందని ఒక పోస్టులో ఎద్దేవా చేసింది. రాహుల్ నాయకత్వంలోని కాంగ్రెస్‌ను ప్రజలు పదేపదే తిరస్కరిస్తున్నారని వ్యాఖ్యానించింది. ఈ మేరకు ఆ పార్టీ ఓ ఇన్ఫోగ్రాఫిక్‌ను విడుదల చేసింది.

మోదీమయ భారత్: బీజేపీ

భారత్ మోదీమయం అయిపోయిందని, కాషాయం బెంగాల్ వరకు చేరిందని బీజేపీ పేర్కొంది. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. బీజేపీ సొంతంగా, ఎన్డీయేలో భాగంగా మిత్రపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలతో కూడిన చిత్రాన్ని కూడా జోడించింది. "ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు, ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు.. ఇది విస్తరణ మాత్రమే కాదు. ప్రజలు మాపై చూపుతున్న విశ్వాసానికి ప్రతీక" అని పేర్కొంది.

బెంగాల్‌లో కాషాయ విప్లవం





బెంగాల్ కంచుకోటలో..



తమిళ జననాయగన్..

కమలం విజయం

(మొదటిపేజీ తరువాయి)

వామపక్షాల నేతృత్వంలోని ఎల్డీఎఫ్ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఘన విజయం సాధించింది. ఇక్కడి అసెంబ్లీలోని 140 సీట్లలో యూడీఎఫ్ ఏకంగా 102 సీట్లను చేజిక్కించుకుంది! తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఊరట అంటూ ఏదైనా ఉందంటే అది కేరళంలో విజయమే! అలాగే, అసోంలో హిమంత బిశ్వ శర్మ హ్యాట్రిక్ సాధిస్తే.. పుదుచ్చేరిలో ఎన్డీయే మరోసారి పాగా వేసింది! ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో మూడు బీజేపీ ఖాతాలోనే పడడం విశేషం!!

చరిత్ర సృష్టించిన జెన్‌జీ, మహిళలు

శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్మభూమి పశ్చిమ బెంగాల్లో అధికారం.. బీజేపీ రెండు దశాబ్దాల కల! అందుకే, ఈసారి ఇక్కడ అధికారం చేజిక్కించుకోవడానికి ఆ పార్టీ తన శక్తినంతా ధారపోసింది! ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రతి దశలోనూ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించింది! ఫిరాయింపుదార్లకు టికెట్లు ఇవ్వలేదు. క్షేత్రస్థాయిలో పట్టున్న వారిని మాత్రమే అభ్యర్థులుగా నిలిపింది! గత ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో స్వల్ప తేడాలతోనే ఓటమి పాలైంది. అందుకే, ఈసారి ఆయా నియోజకవర్గాలను మూడు (బలమైనవి, దృష్టి సారించాల్సినవి, బలహీనం) క్యాటగిరీలుగా వర్గీకరించింది. అన్ని నియోజక వర్గాల్లోనూ పన్నా ప్రముఖ్‌లు కీలక పాత్ర పోషించారు. శక్తి కేంద్రాల ఏర్పాటుతో ఓటర్లను పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలించారు! పశ్చిమ బెంగాల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ కావడానికి ఇదే ప్రధాన కారణంగా చెబుతున్నారు! కొన్నేళ్ల కిందటి నుంచే ఆరెస్సెస్ ఇక్కడ క్షేత్రస్థాయిలో క్రియాశీలంగా మారింది! అంతేనా.. ఇక్కడ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అమిత్ షా పూర్తిస్థాయిలో పర్యవేక్షించారు! రాష్ట్రంలోని 44,000 పోలింగ్ కేంద్రాల పరిధిలోని సమావేశాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు! ఇక, ప్రచారంలోనూ బీజేపీ వినూత్న పంథానే అనుసరించింది! ముఖ్యమంత్రి మమతా బెనర్జీని పెద్దగా విమర్శించకుండా ఎమ్మెల్యేలను టార్గెట్ చేసింది! ప్రతి ఎమ్మెల్యే అవినీతిపైనా చార్జిషీట్లు విడుదల చేసింది. వీటన్నిటికీతోడు ప్రజలను ఆకర్షించడానికి చేతికి ఎముకే లేనట్టుగా ఉచిత హామీలను గుప్పించింది! గెలుపే లక్ష్యంగా ఓవైపు హిందూ ఓటర్ల ఏకీకరణ చేపడుతూనే.. మరోవైపు, మమతా బెనర్జీకి గుండెకాయ వంటి ముస్లిముల్లో చీలిక తీసుకొచ్చింది! కేవలం మహిళలే లక్ష్యంగా బీజేపీ ప్రకటించిన ఉచిత హామీలకు తోడు ట్రిపుల్ తలాక్ వంటి విధానాలతో ముస్లిం మహిళల్లో కొందరు బీజేపీకి ఓటేశారని విశ్లేషకులు వివరిస్తున్నారు. దక్షిణ బెంగాల్లోని నియోజకవర్గాల్లోనూ బీజేపీ విజయ దుందుభిని ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు. అక్కడ 38మహిళా ప్రాబల్య నియోజకవర్గాలుంటే 30కిపైగా సెగ్మెంట్లలో బీజేపీ హవానే నడిచిందని విశ్లేషిస్తున్నారు. వెరసి, 15 ఏళ్లపాటు పట్టువిడువని పక్కా వ్యూహంతో పశ్చిమ బెంగాల్‌లో అద్వితీయ విజయాన్ని బీజేపీ దక్కించుకుంది! అదే సమయంలో, తమిళనాట పెను సంచలనం సృష్టించిన విజయ్‌దీ సుదీర్ఘ వ్యూహమే! సినిమాల్లో సూపర్ హిట్ అయిన ఆయన 2009లోనే ఆ రాష్ట్ర వ్యాప్తంగా 'విజయ్ మక్కళ్ ఇయక్కం' (వీఎంఐ) పేరిట 85 వేల ఫ్యాన్ క్లబ్‌లను ఏర్పాటు చేశారు. 2011 ఎన్నికల్లో అన్నాడీఎంకేకు మద్దతు ఇచ్చారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వీఎంఐ తరఫున ఆయన అభిమానులు ఎన్నికల బరిలో నిలిచారు. అప్పటి నుంచే విజయ్ పార్టీ ఏర్పాటుపై ఊహాగానాలు మొదలయ్యాయి. చివరకు, రెండేళ్ల కిందట 2024 ఫిబ్రవరిలో టీవీకే పేరిట విజయ్ పార్టీ ఏర్పాటు చేశారు! నిజం చెప్పాలంటే, పార్టీ ఏర్పాటు చేసినప్పటి నుంచీ ఆయనకు అన్నీ ఎదురు దెబ్బలే. కరూర్ సభలో తొక్కిసలాటతో 41 మంది దుర్మరణం పాలయ్యారు. సరిగ్గా ఎన్నికలు దగ్గరకు వచ్చినప్పుడు భార్య విడాకులకు దరఖాస్తు చేశారు. ఆయన నటించిన జననాయగన్ సినిమా విడుదల ఆగిపోయింది. వీటన్నిటి నేపథ్యంలో ఆయన పెద్దగా ప్రచారమూ చేయలేదు. కానీ, ఎన్నికల ప్రచారం మొత్తాన్ని ఆయన అభిమానులే నడిపించారు. ఆయన ప్రకటించిన ఉచిత పథకాలకుతోడు జెన్‌జీ యువత, మహిళలు విజయ్‌ను అక్కున చేర్చుకున్నారు. అందుకే, సినిమా నటులపై ఆకర్షణ తారస్థాయిలో ఉండే తమిళనాట ఎంజీఆర్, అన్నాదురై, జయలలిత తర్వాత అరంగేట్రంలోనే విజయ్ అదుర్స్ అనిపించారు! అటు ద్రవిడ సిద్ధాంతమూ కాకుండా ఇటు ద్రవిడ వ్యతిరేక సిద్ధాంతమూ కాకుండా కేవలం ప్రజాకర్షక మంత్రంతో విజయ్ ఈ ఎన్నికల్లో విజయం సాధించడం తమిళనాట మారిన వైఖరికి నిదర్శనం! విజయ్ సునామీలో సాక్షాత్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ తోపాటు 14 మంది మంత్రులు కూడా ఇంటి బాట పట్టడం ఒక విశేషమైతే.. ఉమ్మడి ఏపీలో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పుడు రాజకీయాల్లోకి కొత్త తరం వచ్చినట్లే.. ఇప్పుడు తమిళనాట కూడా కొత్త శకం ప్రారంభం కావడం మరో విశేషం! ఆటో డ్రైవర్ల వంటి సామాన్యులకు విజయ్ టికెట్లు ఇచ్చినా.. వారంతా జెయింట్‌కిల్లర్లుగా మారడం ఈ ఎన్నికల్లో మరో అద్భుతం!! ఇక, కేరళంలో కూడా అధికారాన్ని పోగొట్టుకున్న వామపక్షాలు ఇప్పుడు ప్రాంతీయ పార్టీ స్థాయిలో కూడా మిగల్లేదు. బెంగాల్లో టీఎంసీ, తమిళనాట డీఎంకే పరాజయంతో ప్రతిపక్ష ఇండి కూటమికి గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లయింది!




గంగోత్రి నుంచి.. గంగాసాగర్ వరకు

ప్రతిచోటా కమలం వికసిస్తోంది

బెంగాల్ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి.. బీజేపీ సుపరిపాలన రాజకీయాలు గెలిచాయి

తమిళనాడు, కేరళలో గెలిచిన పార్టీలకు అభినందనలు.. ఎన్నికల ఫలితాలపై ప్రధాని నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, మే 4: దేశంలో గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు ప్రతిచోటా కమలం వికసిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాజకీయ పార్టీలు ప్రతీకారం కోసం కాకుండా మార్పు కోసం పనిచేయాలని సూచించారు. సోమవారం వెల్లడైన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో పశ్చిమబెంగాల్, అసోం, పుదుచ్చేరిలో బీజేపీ విజయం సాధించిన నేపథ్యంలో ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో కార్యకర్తలనుద్దేశించి మోదీ ప్రసంగించారు. ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. "ఈరోజు భారత ప్రజాస్వామ్యంపై, అభివృద్ధి కోసం పనిచేసే రాజకీయాలపై, ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ స్ఫూర్తిపై విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిన రోజు. గంగామాత ప్రవహిస్తున్న ప్రతిచోటా బీజేపీ-ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి" అని మోదీ అన్నారు. బెంగాల్‌లో భయం కాకుండా ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. "బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ సుపరిపాలన రాజకీయాలు ఘనవిజయం సాధించాయి. ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారు. వారిని శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. వారి కలల్ని, ఆకాంక్షలను నెరవేర్చడానికి సాధ్యమైనంత మేర కృషి చేస్తాం" అని మోదీ అన్నారు. ఇకపై ప్రజలు ప్రతీకారం కాకుండా మార్పు గురించి, భవిష్యత్తు గురించి మాట్లాడుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, అయితే ప్రజాస్వామ్యానికి భారత్ తల్లిలాంటిదనే విషయాన్ని ఐదు రాష్ట్రాల ప్రజలు ప్రపంచానికి చాటిచెప్పారని వ్యాఖ్యానించారు. ఈరోజు గెలిచింది భారత ప్రజాస్వామ్యం మాత్రమే కాదని, భారత రాజ్యాంగం, రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్య విధానం గెలిచాయని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మహిళలు పాల్గొన్న తీరు అత్యున్నతమైనది, చరిత్రాత్మకమైనదని అన్నారు. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించారంటూ ఎన్నికల కమిషన్‌ను, సిబ్బందిని ప్రధాని అభినందించారు. ప్రజాస్వామ్యం గౌరవాన్ని నిలబెట్టడంలో వారి పాత్రను చరిత్ర ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుందని ప్రశంసించారు. ఇక 2026 బెంగాల్ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని 'ఎక్స్'లో మోదీ పేర్కొన్నారు. ఇది బీజేపీ కార్యకర్తల విజయమని, వారి కృషి, కష్టం లేకపోతే ఈ విజయం సాధ్యమయ్యేది కాదని అన్నారు. తమ అభివృద్ధి ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళుతూ ఏళ్లుగా వారు పనిచేసిన తీరుకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. తమిళనాడు, కేరళలో విజయం సాధించిన పార్టీలకు మోదీ అభినందనలు తెలిపారు. రెండు రాష్ట్రాల ప్రజల అభివృద్ధి ఆకాంక్షలు నెరవేర్చేందుకు తమ మద్దతు ఉంటుందన్నారు. తమిళనాడులో ఎన్డీయేకు ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం తమ కూటమి ప్రయత్నాలు కొనసాగుతాయన్నారు.



బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను సత్కరిస్తున్న ప్రధాని మోదీ, అమిత్ షా

'అధికారా'నికి ఎదురుదెబ్బ!

- 3 రాష్ట్రాల్లో ఓడిన అధికార పార్టీలు
- ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు ప్రజలు మార్పు కోరుకుంటుండటమే కారణం

న్యూఢిల్లీ, మే 4: ప్రస్తుతం ఎన్నికల ఫలితాలు వెలువడిన ప్రధాన రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు మూడు చోట్లా అధికార పార్టీలకు ఎదురుదెబ్బ తగిలింది. సహజంగానే ఉండే ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్న అంశం స్పష్టంగా ప్రతిఫలించింది. కేరళ, బెంగాల్‌లలో గతంలో ప్రతిపక్షాలుగా నిలిచిన పార్టీలు ఈసారి బంపర్ మెజారిటీతో అధికారాన్ని అందుకుంటుంటే.. అధికార పార్టీలు ప్రతిపక్ష స్థానానికి వెళుతున్నాయి. ఇక తమిళనాడులో ఎప్పుడూ డీఎంకే, అన్నాడీఎంకే మధ్య దోబూచులాడే అధికారం.. ఈసారి టీవీకే పార్టీని వరించింది.

పశ్చిమబెంగాల్‌లో తారుమారు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ) ఘన విజయం సాధించింది. మొత్తం 294 స్థానాలకుగాను 215 సీట్లు గెలుచుకుని బంపర్ మెజారిటీ పొందింది. 48శాతం ఓట్లు సాధించింది. బీజేపీ 38.1 శాతం ఓట్లతో 77 స్థానాలను గెలుచుకుంది. వరుసగా మూడుసార్లు సీఎంగా ఉన్న మమతా బెనర్జీపై, తృణమూల్‌పై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత, బీజేపీ దూకుడుతో ఈసారి పరిస్థితి తారుమారైంది. బీజేపీ సుమారు 46శాతం ఓట్లతో 208 స్థానాల్లో విజయం సాధించగా.. టీఎంసీ 40.8 శాతం ఓట్లతో 79 స్థానాలకే పరిమితమైంది.

తమిళనాడులో దోబూచులాటకు బ్రేక్

తమిళనాడులో మొత్తం 234 స్థానాలకుగాను గత ఎన్నికల్లో డీఎంకే 37.7శాతం ఓట్లతో 133 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అన్నాడీఎంకే 33.3 శాతం ఓట్లతో 66 సీట్లు సాధించి ప్రతిపక్షంలో నిలిచింది. ప్రస్తుతం అత్యధిక స్థానాలు సాధించిన విజయ్ టీవీకే పార్టీ గత ఎన్నికల నాటికి ఇంకా ఉనికిలో లేదు. ప్రస్తుత ఎన్నికల్లో డీఎంకే 24.2 శాతం ఓట్లతో 60 స్థానాలకే పరిమితమైంది. అన్నాడీఎంకే 21.2 శాతం ఓట్లతో 47 సీట్లు సాధించింది. కొత్తగా వచ్చిన విజయ్ టీవీకే పార్టీ సుమారు 35 శాతం ఓట్లతో ఏకంగా 107 సీట్లు సాధించింది.

కేరళలోనూ అధికార పార్టీకి దెబ్బ..

కేరళలో గత ఎన్నికల్లో 41.5 శాతం ఓట్లతో 99 సీట్లు సాధించి ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ కూటమి 38.4% ఓట్లతో 41సీట్లు సాధించి ప్రతిపక్షంలో కూర్చుంది. ఈసారి పరిస్థితి తిరగబడింది. అధికార ఎల్డీఎఫ్ కూటమి సుమారు 30శాతం ఓట్లతో 35సీట్లకే పరిమితమైంది. యూడీఎఫ్ కూటమి సుమారు 44శాతం ఓట్లతో 102 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోంది.

ఇండి కూటమి

సంఘటితమవుతుందా?

- తాజా ఓటమితో తృణమూల్, డీఎంకే కాంగ్రెస్‌తోకలిసి పనిచేయాల్సిన స్థితి!
- కేరళలో వామపక్షాలకూ ఇదే మార్గం!

న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): బెంగాల్, అస్సాంలో బీజేపీ విజయం సాధించినప్పటికీ జాతీయస్థాయిలో 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఇండియా కూటమి సంఘటితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. బెంగాల్‌లో దెబ్బతిన్న తృణమూల్ కాంగ్రెస్, తమిళనాడులో ఓటమిపాలైన డీఎంకే జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో నేతృత్వంలోని ఇండియా కూటమితో కలిసి పనిచేయక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఒకరు తెలిపారు. సోమవారం ఎన్నికలఫలితాలు వెలువడిన వెంటనే లోక్‌సభలో కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్.. తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ, డీఎంకే అధినేత స్టాలిన్‌తో ఫోన్‌లో మాట్లాడడంతోపాటు విజయం సాధించినందుకు టీవీకే అధినేత విజయ్‌ను అభినందించడం గమనార్హం. ఇప్పటివరకు మమతా బెనర్జీ కాంగ్రెస్‌ను లెక్కచేసే వారు కాదని, ఇప్పుడు రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీగా మారిన తృణమూల్ తన ఉనికిని కాపాడుకునేందుకు జాతీయస్థాయిలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయవచ్చని భావిస్తున్నారు. స్టాలిన్ కూడా తమకు తగిన గౌరవం ఇవ్వలేదని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. తాజా ఓటమి తో డీఎంకే కూడా కాంగ్రెస్‌తో కలిసి పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని భావిస్తున్నాయి. మరోవైపు.. టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చే అవకాశాలు లేకపోలేదని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, కేరళలో వామపక్షాలు పరాజయం పొందడం వల్ల జాతీయస్థాయిలో కూడా వాటి ప్రభావం తగ్గిపోతుందని, అవి కూడా కాంగ్రెస్‌తో కలిసి పనిచేయక తప్పదంటున్నారు. ఇది 2029లో కమలనాథులను సంఘటితంగా ఎదుర్కొనేందుకు బలం చేకూరుస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

బీజేపీ ఎజెండా దిశగా!

- తాజా ఎన్నికల్లో ఐదింట మూడు కైవసం
- రాజ్యసభలోనూ మెజారిటీ దిశగా పయనం

టార్గెట్ చేయడం.. విజయం సాధించడం! టార్గెట్ చేయడం.. విజయం సాధించడం! కొన్నేళ్లుగా బీజేపీ వ్యూహమిది! ఇందులో భాగంగానే ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌నూ బీజేపీ తన ఖాతాలో వేసుకుంది. నిజానికి, గతంతో పోలిస్తే.. రెండేళ్ల కిందట జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు భారీగా తగ్గాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 303 సీట్లు సాధిస్తే.. 2024 ఎన్నికల్లో 240కే పరిమితమైంది. దాంతో, టీడీపీ, జేడీయూ మద్దతుతో మూడోసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. లోక్‌సభలో కాస్త ఎదురు దెబ్బ తగిలినా.. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కమలం అప్రతిహతంగా దూసుకుపోతూనే ఉంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత హరియాణా, మహారాష్ట్ర, బిహార్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేసింది. ఆప్‌ను మట్టి కరిపించి మరీ ఢిల్లీలో పాగా వేసింది. తాజాగా జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంతం ఎన్నికల్లో మూడింటిని తన ఖాతాలో వేసుకుంది. ఇక, వచ్చే ఏడాది మరో ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల్లో ఇప్పటికే బీజేపీ అధికారంలో ఉంది. వాటిని కాపాడుకుంటూనే పంజాబ్‌లోనూ పాగా వేయడమే బీజేపీ తదుపరి లక్ష్యం. అలాగే, దక్షిణాదిలో కర్ణాటక, తెలంగాణల్లోనూ పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి ఎత్తులు వేస్తోంది. పంజాబ్ తోపాటు కర్ణాటక, తెలంగాణల్లోనూ ఒకవేళ బీజేపీ విజయం సాధిస్తే.. దేశవ్యాప్తంగా ఐదింట నాలుగు వంతులు కాషాయమయమే! వెరసి, ప్రభుత్వ వ్యతిరేక ఓటును దాటుకుని కేంద్రంలో నాలుగోసారి అధికార పగ్గాలు చేపట్టడానికి బీజేపీ ఇప్పటి నుంచే కసరత్తు చేస్తోంది. అంతేనా, రాజ్యసభలోనూ పూర్తి మెజారిటీ సాధించి జమిలి ఎన్నికలు, నియోజక వర్గాల పునర్విభజన వంటి బిల్లులను ఆమోదింపజేసుకుని తన ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో తాజా విజయాల నేపథ్యంలో రాబోయే రోజుల్లో రాజ్యసభలోనూ బీజేపీ సొంతంగా మెజారిటీ మార్కును దక్కించుకుంటుందని విశ్లేషకులు విశ్లేషిస్తున్నారు.

టార్గెట్ తెలంగాణ?

ఇక పంజాబ్, తెలంగాణ, కర్ణాటకపై బీజేపీ దృష్టి

- 10న తెలంగాణలో మోదీ పర్యటన.. రూ.వేల కోట్ల ప్రాజెక్టులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు ప్రచారం

న్యూఢిల్లీ,మే 4 (ఆంధ్రజ్యోతి): ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఇక.. కర్ణాటక, పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలపై బీజేపీ దృష్టి సారించే అవకాశం ఉంది. వచ్చే రెండేళ్లలో 16 రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనుండగా, 2029లో బీజేపీ నిలదొక్కుకోవాలంటే ఈ రాష్ట్రాల్లో విజయం సాధించడం అత్యంత కీలకమన్న వాదన వినిపిస్తోంది. వచ్చే ఏడాది ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, గోవా, మణిపూర్‌లో అధికారం నిలబెట్టుకోవడంతోపాటు పంజాబ్, హిమాచల్‌లో అధికారం దక్కించుకుని తీరాలని బీజేపీ భావిస్తోంది. అలాగే, 2028లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, త్రిపురలో అధికారం నిలబెట్టుకోవడంతోపాటు కర్ణాటక, తెలంగాణ, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్‌లో గెలిచి తీరాలని బీజేపీ ఆకాంక్షిస్తోంది. వీటిలో పంజాబ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో గెలిచేందుకు ఎక్కువ కష్టపడాల్సి ఉంటుందన్న అంచనాలున్నాయి. పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలను తమ వైపునకు తిప్పుకోవడం, ఆ పార్టీని బలహీనపర్చడమే లక్ష్యంగా బీజేపీ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. మరోవైపు.. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలహీనపరిచేందుకు బీజేపీ ఎత్తుగడలు పెద్దగా ఫలించలేదన్న వాదన ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నెల 10న ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించనుండడం.. ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా మోదీ తెలంగాణలో రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రకటించనున్నట్లు తెలిసింది. కాగా, కీలక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో త్వరలోనే మంత్రివర్గ పునఃవ్యవస్థీకరణపైనా మోదీ దృష్టి సారిస్తారని ప్రచారం జరుగుతోంది.పలువురు మంత్రులకు ఉద్వాసన పలికి, కొత్తవారికి అవకాశం కల్పించాలన్న విషయమై మోదీ ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. అలా తొలగించే వారిని పార్టీ పదవుల్లో నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. విస్తరణలో ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, కర్ణాటక, పంజాబ్ నేతలకు ప్రాధాన్యం ఉంటుందని సమాచారం.



ముగిసిన 'కమ్యూనిస్టు'ల కథ!

- కేరళలో ఓటమితో ఎర్రజెండా పాలనకు ముగింపు
- దేశంలో ఆ పార్టీల నుంచి సీఎం లేకపోవడం 50 ఏళ్లలో తొలిసారి



దేశంలో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన కమ్యూనిస్టు పార్టీల వైభవం ఇక దాదాపు ముగిసినట్టే! గతంలో దశాబ్దాల పాటు అధికారం చెలాయించిన పశ్చిమబెంగాల్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో వామపక్షాల ప్రభ ఇప్పటికే మసకబారిపోగా.. చివరకు లెఫ్ట్ అధికారంలో ఉన్న మిగిలిన ఒకే ఒక్క రాష్ట్రం 'కేరళం' కూడా చేజారింది. సోమవారం విడుదలైన ఫలితాల్లో సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కూటమి ఓటమిని మూటగట్టుకుంది. దీంతో 1977 నుంచి అంటే దాదాపు గత ఐదు దశాబ్దాల కాలంలో చూస్తే... దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీల తరఫున ఏ రాష్ట్రానికైనా ముఖ్యమంత్రి లేకుండా పోవడం ఇదే తొలిసారి అవుతుంది. గతంలో వామపక్ష పార్టీలు బలంగా ఉండేవి. పశ్చిమబెంగాల్, త్రిపుర, కేరళంలో రికార్డు స్థాయిలో చాలా ఏళ్ల పాటు ఒకేసారి అధికారంలో కొనసాగుతూ వచ్చాయి. 2004 సార్వత్రిక ఎన్నికల్లో వామపక్ష పార్టీలు ఏకంగా 60కి పైగా లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించాయి. భారీ సంఖ్యలో ఎంపీలు ఉన్న లెఫ్ట్ ఫ్రంట్... భారత్-అమెరికా అణు ఒప్పందం నేపథ్యంలో మద్దతు ఉపసంహరించుకోవడంతో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం బలపరీక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది.

బెంగాల్‌లో సుదీర్ఘ పాలన

పశ్చిమబెంగాల్‌లో సీపీఎం 1977లో అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత తిరిగి చూడకుండా 2011 వరకు ఏకంగా 34 ఏళ్ల సుదీర్ఘ కాలం వామపక్షాలు ఏకచత్రాధిపత్యంతో పాలన చేశాయి. జ్యోతిబసు 23 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగగా.. ఆ తర్వాత 2000లో పాలనా పగ్గాలను బుద్ధదేవ్ భట్టాచార్యకు అప్పగించారు. అనంతరం 11 ఏళ్ల పాటు ఆయన నేతృత్వంలో పశ్చిమబెంగాల్‌ను సీపీఎం కూటమి పాలించింది. ఇక, 1993 నుంచి 2018 వరకు వామపక్షాలు త్రిపురను పాలించాయి. 1993 అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలు ఘన విజయం సాధించాయి. సీపీఎం ఒక్కటే 60 సీట్లకు గానూ 44 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. 1998 వరకు సీఎంగా దశరథ్ దేబ్ ఉండగా.. ఆ తర్వాత ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన మాణిక్ సర్కార్.. 20 ఏళ్ల పాటు పాలన చేశారు. అనంతరం 2018లో బీజేపీ అనూహ్య గెలుపుతో సుదీర్ఘ పాలనకు 'ఎండ్ కార్డు' పడింది. ఇక కేరళంలో వామపక్షాలు, కాంగ్రెస్ మధ్య దశాబ్దాలుగా అధికారం మారుతూ రాగా.. విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం ఆ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ 2016, 2021లో రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చింది. వామపక్ష చివరి 'కంచుకోట' కేరళం కూడా తాజాగా చేజారింది.



బీజేపీ విజయం అనైతికం

'పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన విజయం అనైతికం. వందకుపైగా సీట్లలో (ఓట్ల) దోపిడీకి పాల్పడి ఆ పార్టీ గెలిచింది. మా ఏజెంట్లను కౌంటింగ్ సెంటర్‌లోకి వెళ్లనీయలేదు. ఆ సమయంలో సీసీటీవీ కెమెరాలు ఆపివేశారు. కేంద్ర బలగాల సహకారంతో.. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలతో కుమ్మక్కై ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలు పూర్తిగా చట్టవ్యతిరేకం. ఈ అక్రమాలను నేను నిలదీసినప్పుడల్లా నన్ను అడ్డగోలుగా విమర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా కూడా చర్యలు శూన్యం. మేం మళ్లీ బంతిలా పైకి లేస్తాం'



- మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు



కాషాయ భారత్!



దేశంలోని 29 రాష్ట్రాల్లో.. 17 చోట్ల సొంత ప్రభుత్వాలు

న్యూఢిల్లీ, మే 4: భారత్ కాషాయమయం అవుతోంది. దేశంలోని రాష్ట్రాల్లో 70శాతానికిపైగా బీజేపీ, మిత్రపక్షాల పాలనలోకి వచ్చాయి. దేశంలోని మొత్తం 29 రాష్ట్రాలకు (ఢిల్లీ సహా)గాను 16 చోట్ల బీజేపీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాలే ఉన్నాయి. బెంగాల్ విజయంతో ఈ సంఖ్య 17కు చేరుతోంది. మరో నాలుగు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి పాలన కొనసాగుతోంది. ఇక మిగిలిన ఎనిమిది రాష్ట్రాలు మాత్రమే ప్రతిపక్షాల పాలనలో ఉన్నాయి.

బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాలు: అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, ఒడిశా, రాజస్థాన్, త్రిపుర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, బెంగాల్.

ఎన్డీయే కూటమి పాలనలోని రాష్ట్రాలు: ఆంధ్రప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కిం, పుదుచ్చేరి (రాష్ట్ర హోదా ఉన్న కేంద్ర ప్రభుత్వ పాలిత ప్రాంతం). ఏపీలో టీడీపీ, మేఘాలయలో ఎన్‌పీపీ, నాగాలాండ్‌లో ఎన్‌డీపీపీ, సిక్కింలో ఎస్‌కేఎం, పుదుచ్చేరిలో ఏఐఎన్నార్సీ ఆధ్వర్యంలోని ప్రభుత్వాల్లో బీజేపీ భాగస్వామిగా ఉంది.

ప్రతిపక్షాల చేతిలో ఉన్న రాష్ట్రాలు: తాజాగా టీవీకే అతి పెద్ద పార్టీగా నిలిచిన తమిళనాడు, కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్ కూటమి మెజారిటీ సాధించిన కేరళ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, ఆప్ పాలనలోని పంజాబ్, జేఎంఎం పాలనలోని జార్ఖండ్. జెడ్‌పీఎం పాలనలోని మిజోరం



బీజేపీ ప్రభంజనం



పశ్చిమ బెంగాల్‌లో కమలం హవా

కోల్‌కతా, మే 4: గతేడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేస్తూ.. 'గంగా నది బిహార్ మీదుగా బెంగాల్‌కు ప్రవహిస్తుంది' అని వ్యాఖ్యానించారు. బిహార్‌లో విజయం సాధించాం.. తదుపరి లక్ష్యం బెంగాల్ అని మోదీ ఈ విధంగా పరోక్షంగా చెప్పారు. పశ్చిమ బెంగాల్‌ను హస్తగతం చేసుకోవటం బీజేపీ చిరకాల స్వప్నం. ఇప్పుడిది సాకారమైంది. 294 సీట్ల అసెంబ్లీలో కనీస మెజారిటీకి 148 సీట్లు అవసరం కాగా, బీజేపీ 206 సీట్లు గెల్చుకుని కాషాయ పతాకాన్ని రెపరెపలాడించింది. వరుసగా మూడు పర్యాయాలు, నిరవధికంగా 15 ఏళ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన సీఎం మమతా బెనర్జీ సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్ 81 స్థానాలకు పరిమితమైపోయింది. కాంగ్రెస్‌కు, వామపక్షాలకు, ఇతరులకు రెండు చొప్పున స్థానాలు లభించాయి. భవానీపూర్ నియోజకవర్గంలో మమతపై

206 సీట్లతో ఘన విజయం.. మమత నిరవధిక పాలనకు తెర


బీజేపీ కీలక నేత సువేందు అధికారి 15 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ విధంగా మమత అధికారాన్ని కోల్పోవటమేగాక అవమానాన్నీ ఎదుర్కొన్నారు. ఇది హిందుత్వకు లభించిన విజయమని, మమతకు ముస్లింలు ఓటు వేస్తే.. తనకు హిందువులు, సిక్కులు, జైన్లు, బౌద్ధులు ఓటు వేశారని సువేందు పేర్కొన్నారు. ఈ ఓటమితో రాజకీయ జీవితం నుంచి మమత రిటైర్‌మెంట్ తీసుకుంటారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ సువేందు అధికారి నందిగ్రామ్‌లో మమతనుఓడించారు.

నాపై బీజేపీ కార్యకర్తలు దాడి చేశారు: మమత

భవానీపూర్ నియోజకవర్గంలోని ఓట్ల లెక్కింపు కేంద్రం నుంచి తృణమూల్ పార్టీ ఏజెంటును బయటకు పంపించారన్న వార్తలతో మమత అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో సువేందు అధికారి కూడా అక్కడే ఉన్నారు. ఫలితం వెల్లడైన తర్వాత మమత బయటకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. 'కౌంటింగ్ సెంటర్లలోకి మా పార్టీ ఏజెంట్లను అనుమతించలేదు. సీసీటీవీ కెమెరాలు నిలిపివేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి మా కార్యకర్తల మీద దాడులు కొనసాగించారు. నన్ను కూడా కొట్టారు. బీజేపీది అనైతిక విజయం' అని మమత మండిపడ్డారు. కాగా, మమత మీద బీజేపీ కార్యకర్తలు దాడి చేశారని తృణమూల్ ఎంపీ సాగరిక ఘోష్ కూడా పేర్కొన్నారు.


పశ్చిమ బెంగాల్ (293)

పార్టీ	సీట్లు		ఓట్ల శాతం	
	2026	2021	2026	2021
బీజేపీ	206	77	45.84	38.15
టీఎంసీ+	81	215	40.80	48.02
కాంగ్రెస్	2	2	2.97	-
లెఫ్ట్	1	0	4.61	
ఇతరులు	3	0	5.78	13.83



రాష్ట్రమంతటా బీజేపీ హవా

ఉత్తర బెంగాల్ నుంచి జంగల్ మహల్ వరకూ, సరిహద్దు జిల్లాల నుంచి పారిశ్రామిక ప్రాంతాల వరకూ అన్ని చోట్లా బీజేపీ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. తృణమూల్ మాత్రం కోల్‌కతాలోని కొన్ని నియోజకవర్గాలు, సింగూర్, రైనా, జమాల్‌పూర్ తదితర గ్రామీణ ప్రాంతాల్లో ఆధిక్యాన్ని చూపింది. బీజేపీ ప్రభంజనంలో పలువురు తృణమూల్ సీనియర్ నేతలు, 20 మంది మంత్రులు ఓడిపోయారు. నందిగ్రాం నుంచి మరోసారి బరిలోకి దిగిన సువేందు అక్కడ కూడా విజయం సాధించారు. తృణమూల్ నుంచి బహిష్కరణకు గురై, 'ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ' పేరుతో సొంతపార్టీ స్థాపించిన హుమాయున్ కబీర్.. పోటీ చేసిన రెండు స్థానాల (నవడా, రెజినగర్) నుంచి గెలిచారు. మొత్తంగా బీజేపీ 45 శాతం ఓట్లను సాధించింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన 38 శాతంతో పోల్చితే ఇది ఏడు శాతం అధికం. నాటి ఎన్నికల్లో 48 శాతం ఓట్లు తెచ్చుకున్న తృణమూల్ ఈసారి 40.94 శాతానికి పరిమితమైంది.



విజయంతో కూతురుకు నివాళి
ఆర్‌జీ కర్ మృతురాలి తల్లి గెలుపు





ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో అత్యాచారానికి, హత్యకు గురైన పీజీ మెడికల్ విద్యార్థిని తల్లి రత్నా దేబ్‌నాథ్ (బీజేపీ).. తన సమీప ప్రత్యర్థి అయిన తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి మీద దాదాపు 29 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2024లో జరిగిన ఆర్‌జీ కర్ ఘటన యావత్ బెంగాల్‌ను కదిలించింది. కొన్ని నెలలపాటు నిరసనలు కొనసాగాయి. మమత పాలనలో క్షీణించిన శాంతిభద్రతలకు ఇదొక దృష్టాంతమన్న విమర్శలు పెరిగిపోయాయి. తృణమూల్ ఓటమిలో ఈ ఘటన కూడా ఓ కారణంగా నిలిచింది.

అవినీతి అంతం.. అభివృద్ధి మంత్రం

పక్కా వ్యూహంతో బీజేపీ పాగా

బెంగాల్‌లో అధికారం కోసం బీజేపీ సుదీర్ఘమైన పక్కా వ్యూహంతో ముందుకు సాగింది. బంగ్లాదేశ్ వలసదారుల సమస్యను లేవనెత్తుతూనే రాష్ట్రం వెనుకబడటానికి 50 ఏళ్లుగా అధికారంలో ఉన్నవాళ్లే కారణమని ప్రజలు నమ్మేలా ప్రచారం చేసింది. ఒక్కో అడుగు ముందుకేస్తూ క్షేత్రస్థాయిలో మహిళలు, యువత, కొత్త ఓటర్లు, కార్మికులను తనవైపునకు తిప్పుకుంది. కార్మికులు, డార్జిలింగ్ వంటి కొండప్రాంతాల్లోని తేయాకు కార్మికుల్లో మంచి ఆదరణ సంపాదించింది. ఇందుకోసం బీజేపీ అగ్రనాయకుల నుంచి సాధారణ కార్యకర్త వరకు నిబద్ధతతో కష్టపడి పనిచేశారు. మమత పాలనలో మితిమీరిన అవినీతి, హింస కూడా ప్రజలు బీజేపీవైపు మొగ్గటానికి కారణమైంది. అర్బన్ పార్టీ అని పేరున్న బీజేపీ.. బెంగాల్ గ్రామీణ ప్రాంతాల్లో కూడా బలంగా పాతుకుపోయింది. డబుల్ ఇంజిన్ సర్కారుతో పరిశ్రమలు తెస్తామని కాషాయ పార్టీ చేసిన ప్రచారాన్ని ప్రజలు నమ్మారు. పార్టీ నిర్మాణ పరంగానూబీజేపీ పక్కా వ్యూహంతో ముందుకెళ్లింది. టీఎంసీలో ఏక వ్యక్తి విధానం పాతుకుపోగా, బీజేపీ బూత్ స్థాయి నుంచి బలపడుతూ వచ్చింది. బీజేపీ నేతలు ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి ఓట్లడిగే వ్యూహాన్ని పక్కాగా అమలు చేశారు. దీంతో బెంగాలీలు ఆ పార్టీకి బంపర్ మెజారిటీ కట్టబెట్టారు.

యూపీ మోడలా? అస్సాం మోడలా?

బెంగాల్‌లో బీజేపీ పాలనపై చర్చ

బెంగాల్‌లో బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించింది. అయితే, మతపరంగా సున్నితమైన ఈ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ విధానం ఎలా ఉండబోతోందన్న ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం బెంగాల్‌లో ముస్లిం జనాభా దాదాపు 25 శాతం ఉంది. అంటే 2.41 కోట్లకుపైగా ఉన్నారు. ప్రస్తుతం వారి జనాభా మరింత పెరిగింది. రాష్ట్రంలో మత హింసపై బీజేపీ ఎంతోకాలంగా ప్రభుత్వంపై పోరాటం చేస్తూ వస్తోంది. తాము అధికారంలోకి వస్తే శాంతిభద్రతలు కాపాడుతామని ప్రచారం చేసింది. ఉత్తరప్రదేశ్‌లో కూడా ఒకప్పుడు ఇలాంటి పరిస్థితే ఉండేది. అక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంఘవిద్రోహ శక్తులను, అల్లర్లు సృష్టించేవారిని కఠినంగా అణచివేసింది. యువతకు ఉపాధి అవకాశాలు పెంచింది. దీంతో ప్రస్తుతం యూపీలో ప్రశాంత వాతావరణం నెలకొంది. అస్సాంలో బీజేపీ మరోసారి ఘనవిజయం సాధించి అధికారంలో కొనసాగబోతోంది. ఇక్కడ బీజేపీ సీఎం హేమంత బిశ్వశర్మ ముస్లిం వ్యతిరేక వైఖరిని ప్రదర్శిస్తున్నారు. ముస్లింలు 35 శాతం ఉన్నప్పటికీ వారి ఓట్లు తనకు అవసరం లేదని ప్రకటించారు. ఇప్పుడు బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వ విధానం యూపీ మోడల్‌లో ఉంటుందా? అస్సాం మోడల్‌లో ఉంటుందా? అనేది ఆసక్తికరంగా మారింది. బెంగాల్‌లోని బంగ్లా అక్రమ వలసదారులను వెనక్కి పంపుదామంటే సీఎం మమతా బెనర్జీ సహకరించటం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అనేకసార్లు విమర్శించారు. ఇప్పుడు కేంద్రంలో రాష్ట్రంలో వారి ప్రభుత్వమే ఉంటుంది కాబట్టి వారిని వెనక్కి పంపే అవకాశాలున్నాయనే వాదన వినిపిస్తోంది. అదే జరిగితే రాష్ట్రంలో తాత్కాలికంగానైనా అలజడి రేగటం ఖాయమని భావిస్తున్నారు.

జీరో నుంచి హీరో వరకు..

ఫలించిన నాలుగున్న దశాబ్దాల పోరాటం

బెంగాల్‌లో పాగా వేసేందుకు బీజేపీ నాలుగున్నర దశాబ్దాలపాటు పోరాటం చేసి ఎట్టకేలకు లక్ష్యం సాధించింది. 1982 నుంచి బెంగాల్‌లో బీజేపీ పోటీచేస్తూ వస్తోంది. అయినాబెంగాలీలు బీజేపీని కనీసం పట్టించుకోలేదు. అయినా, ఎక్కడా నిరాశ చెందకుండా ఆ పార్టీ సుదీర్ఘ పోరాటం, పక్కా వ్యూహాల తో గెలుపు తలుపు తట్టింది. నిజానికి బీజేపీకి పూర్వరూపమైన భారతీయ జనసంఘ్ (బీజేఎస్) వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ బెంగాల్‌కు చెందిన వారే. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ కోల్‌కతాలోనే చదువుకున్నారు. అయినా మొదట్లో ఆ పార్టీకి బెంగాల్లో పెద్దగా ఆదరణ లభించలేదు. 1982లో మొదటిసారి ఆ పార్టీ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసింది. అయినా ఒక్క సీటు కూడా గెలవలేదు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో 9 సీట్లలో పోటీ చేసి 0.4 శాతం ఓట్లు సాధించింది. 1987 అసెంబ్లీ ఎన్నికలు, 1989 లోక్‌సభ ఎన్నికలు, 1991, 1996 ఎన్నికల్లోనూ అదే చేదు అనుభవం ఎదురైంది. 1998 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో తొలిసారి ఖాతా తెరిచింది. డమ్‌డమ్ స్థానం నుంచి ఆ పార్టీ తపన్ సిక్దర్ గెలుపొందారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో టీఎంసీతో జట్టుకట్టి 2 ఎంపీ సీట్లు గెలిచింది. 2001లోనూ గెలుపు సొంతం చేసుకోలేదు. 2004 సాధారణ ఎన్నికల్లో ఎన్‌డీయే కూటమిని ఏర్పాటు చేసి టీఎంసీతో కలిసి పోటీచేసినా ఫలితం మారలేదు. టీఎంసీ కూడా ఒక్క ఎంపీ సీటుకే పరిమితమైంది. 2009 లోక్‌సభ ఎన్నికల్లో గూర్ఖా జనముక్తి మోర్చా మద్దతుతో డార్జిలింగ్ లో గెలుపొందింది. 2014లో జీజేఎంతో కలిసి పోటీచేసి 2 ఎంపీ సీట్లు గెలిచింది. 2016లో 3 ఎమ్మెల్యే సీట్లు గెలిచి తొలిసారి రాష్ట్ర అసెంబ్లీలో అడుగు పెట్టింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా 18 ఎంపీ సీట్లు గెలిచి సత్తా చాటింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 77 సీట్లు గెలిచి ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది.

సీఎం పీఠం ఎవరికి?

రేసులో ముందు వరుసలో సువేందు అధికారి
జాబితాలో దిలీప్ ఘోష్, షామిక్ భట్టాచార్య పేర్లు



పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ అధినేత్రి మమత కోటను బద్దలు కొట్టి బీజేపీ అధికారాన్ని చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో బెంగాల్ తదుపరి ముఖ్యమంత్రి పీఠం ఎవరిని వరించనుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. గత ఎన్నికలకు భిన్నంగా బీజేపీ అధిష్ఠానం ఇక్కడ సీఎం అభ్యర్థిని ముందుగా ప్రకటించలేదు. దీంతో పాలనా పగ్గాలు చేపట్టే సామర్థ్యం ఉన్న పలువురు కీలక నాయకుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. అయితే రాష్ట్రంలో బీజేపీ కీలక నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి ఈ జాబితాలో ముందు వరుసలో ఉన్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. సువేందు ఒకప్పుడు తృణమూల్ కాంగ్రెస్‌లో మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా మెలిగారు. టీఎంసీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు పార్టీలో రెండో శక్తిమంతమైన నేతగా ఎదిగారు. టీఎంసీలో అంతర్గత విభేదాల కారణంగా 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన బీజేపీలో చేరడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి కూడా పోటీకి దిగిన దీదీని ఓడించడం ద్వారా సువేందు ప్రకంపనలు రేపారు. ఆ తర్వాత ఆయన అసెంబ్లీలో విపక్ష నేతగా ఎన్నికయ్యారు. సీఎం పదవికి ఆయనే సమర్థుడని భావించడానికి ఇదే ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఇక బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడైన దిలీప్ ఘోష్ కూడా సీఎం పదవికి రేసులో నిలిచారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన ఆయన హయాంలోనే వామపక్షాల స్థానాన్ని ఆక్రమించి బీజేపీ ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగింది. అలాగే బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు షామిక్ భట్టాచార్యతో పాటు దక్షిణ అసన్‌సోల్ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అగ్నిమిత్ర పాల్, సిలిగురి ఎమ్మెల్యే శంకర్ ఘోష్ పేర్లను కూడా బీజేపీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉంది.

ఎస్ఐఆర్ ప్రభావం ఎంత?

SIR

ఎన్నికల ముంగిట ఓటర్ల జాబితా సవరణ

తమ మద్దతువర్గమైన ముస్లింల ఓట్ల తొలగింపునకే చేపట్టారని తృణమూల్ ఆరోపణ ..

బంగ్లాదేశ్ చొరబాటుదారులే లక్ష్యమన్న బీజేపీ.. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా సుప్రీంలో మమత వాదనలు

ఓటు హక్కు కోల్పోయిన లక్షలాదిమంది .. తృణమూల్ ఓటమి ప్రధాన కారణాల్లో ఇదొకటి!

పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 7.6 కోట్లు కాగా.. దాంట్లో 90 లక్షల మంది పేర్లను ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. మొత్తం ఓటర్లలో వీరు ఏకంగా 12 శాతం ఉండటం గమనార్హం. ఈ 90 లక్షల ఓటర్లలో చనిపోయిన వాళ్లు, ఆచూకీ లేని వాళ్ల పేర్లు 60 లక్షలకు పైగా ఉన్నాయి. మిగిలిన 27 లక్షల మంది ఓటర్ల వివరాలు సందేహాస్పదంగా ఉన్నాయని ఈసీ వారిని పక్కనపెట్టింది. సంబంధిత ట్రైబ్యునళ్లలో అప్పీల్ చేసుకొని, ఓటు హక్కును తిరిగి పొందే అవకాశం కల్పించారు. కానీ, దీని ద్వారా ఎంతమంది తిరిగి ఓటు హక్కును సాధించుకున్నారన్న దానిపై స్పష్టత లేదు. ఓటర్ల జాబితా నుంచి అక్రమ



బంగ్లాదేశీ వలసదారులను తొలగించటమే లక్ష్యంగా ఎస్ఐఆర్‌ను చేపట్టినట్లుగా ప్రధాని మోదీ దగ్గరి నుంచి పలువురు బీజేపీ నేతలు పేర్కొన్నారు. అయితే, బయటకు అలా చెప్పినప్పటికీ.. తమ పార్టీకి బలమైన మద్దతుదారులైన ముస్లిం ఓటర్లను తొలగించటమే లక్ష్యంగా ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నారంటూ తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈ వివాదం పెరిగిపోయి సుప్రీం కోర్టును చేరింది. అయితే, ఎస్ఐఆర్‌ను అడ్డుకోవటానికి నిరాకరించిన సుప్రీంకోర్టు.. ఓట్లు కోల్పోయిన వారికి ఓటు హక్కు పునరుద్ధరణ దిశగా చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘానికి కొన్ని సూచనలు చేసింది. అయినప్పటికీ, పోలింగ్ నాటికి లక్షలాది మంది ఓట్లు గల్లంతయ్యాయన్న వార్తలు వెలువడ్డాయి. ఈసీ అభ్యంతరాలతో ఓటు హక్కు గందరగోళంలో పడిన 27 లక్షల మందిలో 65 శాతం మంది ముస్లింలే. ఇక మొత్తంగా ఈసీ తొలగించిన 90 లక్షల ఓటర్లలో ముస్లింలు 31 లక్షల మంది (34%). ఎస్ఐఆర్ ప్రక్రియ జరిపిన మధ్యప్రదేశ్ కూడా వివరాలు సందేహాస్పందంగా ఉన్నాయంటూ భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లను ఈసీ ప్రకటించింది. అయితే, ఇక్కడ ఎన్నికలకు రెండేళ్ల వ్యవధిలో ఉన్నందున.. సదరు వ్యక్తులకు తమ వివరాలను ఈసీకి సమర్పించి, ఓటు హక్కును పునరుద్ధరించుకునే అవకాశం ఉంది. కానీ, బెంగాల్‌లో ఎన్నికల ముంగిట ఎస్ఐఆర్ అమలు వల్ల చాలా మందికి ఆ అవకాశం లభించకుండా పోయింది. తృణమూల్ మద్దతుదార్లయిన ముస్లింల ఓట్లను తీసేయడం ఆ పార్టీ ఓటమికి గల కారణాల్లో ఒకటనే వాదన వినిపిస్తోంది.

ఎస్ఐఆర్‌కు ముందు మొత్తం ఓటర్లు	7.6 కోట్లు
ఎస్ఐఆర్‌తో తొలగించిన పేర్లు	90లక్షలు (వీరిలో ముస్లింలు 34%)
తొలగింపునకు గురైన 90 లక్షల మందిలో మృతులు, ఆచూకీ లేనివారు	63 లక్షలు
వివరాలు సందేహాస్పదంగా ఉన్నవారు	27లక్షలు (వీరిలో ముస్లింలు 65%)



మజ్లి‌స్‌కు షాకిచ్చిన బెంగాల్ ఓటర్లు



హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల బరిలో తొలిసారి అడుగుపెట్టిన ఎంఐఎంకు నిరాశే మిగిలింది. పోటీ చేసిన 12 స్థానాల్లోనూ ఆ పార్టీ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. 293 అసెంబ్లీ స్థానాలున్న బెంగాల్‌లో అమ్ జనతా ఉన్నాయున్ పార్టీ (హుమాయున్ కబీర్)తో కలిసి ఎంఐఎం బరిలోకి దిగింది. అయితే, బీజేపీ కోసమే బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో బాబ్రీ మసీదు నిర్మాణం చేపట్టి, ముస్లిం ఓట్లను చీల్చడానికి బీహార్ ఫార్ములాను అమలు చేయనున్నట్లు హుమాయున్ కబీర్.. స్టింగ్ ఆపరేషన్‌లో ప్రకటించి, దొరికిపోవడంతో ఆ పార్టీతో ఎంఐఎం తెగతెంపులు చేసుకుంది. అయినా ఎంఐఎంను హుమాయున్ కబీర్ భాగస్వామిగానే బెంగాల్ ఓటర్లు గుర్తించి... షాక్ ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.





మమత ఓటుబ్యాంకు బద్దలు

మహిళల ఓట్లను లాగేసిన బీజేపీ!



సందేశ్‌ఖాలి, ఆర్‌జీ కర్ ఘటనలతో టీఎంసీ సర్కారుపై అతివల ఆగ్రహం

బాధితులకు టికెట్లు ఇవ్వడం ద్వారా దానిని సొమ్ము చేసుకున్న బీజేపీ

బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం.. చొరబాట్లు ప్రధాన ప్రచారాస్త్రం!

పశ్చిమ బెంగాల్లో వరుసగా మూడుసార్లు విజయం సాధించిన మమతా బెనర్జీ.. ఈదఫా అనూహ్య పరాజయం చవిచూశారు. ఒకప్పటి మిత్రపక్షమైన బీజేపీ చేతిలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఘోరంగా దెబ్బతింది. సీఎంగా ఉన్న ఈ 15 ఏళ్లలో మమత ప్రత్యేకంగా మహిళా ఓటుబ్యాంకు సృష్టించుకున్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ పథకాలతో మనసు చూరగొన్నారు. ముఖ్యంగా లక్ష్మీర్ భాండార్ స్కీం కింద పేద మహిళల ఖాతాల్లో నెల నెలా రూ.1,500 జమచేసే పథకం, బాలికలకు 'కన్యాశ్రీ' కింద విద్యాసాయం, యువతుల పెళ్లిళ్లకు 'రూపశ్రీ'.. ఇలా అనేక స్కీంలు అమలు చేశారు. కానీ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, గ్యాంగ్‌రేప్‌లు, హత్యలు పెరిగాయి. సందేశ్‌ఖాలిలో మహిళలపై లైంగిక దోపిడీ, ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం, కస్బా లా కాలేజీలో అత్యాచారం, పార్క్ స్ట్రీట్, కామ్‌దునీ గ్యాంగ్‌రేప్‌లు, హస్‌ఖాళీ హత్యాచారం, దుర్గాపూర్ మెడికల్ కాలేజీలో అత్యాచారం.. ఇలా ఎన్నో ఘోరాలు జరిగాయి. చాలా కేసుల్లో టీఎంసీ నేతల ప్రమేయం ఉంది. బీజేపీ ఈ అంశాన్నే ప్రచారాస్త్రంగా మలచుకుని మమత ఓటుబ్యాంకును దెబ్బతీసింది. మమత ఓటమికి రాజకీయ విశ్లేషకులు ఐదు ప్రధాన కారణాలు చెబుతున్నారు.

బూత్ నిర్వహణ భేష్..

బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తేనే విజయాలు సాధ్యమని విశ్వసించే పార్టీల్లో బీజేపీ మొదటిది. బెంగాల్లోనూ దీనిని పకడ్బందీగా అమలు చేసింది. పన్నా ప్రముఖ్, శక్తి కేంద్రాలను ఏర్పాటుచేసి ఓటర్లకు చేరువైంది. అవసరమైన చోట అదనపు కార్యకర్తలను నియమించడం, సభ్యత్వ నమోదు డ్రైవ్‌ల ద్వారా సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసింది. అమిత్‌షా తరచూ స్థానిక నేతలతో భేటీలు ఏర్పాటు చేసి ఢిల్లీ నాయకత్వం అండగా ఉంటుందన్న భరోసా ఇవ్వగలిగారు.

ప్రభుత్వ వ్యతిరేకత.. శాంతిభద్రతలు..

ఈ రెండు అంశాలపై విస్తృత ప్రచారం చేసి బీజేపీ బాగానే లబ్ధి పొందింది. అన్నిటినీ మించి టీఎంసీ నేతల అవినీతి, పలు కుంభకోణాల్లో చిక్కుకోవడం.. ఈడీ సోదాల్లో వందల కోట్లు బయటపడడం వంటివి టీఎంసీపై ప్రజల్లో వ్యతిరేకత పెంచాయి. హింసాత్మక ఘర్షణల్లో టీఎంసీ నేతల ప్రమేయం, వారిని కాపాడేందుకు మమత ప్రభుత్వం ప్రయత్నించడంతో జనం బీజేపీలో ప్రత్యామ్నాయం చూసుకున్నారని టీఎంసీ ముఖ్య నేతలు సైతం అంటున్నారు.

'పరాయి' ముద్రకు రాంరాం

బీజేపీ విస్తరణను అడ్డుకోవడానికి మమత మొదటి నుంచీ దానిపై 'పరాయి' ముద్ర వేశారు. ఢిల్లీ పార్టీ అని ప్రచారం చేశారు. దీనిని ఎదుర్కోవడానికి బీజేపీ బాగా కసరత్తుచేసింది. బెంగాలీ సంస్కృతి, గుర్తింపులో తానూ భాగమని చెప్పుకోవడానికి ప్రయత్నించింది. 'భూమిపుత్రుడు' నినాదాన్ని అమిత్‌షా తెరపైకి తెచ్చారు. బీజేపీ గెలిస్తే బెంగాల్ గడ్డపై పుట్టిన నేతే తదుపరి సీఎం అవుతారని ప్రకటించారు. మోదీ, ఇతర జాతీయ నేతలు ప్రతి సభ చివరిలో 'జై మా దుర్గా, జై మా కాళీ' అని నినదించారు. స్థానిక అంశాలకు ప్రాచుర్యం కల్పించడం.. రాష్ట్ర నేతలకు ప్రాధాన్యం, బెంగాలీ పండుగల్లో పాల్గొనడం వంటివి బీజేపీ విజయానికి దోహదపడ్డాయని అంటున్నారు.

- సెంట్రల్ డెస్క్

చొరబాటుదారులే ఓటుబ్యాంకు..

బంగ్లాదేశ్ చొరబాటుదారులకు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డులిచ్చి టీఎంసీ ఓటుబ్యాంకుగా మలచుకుందన్న ఆరోపణలు ఉన్నాయి. బీజేపీ దీన్ని ప్రచారాస్త్రంగా చేసుకుంది. చొరబాటుదార్లతో స్థానిక బెంగాలీల ఉనికే ప్రశ్నార్థకమవుతోందని.. వనరులన్నిటినీ మమత వారికే దోచిపెడుతోందని ప్రచారం చేసింది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్)లో పలువురు చొరబాటుదారుల ఓట్లు పోయాయి. బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే.. సరిహద్దుల్లో మరింత నిఘా పెంచుతామని.. అక్రమ శరణార్థులను బంగ్లాదేశ్ తరిమేస్తామని అమిత్‌షా పదే పదే ప్రకటిస్తూ వచ్చారు.

బాధిత మహిళలను ముందుపెట్టి ప్రచారం..

మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు మోదీ-షా ప్రత్యేక కసరత్తు చేశారు. సందేశ్‌ఖాలి, ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచార ఘటనల వంటివి.. రాష్ట్రంలో శాంతిభద్రతల ఘోరవైఫల్యానికి నిదర్శనంగా నిలిచాయి. పైగా టీఎంసీ నేతల పాత్ర ఉండడం.. వారిని మమత ప్రభుత్వం కాపాడేందుకు ప్రయత్నించడంతో మహిళల్లో ఆగ్రహావేశాలు నెలకొన్నాయి. దీనిని పసిగట్టిన బీజేపీ.. బాధిత మహిళలను ఎన్నికల బరిలో దించింది. సందేశ్‌ఖాలి బాధితురాలు రేఖా పాత్రాను హింగల్‌గంజ్‌లో, ఆర్‌జీ కర్ ఆస్పతిలో హత్యాచారానికి గురైన విద్యార్థిని తల్లి రత్నా దేబ్‌నాథ్‌ను పనిహాటీలో అభ్యర్థులుగా నిలిపింది. మహిళల గౌరవాన్ని కాపాడతామని.. వారికి సంపూర్ణ రక్షణ కల్పించడమే తమ తొలి ప్రాధాన్యమని ప్రధాని మోదీ ప్రతి సభలోనూ నొక్కిచెప్పారు. అలాగే నెలనెలా మహిళల ఖాతాల్లో రూ.3 వేలు జమచేస్తామన్న వాగ్దానం కూడా సత్ఫలితాలిచ్చింది.



ముందుముందు అగ్నిపరీక్షే!

కోల్‌కతా, మే 4: బెంగాల్‌లో మూడున్నర దశాబ్దాల కమ్యూనిస్టు పాలనను అంతం చేసి అధికారంలోకి వచ్చి, 15 ఏళ్లపాటు తిరుగు లేకుండా పాలించిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీకి బీజేపీ చెక్ పెట్టింది. టీఎంసీకి కర్త, కర్మ, క్రియ అన్నీ అయిన మమతకు ప్రస్తుతం 71 ఏళ్లు. వచ్చే ఐదేళ్లు టీఎంసీ ప్రతిపక్షంలోనే ఉంటుంది. ఈ ఐదేళ్లలో బీజేపీని తట్టుకొని పార్టీని నిలబెట్టుకోవటం ఆమెకు కత్తిమీద సామేనని విశ్లేషకులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో టీఎంసీ నిర్మాణం దెబ్బతినడం, ఆ పార్టీకి పట్టున్న వర్గాలను బీజేపీ ఆకర్షించడం దీనికి కారణం. పైగా మమత రాజకీయ వారసుడిగా చెబుతున్న అభిజిత్ బెనర్జీని వ్యూహాలు ఫలితమివ్వలేదు. ఇప్పుడు గెలిచిన టీఎంసీ ఎమ్మెల్యేల్లో ఎందరు ఉంటారో చెప్పలేమన్నది రాజకీయ విశ్లేషకుల మాట.



రికార్డు స్థాయి పోలింగ్.. టీఎంసీ కొంప ముంచిందా?

కోల్‌కతా, మే 4: బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా పోలింగ్ నమోదు కావటం టీఎంసీ గెలుపు అవకాశాలను దెబ్బతీసిందా అనే చర్చ జరుగుతోంది. దేశ చరిత్రలోనే అత్యధికంగా 92.47 శాతం పోలింగ్ ఇక్కడ నమోదైంది. కొన్ని నియోజకవర్గాల్లో 97% నమోదైంది. ఎన్నికలకు ముందు దాదాపు 91 లక్షల ఓట్లను సర్ ప్రక్రియలో భాగంగా తొలగించారు. అవన్నీ చనిపోయినవారు, రాష్ట్రం విడిచి వెళ్లినవారి ఓట్లేనని, కొన్ని దొంగ ఓట్లు కూడా ఉన్నాయని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ తొలగింపు కూడా రికార్డు స్థాయిలో పోలింగ్‌కు కారణమని చెబుతున్నారు. బెంగాల్‌లో ఎన్నికల సమయంలో హింస చెలరేగటం సాధారణం. ఈసారి ఈసీ భారీగా కేంద్ర బలగాలను మోహరించడంతో మహిళలు, యువత ధైర్యంగా ఓటేయడానికి వచ్చారని అంటున్నారు.

దీదీకి తగ్గిన ముస్లింల మద్దతు!

ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో బీజేపీకి పెరిగిన సీట్లు



కోల్‌కతా, మే 4: పశ్చిమ బెంగాల్‌లో ముస్లింల జనాభా గణనీయంగా ఉన్న నియోజకవర్గాల సంఖ్య 54. వీటిలో 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ ఏకంగా 52 సీట్లు గెల్చుకుంది. ఒకటి మాత్రమే బీజేపీకి దక్కింది. ఈసారి పరిస్థితి మారింది. తృణమూల్‌కు పట్టున్న ఈ స్థానాల్లోకి బీజేపీ చొచ్చుకెళ్లింది. 12 స్థానాల్లో విజయం సాధించినట్లు ఫలితాలు వెల్లడించాయి. 2011 నాటి గణాంకాల ప్రకారం పశ్చిమ బెంగాల్ జనాభాలో ముస్లింలు 27 శాతం ఉన్నారు. ప్రస్తుతం ఇది 32 శాతానికి పెరిగి ఉంటుందని ఇటీవల మమతా బెనర్జీ పేర్కొన్నారు. ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర్ దినాజ్‌పూర్ జిల్లాల్లో ముస్లిం ప్రాబల్య నియోజకవర్గాలున్నాయి. మమత ఈ జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయటం ద్వారా తన గెలుపునకు దారులు వేసుకున్నారు. తొలిసారి తృణమూల్ అధికారంలోకి వచ్చిన 2011 అసెంబ్లీ ఎన్నికల్లో 21 ముస్లిం ప్రాబల్య నియోజకవర్గాలలో ఆ పార్టీ గెల్చింది. 2016లో ఈ సంఖ్య 28కి పెరిగింది. 2021లో ఏకంగా 52కి చేరుకుంది. కానీ ఈసారి ముస్లింల ఓట్లు గంపగుత్తగా తృణమూల్‌కు పడినట్లు కనిపించటం లేదు. ఇతర పార్టీలకు కూడా వారి ఓట్లు పోలైనట్లుగా తెలుస్తోంది. బీజేపీకి కూడా కొంత భాగం ముస్లిం ఓటుబ్యాంకు అండగా నిలిచిందని, అందువల్లే ముస్లిం ప్రాబల్య సీట్లలోనూ మెరుగైన ఫలితాలు సాధించామని ఆ పార్టీ నేత సువేందు అధికారి తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ ఇచ్చిన గ్యారెంటీలను కూడా ముస్లింలు విశ్వసించారని పేర్కొన్నారు. కాగా, ఎస్ఐఆర్ ప్రక్రియ కూడా ముస్లిం ఓటర్ల ప్రాబల్యాన్ని కొంతమేర తగ్గించిందన్న వాదనలున్నాయి. ముర్షిదాబాద్ జిల్లాలో 4.5 లక్షల ముస్లింల పేర్లను, మాల్దాలో 2.3 లక్షల ముస్లింల పేర్లను ఎన్నికల సంఘం తొలగించింది. ఇది ఆయా జిల్లాల్లో సమీకరణలను మార్చింది. కొత్తగా ఈసీ చేర్చిన ఓటర్ల సంఖ్య ఇతర ప్రాంతాలతో పోల్చితే ముస్లిం ప్రాబల్య నియోజకవర్గాల్లో తక్కువగానే ఉంది. నికరంగా ఈ ప్రాంతాల్లో ముస్లిం ఓటర్ల సంఖ్య తగ్గింది. ఇది కూడా తృణమూల్ సీట్ల సంఖ్య గతంలో కంటే పడిపోవటానికి ఒక కారణమైంది.

పనిచేయని సంక్షేమం

అవినీతి ఆరోపణలు, నిరుద్యోగం, అత్యాచారాలు వంటి ఘటనలతో నష్టం

(సెంట్రల్ డెస్క్)



పశ్చిమబెంగాల్ ప్రజలు అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై 'మమత' చూపలేదు! సంక్షేమ పథకాలతో ప్రజల్ని ఆకర్షించాలనుకున్న మమత ప్రయత్నాలు కూడా ఫలించలేదు. ఉపాధ్యాయ నియామకాల కుంభకోణం, ఇతర అవినీతి కేసులు ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టాయి. కీలక నేతల అరెస్టులు, విచారణలు ప్రజల్లో 'వ్యవస్థలోనే లోపాలున్నాయా?' అనే సందేహాన్ని కలిగించాయి. 15 ఏళ్లుగా అధికారంలో ఉండడం.. అవినీతి ఆరోపణలు, నిరుద్యోగం, ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురాలిపై హత్యాచారం వంటి ఘటనలతో మమత సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది. బెంగాల్‌లో ఉద్యోగ అవకాశాల కొరత మరో సమస్యగా మారింది. యువత నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వచ్చిన ఆరోపణలు, కేంద్ర పథకాల అమల్లో జాప్యం జనంలో అసంతృప్తి పెంచాయి. ఈ నేపథ్యంలో మమత ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలపై చర్యలు తీసుకుంది. పాలనాపరమైన మార్పులు చేసింది. 'దువారే ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసింది. అవేమీ కాపాడలేకపోయాయి.

పథకాలుప్రభావం చూపలేదు..!

మమత సర్కారు సంక్షేమ పథకాలపైనే ప్రధానంగా దృష్టి సారించింది. మహిళలు, యువత, రైతులు, పేదలను లక్ష్యంగా చేసుకుని పలు పథకాలు ప్రకటించింది. లక్ష్మీభండార్ పథకం కింద మహిళలకు నెలవారీ ఆర్థిక సహాయం అందించింది. బాలికల విద్యాభివృద్ధికి కన్యశ్రీ, పేద కుటుంబాల అమ్మాయిల పెళ్లిళ్ల కోసం రూపశ్రీ పథకాలు అమలు చేసింది. ఆరోగ్య రంగంలో స్వస్థ్య సాథి పథకం ద్వారా కుటుంబాలకు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించింది. విద్యార్థులకు సబూజ్ సాథి కింద ఉచిత సైకిళ్లు, స్కాలర్‌షిప్‌లు అందించింది. యువ సాథి పథకం కింద నిరుద్యోగులకు ఆర్థిక సహాయం, రైతుల కోసం కృషక్ బంధు, బీమా సదుపాయాలు కల్పించింది. గ్రామీణ మహిళల కోసం ఆనంద ధారా, పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం బంగ్లార్ బారి పథకాలు అమల్లో ఉన్నాయి. ఇక ఎన్నికల హామీల్లో భాగంగా మమత కొన్ని వర్గాలకు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు, ప్రస్తుత పథకాల విస్తరణ, ఆర్థిక సహాయం పెంపు వంటి వాగ్దానాలు కూడా చేశారు. కానీ, అవేవీ ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. పథకాల అమలులో లోపాలు, అవినీతి ఆరోపణలతో టీఎంసీపై నమ్మకం తగ్గింది. అలాగే ఐప్యాక్ సంస్థల్లో ఈడీ సోదాల విషయంలో మమత వ్యవహరించిన తీరు కూడా ఆమెకు నష్టం చేకూర్చింది. సంక్షేమ పథకాలతో బలమైన ఓటు బ్యాంకు ఏర్పరచుకున్న మమత.. అవినీతి, నిరుద్యోగం, చట్టం-వ్యవస్థ వంటి కీలక సమస్యలపై దృష్టి సారించలేదన్న అభిప్రాయాలు ఉన్నాయి. బీజేపీని విమర్శించడమే పనిగా పెట్టుకోవడం, కేంద్రంపై యుద్ధం చేస్తున్నట్లుగా ప్రవర్తించడంపైనే దృష్టి కేంద్రీకరించారని.. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేదని, అభివృద్ధి కార్యక్రమాల అమలును పట్టించుకోలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



దాడులు జరిగిన చోట్ల ఫలితాలివే!

కోల్‌కతా, మే 4: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి విడతలో ఇద్దరు బీజేపీ అభ్యర్థులపై పోలింగ్ కేంద్రాల వద్ద దాడులు జరగ్గా.. రెండో విడతలో కొన్ని చోట్ల ఈవీఎంలపై పలు పార్టీల గుర్తులు కనిపించకుండా టేప్‌లు వేసిన ఘటనలు జరిగాయి. కుమార్‌గంజ్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి శుభేందు సర్కారుపై మూకదాడి జరిగింది. ఆయన 6 వేలకు పైగా ఓట్ల తేడాతో టీఎంసీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. అసన్సోల్ సౌత్ బీజేపీ అభ్యర్థి అగ్నిమిత్ర పాల్ కారుపై రాళ్ల దాడి జరిగింది. ఆమె 40 వేలపైగా మెజార్టీతో టీఎంసీ అభ్యర్థిపై గెలిచారు. బీజేపీ, సీపీఎం అభ్యర్థుల పేర్లు, గుర్తులు కనిపించకుండా చేసిన ఘటనల నేపథ్యంలో పలు బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించిన మగ్రాహట్ పశ్చిమ్, డైమండ్ హార్బర్ సీట్లలో టీఎంసీ అభ్యర్థులే గెలిచారు.

పుదుచ్చేరిలో టీవీకే బోణీ!

తొలి ఎన్నికలోనే 2అసెంబ్లీ స్థానాలు కైవసం

పుదుచ్చేరి, మే 5: పుదుచ్చేరి రాజకీయాల్లో టీవీకే ఘనంగా అడుగుపెట్టింది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన ఈ పార్టీ, మొదటి ప్రయత్నంలోనే రెండు అసెంబ్లీ స్థానాలను దక్కించుకుంది. సోమవారం వెలువడిన ఫలితాల్లో.. టీవీకే అభ్యర్థులు బి.రాము, జె.శరవణన్ కుమార్ విజేతలుగా నిలిచారు.

ఉప ఎన్నికల్లో ఏడింటిలో 4 స్థానాలు బీజేపీవే

న్యూఢిల్లీ, మే 4: దేశంలోని ఐదు రాష్ట్రాల్లో ఏడు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. మహారాష్ట్రలోని రాహురీ, బారామతి; కర్ణాటకలో బాగల్‌కోట్, దావనగెరె సౌత్; గుజరాత్‌లో ఉమ్రత్, నాగాలాండ్ కొరిడాండ్; త్రిపురలో ధర్మనగర్‌లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఏడింటిలో నాలుగు స్థానాల్లో బీజేపీ జయకేతనం ఎగురవేయగా.. మరో రెండింట్లో కాంగ్రెస్ గెలుపొందింది. మహారాష్ట్రలోని బారామతిలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్ ఘనవిజయం సాధించారు. మరో నియోజకవర్గం రాహురీలో బీజేపీ అభ్యర్థి 1.12లక్షల పైచిలుకు మెజార్టీతో ప్రత్యర్థిపై గెలుపొందారు.



యానాంలో మల్లాడి విజయోత్సవ ర్యాలీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

యానాం మల్లాడిదే

4,568ఓట్ల మెజారిటీతో విజయం

ఆరోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక

కేంద్రపాలిత ప్రాంతమైన యానాం అసెంబ్లీ ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థి మల్లాడి కృష్ణారావు విజయం సాధించారు. 4,568ఓట్ల మెజారిటీ ఆరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ఎన్నికలో నియోజకవర్గంలో 35,631 ఓట్లు పోలయ్యాయి. ఎన్నార్ కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మల్లాడికి 19,863 ఓట్లు వచ్చాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి గొల్లపల్లి అశోక్‌కు 15,295మంది ఓటేశారు. టీవీకే విజయ్ పార్టీ తరపున పోటీ చేసిన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన తోటరాజుకు 167 ఓట్లు లభించాయి. నోటాకు 195ఓట్లు వచ్చాయి. ఎన్డీయే కూటమి పుదుచ్చేరిలో తిరిగి అధికారం దక్కించుకోవడంతో మల్లాడికి మంత్రి పదవి ఖాయంగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా, యానాం ఫలితం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీని తీవ్ర నిరాశకు గురిచేసింది. మల్లాడికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థి అశోక్‌ను గెలిపించడానికి కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి, మరో వైసీపీ ఎమ్మెల్సీ, మరో మాజీ మంత్రి కలిసి అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. అయితే, మల్లాడికి కాకినాడ సిటీ, ముమ్మిడివరం టీడీపీ ఎమ్మెల్యేలు సహకరించారు. మల్లాడి విజయం సాధించడడంతో స్థానిక టీడీపీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. .

పుదుచ్చేరిలో మళ్లీ..

అధికారం నిలబెట్టుకున్న ఆల్ ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్

- కాంగ్రెస్ నేతృత్వంలోని సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్‌కు నిరాశే
- టీవీకేకు 2 స్థానాలు.. ఐదోసారి సీఎం కానున్న రంగస్వామి

న్యూఢిల్లీ, మే 4: పుదుచ్చేరి ఓటర్లు మరోసారి ఎన్డీయేకే పట్టం కట్టారు. మొత్తం 30 స్థానాల్లో ఆలిండియా ఎన్ఆర్ కాంగ్రెస్ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 18 సీట్లు గెలిచి అధికారాన్ని నిలబెట్టుకుంది. కూటమిలోని ఎన్ఆర్ కాంగ్రెస్‌కు 12 స్థానాలు, బీజేపీకి 4 స్థానాలు లభించాయి. ఆలిండియా ఎన్ఆర్ కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి, తాను బరిలో నిలిచిన రెండు స్థానాల నుంచీ విజయం సాధించారు. ఆయన తట్టంచవడి నియోజకవర్గం నుంచి తన సమీప ప్రత్యర్థి నెయ్యం మక్కల్ కళగం అభ్యర్థి ఈ. వినాయగంపై 4,441 ఓట్ల తేడాతో, మనగలం నియోజకవర్గం నుంచి డీఎంకే అభ్యర్థి ఎస్ రంగన్‌పై 7050 ఓట్ల తేడాతో గెలుపొందారు. 2021 ఎన్నికల్లోనూ ఆయన యానాం, తట్టంచవడి స్థానాల నుంచి పోటీ చేశారు. అప్పట్లోనూ రెండుచోట్లా గెలిచారు. అయితే యానాం సీటును వదులుకొని, తట్టంచవడిని అట్టిపెట్టుకున్నారు. కాగా 30 స్థానాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 6 స్థానాలు గెలుచుకుంది. ఈ కూటమిలో కాంగ్రెస్‌కు ఒక స్థానం, డీఎంకేకు ఐదు స్థానాలు దక్కాయి. ఇక విజయ్ పార్టీ టీవీకే రెండు స్థానాలు గెలుచుకోవడం విశేషం. అన్నాడీఎంకే, ఎల్‌జీకే, నెయ్యం మక్కల్ కళగమ్ ఒక్కో స్థానంలో, ఇతరులు మూడు స్థానాల్లో గెలుపొందారు. రంగస్వామి క్యాబినెట్‌లోని మంత్రులు తిరుమురుగన్ (కారైకాల్ నార్త్), వీపీ శివకొలుందు (లాస్పేట్) గెలుపొందారు. గత ఎన్నికల్లో ఎన్ఆర్ కాంగ్రెస్ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి సరిగ్గా సాధారణ మెజారిటీ అయిన 16 స్థానాలను సాధించింది. ఇందులో ఎన్ఆర్ కాంగ్రెస్‌కు 10 స్థానాలు, బీజేపీకి 6 స్థానాలు దక్కాయి. అప్పట్లో డీఎంకేకు 6, కాంగ్రెస్‌కు 2 సీట్లు, ఇతరులకు 6 సీట్లు లభించాయి. ఈసారీ రంగస్వామియే ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నాలుగుసార్లు (2001-2006, 2006-2008, 2011-16, 2021-26) ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పుదుచ్చేరిలో సొంత పార్టీ పెట్టిన మూడు నెలల్లోనే ఆయన ముఖ్యమంత్రి అయ్యారు.

పుదుచ్చేరి(మొత్తం సీట్లు 30, మ్యాజిక్ మార్కు 16)

కూటమి	2026	2021	మార్పు	2026 %	2021 %
ఎన్ఆర్‌సీ+	18	16	+2	39%	44.2%
కాంగ్రెస్+	6	9	-3	32%	36.3%
టీవీకే	3	0	+3	16.72%	-
ఇతరులు	3	5	-2	12.28%	19.5%

టీవీకేకు అభినందనలు: ప్రధాని మోదీ

విజయ్‌కు ఫోన్ చేసిన రాహుల్

న్యూఢిల్లీ, మే 4: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రధాని మోదీ సోమవారం 'ఎక్స్' ద్వారా అభినందనలు తెలిపారు. ఎన్డీయే కూటమికి మద్దతు పలికిన ఓటర్లకు ఆయన ధన్యవాదాలు చెప్పారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో, వారి జీవితాలను మెరుగుపరచడంలో తాము ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటామని తెలిపారు. తమిళనాడు ప్రగతికి, అక్కడి ప్రజల సంక్షేమానికి కేంద్రం అన్నివిధాలుగా కృషి చేస్తుందని పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కూడా విజయ్‌కు శుభాకాంక్షలు చెప్పారు.



తలపతిదే తమిళనాడు

విజయ్ విత్ కామన్‌మ్యాన్...!

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): టీవీకేలో విజయ్ తప్ప, జనాదరణ ఉన్న నాయకులే లేరు. అన్నాడీఎంకే చీలిక సమయంలో జయకు కుడిభుజంగా వ్యవహరించిన కేఏ సెంగోట్టయ్యన్, గతంలో స్టాలిన్‌కు సన్నిహితంగా మెలగిన విల్లివాక్కం అభ్యర్థి ఆదవ్ అర్జున తప్ప టీవీకేలోని నేతలెవరూ ప్రజలకు తెలియదు. డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్‌లలో నిరాదరణకు గురైన నాయకులను విజయ్ చేరదీశారు. వారినే గెలుపు గుర్రాలుగా మలచుకున్నారు. కొందరు వీరాభిమానులకూ టికెట్లు ఇచ్చారు. ఇందులో ఆటోడ్రైవర్లు, సాధారణ ఉద్యోగులూ ఉన్నారు. విజయ్ దాము అనే ఆటో డ్రైవర్ టీవీకే తరఫున రాయపురంలో పోటీచేసి గెలవడం విశేషం. మొత్తం 234 మంది అభ్యర్థులను విజయ్ ఒకేసారి ప్రకటించి, వారిని పరిచయం చేశారు. వారితో తాను దిగిన ఫొటోను ఇచ్చి ప్రజల్లోకి పంపించారు. కొంతమంది అభ్యర్థులైతే విజయ్ విగ్రహాలను, ఫొటోలను తమ ప్రచార వాహనంపై పెట్టుకుని జనంలోకి వెళ్లి గెలిచారు.

బెంగాల్‌లో బీజేపీ పాగా



విజయ్ ఇంట్లో కుటుంబ సభ్యుల ఆనందోత్సాహాలు



జనంలోకి చొచ్చుకుపోవాలంటే ఊరూరూ తిరగాల్సిందేనా? ఎన్నికల ప్రచారమంటే గంటలకొద్దీ ప్రసంగాలు దంచాల్సిందేనా? అధికారం కోసం కోట్లకొద్దీ నోట్లు పంచక తప్పదా? ఉచిత హామీలు గుప్పించాల్సిందేనా? ఆ అవసరమే లేదు బాస్! ఎంత తిరిగామన్నది ముఖ్యం కాదు! ఎలా వెళ్లామన్నదే ముఖ్యం. ఏం చెప్పామన్నది కాదు... ఎలా చెప్పామన్నదే కీలకం! ఏం ఇస్తామన్నది కాదు... చెప్పింది చేస్తామనే నమ్మకం కల్పించడం అవసరం! ఇదే విజయ్ సమాధానం!



'కప్పు ముఖ్యం బిగిలూ'... అని తెరపై 'విజిల్స్' వేయించాడు! 'అదిరింది' అంటూ అభిమానులను అలరించాడు. 'సర్కార్' పేరుతో దుష్ట రాజకీయాలను తెరపై చీల్చి చెండాడు! ఇప్పుడు ఆయనే రాజకీయాల్లోకి వచ్చాడు! ఆరంభంలోనే అదరగొట్టాడు!

అదిరింది

పట్టుపడితే సాధించాల్సిందే

తిరస్కారాలు ఎదురైనా ముందుకే

తమిళ సినిమాల్లో సూపర్ సక్సెస్

రాజకీయ అరంగేట్రంలోనే అదుర్స్

ఇదీ విజయ్ జీవన ప్రస్థానం

'బండ మొహం... హీరోగానే పనికిరాడు' అని తిరస్కరించారు. అదే కుర్రాడు... తమిళనాట సూపర్ హీరో స్థాయికి ఎదిగాడు.

'అతనికి రాజకీయాలు కొత్త. లాలీపాప్ కుర్రాడు' అని గేలి చేశారు. కానీ, అతనే రాజకీయాల్లోనూ 'హీరో' అయ్యాడు.

రియల్ హీరోగా మారిన ఆ రీల్ హీరో పేరే... జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్ అలియాస్ 'ఇళయ దళపతి' విజయ్! అత్యంత ఆసక్తికరం, స్ఫూర్తిదాయకమైన విజయ్ జీవన ప్రస్థానమిది...

'**నువ్వు** డాక్టర్ కావాలి'... అని తండ్రి ఆదేశం! 'కాదు, నాన్నా యాక్టర్‌నే అవుతా'... ఇది కుమారుడి పంతం! సినిమాలంటే విజయ్‌కి అంత పిచ్చి! 1974 జూన్ 22న చెన్నైలో జన్మించారు. తండ్రి... సినీ దర్శకుడు ఎస్‌ఏ చంద్రశేఖర్. తల్లి... శోభ చంద్రశేఖర్! 1984 నుంచి 1988 వరకు విజయ్ బాల నటుడిగా ఆరు చిత్రాల్లో నటించారు. తమ ఏకైక కుమారుడైన విజయ్‌ని చంద్రశేఖర్ డాక్టర్‌ను చేయాలని కలలు కన్నారు. కానీ, విజయ్ దృష్టంతా సినిమాలపైనే ఉండేది. ఇంటర్ రోజుల్లోనే నటన లేదా దర్శకత్వం వైపు వెళ్తానని తెగేసి చెప్పారు. చంద్రశేఖర్ కోపగించుకుని 'ఇంటి నుంచి వెళ్ళిపో' అని గద్దించారు. తండ్రి మాటలను సీరియస్‌గా తీసుకున్న విజయ్.. ఒక లేఖ రాసిపెట్టి వెళ్లిపోయారు. చివరికి విజయ్ ఇంటి సమీపంలోనే ఉండే ఒక థియేటర్‌లో సినిమాలు చూస్తూ కనిపించారు. ఇంటికి తీసుకొచ్చిన తల్లిదండ్రులు.. డిగ్రీ పూర్తి చేస్తే సినీరంగంలో చేర్పిస్తామని హామీ ఇవ్వడంతో విజువల్ కమ్యూనికేషన్ డిగ్రీలో చేరారు.

అంత ఈజీ కాదు..

తండ్రి సినీ దర్శకుడే అయినప్పటికీ విజయ్‌కు మాత్రం తొలి చిత్ర అవకాశం అంత సులభంగా రాలేదు. తన బయోడేటాతో స్టూడియోల చుట్టూ తిరిగారు. తండ్రి కూడా కొడుక్కి తెలియకుండా ప్రయత్నాలు మొదలుపెట్టారు. నాడు పేరున్న దర్శకులందరికీ కుమారుడి ఫొటో చూపించి ఒక్క అవకాశం ఇవ్వాలంటూ ప్రాధేయపడ్డారు. చివరకు సగం పెట్టుబడి పెడతామన్నా విజయ్‌ను హీరో చేసేందుకు ఏ నిర్మాతా ముందుకురాలేదు. పైగా సూటిపోటి మాటలతో గాయపరిచారు. చివరికి చంద్రశేఖర్ రూ.60 లక్షలు అప్పుతెచ్చి కొడుకు హీరోగా తానే 'నాళయ తీర్పు' అనే చిత్రాన్ని తీశారు. అది పరాజయం పాలైంది. తీవ్రంగా కుంగిపోయిన విజయ్... నెల రోజులు ఇంటికే పరిమితమయ్యారు. ఆ సమయంలో స్నేహితులు అండగా నిలిచారు. రెండో సినిమా తీసేందుకు ముందుకొచ్చారు. విజయ్ తమ ఇంటిని కుదువపెట్టారు. ఇందులో కెప్టెన్ విజయకాంత్ పైసా రెమ్యునరేషన్ తీసుకోకుండా అతిథి పాత్ర పోషించారు. ఆ చిత్రమే 'సెందూరపాండి'. ఈ సినిమా సూపర్ హిట్! తర్వాత పట్టుదలతో విజయ్ రేయింబవళ్లు కష్టపడ్డారు. నటనతో పాటు డ్యాన్స్, కరాటే వంటి వాటిపై శిక్షణ తీసుకున్నారు. తన మూడో చిత్రం 'రసిగన్'తో నిలదొక్కుకున్నారు. రెండేళ్లు వరుసగా మాస్ చిత్రాలతో ఊపేశారు. 'పూవే ఉనక్కాగ'తో క్లాస్ హీరోగా మారారు. 'కాదలుక్కు మరియాదై', 'ఖుషీ', 'గిల్లీ', 'పోకిరి' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో స్టార్ హీరోగా అవతరించారు. ఇప్పటికి 68 చిత్రాల్లో నటించారు. 69వ చిత్రం 'జననాయగన్'.. సెన్సార్ వివాదంతో విడుదలకు నోచుకోలేదు.

వీరాభిమానితో వివాహం... విడాకులు!

విజయ్ తన వీరాభిమాని సంగీతను 1999 ఆగస్టు 25న వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. కుమారుడు జేసన్ విజయ్! కుమార్తె దివ్య. విజయ్, సంగీత వివాహ జీవితం కూడా 'విడాకుల' ముందు నిలిచింది. ఎన్నికల ముందే ఇది వివాదాస్పదమైంది. విడాకుల కోసం సంగీత కోర్టుమెట్లెక్కారు. - చెన్నై, ఆంధ్రజ్యోతి.

రాజకీయ అరంగేట్రం..

ఆది నుంచీ విజయ్‌కి రాజకీయాలపై మక్కువ ఎక్కువ. సినిమాల్లో తన పాత్రలతో దీనిపై స్పష్టమైన సంకేతాలు పంపేవారు. ప్రస్తుత రాజకీయాలు, నాయకుల తీరు, ప్రజా సమస్యలను నేపథ్యంగా ఉన్న పలు చిత్రాల్లో ఆయన కథా నాయకుడిగా నటించారు. 2009లో 'విజయ్ మక్కల్ ఇయ్యక్కం' పేరుతో అభిమాన సంఘాన్ని ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు చేపట్టి... దానిని రాజకీయ అరంగేట్రానికి తొలి మెట్టుగా ఎంచుకున్నారు. ఆ తర్వాత 2024 ఫిబ్రవరిలో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) స్థాపించారు. ఇప్పుడు... ఎన్నికల్లో అనూహ్య విజయంతో తమిళనాడు ముఖ్యమంత్రి పీఠానికి చేరువయ్యారు!

పూర్తి పేరు
జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్
సినిమా పేరు
'ఇళయ దళపతి' విజయ్
వయసు
52 (1974 జూన్ 22)
తండ్రి పేరు
ఎస్‌ఏ చంద్రశేఖర్
తల్లి పేరు
శోభా చంద్రశేఖర్
విద్యార్హత
విజువల్ కమ్యూనికేషన్ (డ్రాపౌట్)
మొత్తం సినిమాలు: 68
చివరి చిత్రం
'జన నాగయన్'
(విడుదల కావాల్సివుంది)
హాబీలు
డ్యాన్స్, పాటలు పాడటం (30కి పైగా పాటలు పాడారు)
ఆస్తులు
రూ.625 కోట్లు (ఎన్నికల అఫిడవిట్ ప్రకారం)

2 స్థానాల్లోనూ విజయ్ భారీ గెలుపు

టీవీకే అధినేత విజయ్ పోటీచేసిన రెండు స్థానాల్లోనూ ఘన విజయం సాధించారు. తిరుచ్చిరాపల్లి (తూర్పు)లో 91,381 ఓట్లు సాధించిన ఆయన.. డీఎంకే అభ్యర్థిపై 27,416 ఓట్ల మెజార్టీతో గెలిచారు. అదేవిధంగా పెరంబూరులో కూడా ఆయన డీఎంకే అభ్యర్థిపై ఏకంగా 53,715 ఓట్ల భారీ మెజార్టీతో విజయ ఢంకా మోగించారు. - చెన్నై, ఆంధ్రజ్యోతి

త్రిష బర్త్‌డే స్పెషల్..!

శ్రీవారి ఆశీస్సులతో నేరుగా విజయ్ ఇంటికి

కారులో కూర్చుని విజయకేతనం చూపిస్తూ హర్షం

తిరుమల, చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): నటి త్రిషకు సోమవారం (మే 4) ఎంతో ప్రత్యేకమైన రోజు... ఆమె 43వ పుట్టినరోజు.. మరోవైపు ఆమె సన్నిహిత మిత్రుడు దళపతి విజయ్ రాజకీయ భవిష్యత్తును తేల్చే ఎన్నికల ఫలితాల రోజు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొన్న ఆమె పఠనం అనంతరం గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా త్రిషను వేదపండితులు ఆశీర్వదించగా, ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన త్రిషను చూస్తూ ఓ అభిమాని 'మేడం ఈ రోజు రిజల్ట్ మొత్తం మనవే..' అంటూ పెద్దగా అరవగా... త్రిష నవ్వుకుంటూ వెళ్లిపోయారు. తిరుమల నుంచి నేరుగా చెన్నైలోకి దళపతి విజయ్ నివాసానికి చేరుకున్నారు. గేటు బయట కారులో కూర్చునే విజయకేతనం చూపిస్తూ లోపలికి వెళ్లారు. కాగా, ఆమె పుట్టిన రోజు.. తమిళనాడు ఎన్నికల ఓట్ల లెక్కింపు ఒకేరోజు కావడంతో ఆమె తిరుమల పర్యటన రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. విజయ్ రాజకీయ పార్టీ పెట్టినప్పటి నుంచి త్రిష ఆయనకు వెన్నంటి ఉంటూ మద్దతు తెలుపుతున్నారు. విజయ్ గెలుపు కోరుకుంటూ ఆమె తిరుమలకు వచ్చారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



తిరుమల ఆలయం వద్ద నటి త్రిష

త్రిష-విజయ్ బంధం

దక్షిణాదిలో అగ్ర కథానాయికగా కొనసాగుతున్న త్రిష, తమిళ సూపర్‌స్టార్ విజయ్ మధ్య బంధం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే వాటిపై వాళ్లు ఎప్పుడూ స్పందించలేదు. ఇదిలా ఉండగా.. విజయ్ భార్య సంగీత కూడా ఆయన తనను మోసం చేశాడని ఆరోపిస్తూ విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ కేసు కోర్టుకు చేరింది. అదే సమయంలో విజయ్, త్రిష మధ్య సన్నిహిత సంబంధం ఉందంటూ విపరీతమైన ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో విజయ్, త్రిషలు ఒకే కారులో కలిసి ఏజీఎస్ ఫ్యామిలీ వివాహ వేడుకకు హాజరయ్యారు. దీంతో వారి బంధంపై చర్చ మొదలైంది.

ట్రెండింగ్‌లో జననాయగన్, త్రిష..

త్రిష పుట్టిన రోజు నాడే ఎన్నికల ఫలితాలు వెల్లడికావడం యాదృచ్ఛికమే అయినప్పటికీ.. త్రిష, తమిళనాడు ఎన్నికల ఫలితాలు, విజయ్ నటించిన 'జననాయగన్' మూవీ సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. విజయ్ సీఎం కావడం ఖాయమంటూ అభిమానులు ఈ సినిమా ట్రైలర్‌ను షేర్ చేస్తున్నారు. 'జననాయగన్' చిత్రంలో విజయ్ చెప్పే డైలాగులు.. 'ది గోట్' చిత్రంలోని పాటలో త్రిష... టీవీకే జెండా రంగు (పసుపు, ఎరుపు)లో ఉండే చీర ధరించి డ్యాన్స్ చేస్తున్న సన్నివేశం క్లిప్‌లను టీవీకే శ్రేణులు, విజయ్ అభిమానులు వైరల్ చేశారు. అలాగే... త్రిషకు శుభాకాంక్షలు వెల్లువెత్తడంతో ఆమె పేరు కూడా ఎక్స్‌లో టాప్‌లో ట్రెండ్ అవుతోంది.

హేమాహేమీలకు 'విజిల్' మోత!

సీఎంతో పాటు పలువురు మంత్రులకూ పరాభవం

చెన్నై, మే 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీ టీవీకే దెబ్బకు హేమాహేమీలు గల్లంతయ్యారు. సీఎం స్టాలిన్ నుంచి డీఎంకే సీనియర్ మంత్రులు దురైమురుగన్, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఆర్.గాంధీ, ఆర్.రాజేంద్రన్, గీతా జీవన్, పళనివేల్ త్యాగరాజన్, పి.మూర్తి, టీఆర్‌బీ రాజా, అన్బిల్ మహేశ్ పొయ్యామొళి, ఎస్‌ఎం నాజర్, ఎంపీ సామినాథన్, దామో అన్బరసన్, ఎం.సుబ్రమణ్యం, ఎస్.ముత్తుసామితో పాటు అసెంబ్లీ స్పీకర్ అప్పావు, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ తదితరులు పరాజయం పాలయ్యారు.

అయ్యో.. పాపం కాంగ్రెస్!

అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేతో చేతులు కలిపేందుకు కాంగ్రెస్ పార్టీ తహతహలాడింది. ఆ పార్టీకి 80 స్థానాలు, ఆరు మంత్రి పదవులు ఇచ్చేందుకు సిద్ధమని విజయ్ పంపిన రాయబారంతో కాంగ్రెస్ రాష్ట్ర నేతలు విపరీతంగా ఆకర్షితులయ్యారు. టీవీకేతో కాంగ్రెస్ పొత్తు దాదాపు ఖాయమని అందరూ భావించారు. అయితే జాతీయ స్థాయిలో వున్న పొత్తుల దృష్ట్యా డీఎంకేతోనే కలసి సాగాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఒకవేళ టీవీకేతో కలసి సాగితే, తాము 50కి పైగా స్థానాల్లో గెలిచి ఉండేవారమని కాంగ్రెస్ నేతలు వాపోతున్నారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాడు!

తండ్రిగా ఎంతో గర్విస్తున్నా: ఎస్‌ఏ చంద్రశేఖర్

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): విజయ్‌కు మొదటి నుంచీ ఆత్మస్థైర్యం ఎక్కువని, ప్రజలు అతనిపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయరని ఆయన తండ్రి, సీనియర్ సినీ దర్శకుడు ఎస్‌ఏ చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. ప్రజలు తన కుమారుడి నుంచి చాలా ఆశిస్తున్నారని, ఎంతో నమ్మకం పెట్టుకున్నారని పేర్కొన్నారు. వాటిని విజయ్ కచ్చితంగా నెరవేరుస్తారని తెలిపారు. విజయ్ ప్రజా జీవితంలోకి రావడం ఆకస్మిక నిర్ణయం కాదని, 20 ఏళ్లకుగా చేసిన ప్రణాళికల ఫలితమేనని పేర్కొన్నారు. 'విజయ్ విజయం పట్ల ఒక తండ్రిగా ఎంతో గర్వపడుతున్నాను. సంతోషంగా ఉన్నాను. నా బిడ్డకు హృదయపూర్వక శుభాకాంక్షలు' అంటూ తన ఆనందాన్ని, ఉద్వేగాన్ని వ్యక్తం చేశారు. 'రెండేళ్లుగా అతనిలో తమిళనాడు ముఖ్యమంత్రి అవుతానన్న నమ్మకం చూశాను. ఇది చారిత్రక విజయం. రాష్ట్ర ప్రజల కోసం విజయ్ సుపరిపాలన అందిస్తారు' అని వ్యాఖ్యానించారు.

ద్రవిడ పార్టీలు అవుట్

ఆరు దశాబ్దాల తర్వాత తమిళనాట పీఠానికి దూరం

▸▸ ఆ సిద్ధాంతంతో సంబంధం లేకుండా 'టీవీకే' పార్టీ గెలుపు

(చెన్నై, ఆంధ్రజ్యోతి)

ద్రవిడ సిద్ధాంతాలకు పెట్టింది పేరైన తమిళనాట తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ సంచలనం సృష్టించింది. మద్రాసు రాష్ట్రం తమిళనాడుగా మారిన తర్వాత ద్రవిడ సిద్ధాంతాలతో సంబంధం లేకుండా విజయం సాధించి రికార్డులకెక్కింది. సుమారు ఆరు దశాబ్దాల తరువాత తొలిసారిగా తమిళనాట ద్రవిడ సిద్ధాంత పార్టీలు కాకుండా మరో పార్టీ అధికారం చేపట్టడం విశేషం. స్వాతంత్ర్యానంతరం మద్రాస్ ప్రెసిడెన్సీకి ఓపీ రామస్వామి రెడ్డియార్, పీఎస్ కుమారస్వామి రాజా, సి.రాజగోపాలాచారి, కె.కామరాజ్, ఎం.భక్తవత్సలం వంటి నేతలు సీఎంలుగా వ్యవహరించారు. ద్రవిడ సిద్ధాంతాలతో ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే)ను స్థాపించిన సీఎన్ అన్నాదురై.. రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ 1967 మార్చి 6న అధికారంలోకి వచ్చారు. ఆయన మరణానంతరం ఆపద్ధర్మ సీఎంగా వీఆర్ నెడుంజెళియన్, ఆ తరువాత కరుణానిధి ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. తరువాతి కాలంలో కూడా కరుణానిధి మరో మూడుమార్లు సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. కరుణానిధితో ఏర్పడిన విభేదాలతో ఏఐఏడీఎంకేను స్థాపించిన ఎంజీఆర్ 1977లో అధికారం చేపట్టారు. ఎంజీఆర్ మరణానంతరం ఆయన సతీమణి జానకి రామచంద్రన్, జయలలిత, ఒ.పన్నీర్‌సెల్వం, ఎడప్పాడి పళనిస్వామి అన్నాడీఎంకే నుంచి ముఖ్యమంత్రులయ్యారు. ఇక 2021 మేలో స్టాలిన్ సీఎం పీఠమెక్కారు. అయితే వీరంతా ద్రవిడ సిద్ధాంతాలతో కూడిన పార్టీలకు చెందిన వారే.

పేరులోనే విజయం

విజయ్ స్థాపించిన పార్టీ పేరులో విజయం ఉంది. 'తమిళగ వెట్రి కళగం' అంటే 'తమిళుల విజయం పార్టీ' అని అర్థం. ద్రవిడ అనే పదం లేకుండా పార్టీని స్థాపించిన విజయ్ తొలి పోరులోనే విజయం సాధించారు.

తమిళ పీఠంపై తొలి క్రైస్తవుడు

తమిళనాడు చరిత్రలో సీఎం పీఠమెక్కనున్న తొలి క్రైస్తవుడు విజయ్ కావడం మరో విశేషం. విజయ్ తండ్రి సినీ దర్శకుడు ఎస్‌ఏ చంద్రశేఖర్.. రామేశ్వరం సమీపంలోని తంగచ్చిమఠం ప్రాంతానికి చెందిన రోమన్ క్యాథలిక్ కుటుంబంలో జన్మించారు. విజయ్ తల్లి శోభ హిందువు. ఆమె సాయిబాబాకు పరమ భక్తురాలు. వారి కుటుంబంలో రెండు మతాచారాలను అవలంభిస్తుంటారని చెబుతుంటారు. విజయ్ చర్చితో పాటు ఆలయాలు, మసీదుల్లో కూడా పలుమార్లు పూజలు, ప్రార్థనలు నిర్వహించారు.

తమిళనాడు(మొత్తం సీట్లు 234, మ్యాజిక్ మార్కు 118)

కూటమి	2026	2021	మార్పు
టీవీకే	107	0	+107
డీఎంకే+	74	159	-85
ఏడీఎంకే+	53	75	-22



ఒకే ఒక్కడు X మహామహులు

ఇటు ఒకే ఒక్కడు, కొత్త పార్టీ, అనుభవ లేమి! అటువైపేమో రాజకీయ దిగ్గజాలు, మహామహులు! అయినా... అంతిమ ఫలితం విజయ్‌కే అనుకూలం! గత ఏడాది సెప్టెంబరులో కరూర్ ప్రచార సభలో నిర్వహించిన తొక్కిసలాటలో 41 మంది మరణించడం విజయ్‌కు శరాఘాతం! దీంతో విజయ్ స్వేచ్ఛగా ప్రచార సభలు నిర్వహించలేకపోయారు. దీనికి సమయాభావం తోడైంది. మెజారిటీ జిల్లాల్లో ఆయన అడుగు కూడా పెట్టలేకపోయారు. అయినప్పటికీ... టీవీకే అభ్యర్థులు ఆయన కటౌట్లు, హోలోగ్రామ్‌నే నమ్ముకుని ప్రచారం సాగించారు. మరోవైపు... డీఎంకే తరఫున స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్, కనిమొళి వంటి ప్రముఖులు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. అన్నాడీఎంకే తరఫున ఎన్డీయే కూటమికి చెందిన ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమిళనాట పర్యటించారు. స్వయంగా ప్రధాని మోదీ కూడా ప్రచారంలో పాల్గొన్నారు. అయినప్పటికీ... అన్నా డీఎంకేకు కలిసి రాలేదు. అనేక ప్రతికూలతలు ఎదుర్కొన్నప్పటికీ విజయ్ మాత్రం గెలుపు తీరాన్ని చేరారు. - చెన్నై, ఆంధ్రజ్యోతి



విజయ్ కేతనం!

'విజిల్'తో ఇళయ దళపతి గెలుపు కేక

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఎన్నికల్లో ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ సంచలనం సృష్టించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చేందుకే పరిమితమవుతారని అంతా భావించినా... ఏకంగా ప్రభుత్వ పీఠానికే దగ్గరయ్యేన్ని సీట్లు సాధించారు. స్పష్టమైన మెజారిటీ సాధించనప్పటికీ... 'అతి పెద్ద' పార్టీ అధినేతగా ఆవిర్భవించారు. ఆరు దశాబ్దాలుగా తమిళనాడును ఏలుతున్న రెండు ప్రధాన ద్రవిడ పార్టీలను వెనక్కి నెట్టేశారు. టీవీకే అభ్యర్థులు 107 స్థానాల్లో గెలుపొందారు. కొళత్తూరులో ముఖ్యమంత్రి స్టాలిన్ సైతం టీవీకే అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. మొత్తం 234 నియోజకవర్గాలున్న తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. 85.15 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. డీఎంకే నేతృత్వంలోని ఇండి కూటమి, అన్నాడీఎంకే నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి, ఒంటరిగా బరిలోకి దిగిన టీవీకే మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. డీఎంకే కూటమిలో మొత్తం 16 పార్టీలుండగా.. ఆ పార్టీ 164 స్థానాల్లో పోటీ చేసింది. ఎన్‌డీఏ కూటమికి నేతృత్వం వహిస్తున్న అన్నాడీఎంకే 167 చోట్ల పోటీ చేసింది. టీవీకే 233 స్థానాల్లో పోటీ చేసింది. కౌంటింగ్ ప్రారంభం నుంచే టీవీకే ఆధిపత్యం ప్రదర్శించింది. పోస్టల్ ఓట్లలో సైతం టీవీకే వైపే మొగ్గు కనిపించింది. ఒక దశలో డీఎంకే మూడో స్థానానికే పరిమితమైంది. తర్వాత పుంజుకుని రెండోస్థానానికి చేరుకుంది. డీఎంకే కంచుకోటచెన్నైలో 16 నియోజకవర్గాలుండగా... 14 చోట్ల టీవీకే విజయం సాధించడం విశేషం.

'ఈల' వేసి...

అంచనాలకు మించి, అనూహ్య విజయం సాధించడంతో టీవీకే కార్యకర్తల సంబరాలు అంబరాన్ని అంటాయి. తిరువాన్మియూరులోని టీవీకే ప్రధాన కార్యాలయం, విజయ్ నివాసం వద్ద సందడి కనిపించింది. ఇక విజయ్ కుటుంబీకులు తమ నివాసంలో... టీవీకే పార్టీ చిహ్నమైన 'విజిల్' ఊదుతూ, నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. తన గెలుపు ఖరారుకాగానే విజయ్ నేరుగా అడయార్‌లో ఉన్న తన తల్లిదండ్రుల ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం నుంగంబాక్కంలో ఉన్న లయోలా కళాశాల కౌంటింగ్ కేంద్రం వద్దకు వెళ్లి... ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు.

జయ బాటలో...: ఈపీఎస్


అన్నాడీఎంకే మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పేర్కొన్నారు. "జయలలిత బాటలో మళ్లీ పార్టీ ఘనవిజయం కోసం పాటుపడతాం." అని శపథం చేశారు.

బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా: స్టాలిన్

తమ పార్టీకి సిద్ధాంతాలు, ఆశయాలు మాత్రమే ముఖ్యమని డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ప్రకటించారు. ప్రజలిచ్చిన తీర్పును శిరసావహిస్తామన్నారు. "ఇప్పటి వరకూ పాలకపక్షంగా సేవలందించిన మా పార్టీ... ఇకపై బాధ్యతాయుత ప్రతిపక్షంగా ప్రధాన పాత్రను పోషిస్తుంది" అని స్టాలిన్ పేర్కొన్నారు.

కలిసొచ్చేది ఎవరు?

తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు అవసరం. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 'మ్యాజిక్ ఫిగర్'కు కాస్త దూరంలో ఆగిపోయింది. అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన టీవీకేను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించడం ఖాయం. డీఎంకేను ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా ప్రకటించిన విజయ్... ఆ పార్టీ మద్దతు తీసుకునే అవకాశం లేదు. అన్నా డీఎంకేతో అధికారం పంచుకోవడానికీ సిద్ధంగాలేమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో తమతో కలిసొచ్చే పార్టీల కోసం మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, డీఎండీకే పార్టీల మద్దతు కోసం టీవీకే వర్గాలు చర్చిస్తున్నట్లు తెలిసింది. టీవీకేకు మద్దతిచ్చే పార్టీలపై మంగళవారం స్పష్టత వచ్చే అవకాశముంది.



నిశ్శబ్ద విప్లవం!

రాజకీయ 'విజయానికి' 17 ఏళ్ల కిందటే పునాది

'నీ చేతిలో బాణం ఉంటే... కుందేలును కాదు; ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి' పార్టీ ప్రారంభంలోనే విజయ్ చేసిన ప్రకటన ఇది. ఇప్పుడు అదే జరిగింది. దశాబ్దాలుగా తమిళనాట వేళ్లూనుకుపోయిన ద్రవిడ పార్టీలను విజయ్ మొదటి దెబ్బకే మట్టి కరిపించారు. ఆయనతో పొత్తు పెట్టుకునేందుకు ముఖం చాటేసిన పార్టీలు నోరెళ్లబెట్టేలా సంచలన విజయం నమోదు చేశారు.

(చెన్నై - ఆంధ్రజ్యోతి)

తమిళనాట విజయ్ విజయం... అదొక నిశ్శబ్ద విప్లవం. అభిమానులే బలంగా, స్థిరమైన రాజకీయ వ్యూహాలే ధనంగా విజయ్ దూసుకెళ్లారు. 'ఒకే ఒక్క చాన్స్' అంటూ విజయ్ చేసిన ప్రచారం పెను తుఫానులా మారి.. సంప్రదాయ రాజకీయాలను, రెండు పార్టీల వ్యవస్థను తుడిచిపెట్టేసింది. విజయ్ తన పార్టీని రెండేళ్ల క్రితం ప్రకటించినా, తన రాజకీయాలకు మాత్రం 17 ఏళ్ల క్రితమే పునాదులు పడ్డాయి. ఆయన తన అభిమాన సంఘాలను 2009లో విజయ్ మక్కల్ ఇయక్కమ్ పేరిట సంఘటితం చేశారు. తొలినుంచీ సేవా కార్యక్రమాల వైపే విజయ్ నడించారు. విద్య, సంక్షేమం, స్థానిక సమస్యల వంటి విషయాల్లో సేవా భావం ప్రదర్శించారు. 2011లో విజయ్ మక్కల్ ఇయక్కమ్ అన్నాడీఎంకేకు మద్దతు ఇచ్చింది. ఒకరకంగా ఇది ఆయన చేసిన చేసిన తొలి రాజకీయ ప్రయోగం. ప్రజల నాడి తెలుసుకునే ప్రయత్నం. 2021లో మక్కల్ ఇయక్కమ్ సభ్యులు స్వతంత్రంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలిచి అత్యధికం గెలిచారు. విజయ్‌కి ఉన్న పలుకుబడి ఓట్ల కిందకు మారుతోందని గుర్తించిన మరో సందర్భం ఇది. చివరికి 2024 లోక్‌సభ ఎన్నికల ముందు పూర్తి స్పష్టతతో విజయ్ పార్టీని ప్రకటించారు.

ప్రత్యామ్నాయం.. సానుభూతి

డీఎంకే-అన్నాడీఎంకేలపై విపరీతమైన అవినీతి ఆరోపణలున్నాయి. అయినా మరో సరైన ప్రత్యామ్నాయం లేకపోవడంతో తమిళులు ఆ రెండు పార్టీల్లోనే ఏదో ఒకదానిని ఎన్నుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో... మంచి పరిపాలన అంటే ఎలా ఉంటుందో చూపిస్తానన్న విజయ్ ప్రకటన, నిశ్శబ్దంగా ఓటర్లు ఆ పార్టీ వైపు మొగ్గడానికి కారణమైందని విశ్లేషిస్తున్నారు. మరోవైపు విజయ్ సభలకు స్టాలిన్ ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని, పోలీసుల ద్వారా ఆయనను ఇబ్బంది పెడుతోందంటూ జరిగిన ప్రచారం కూడా సానుభూతి పెంచింది. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటకు ప్రధాన కారణం డీఎంకేయేనని, విజయ్‌కు చెక్ పెట్టేందుకు డీఎంకే పన్నిన కుట్ర అని ప్రజలు గట్టిగా విశ్వసించారు. ఆ ఘటనలో మృతుల కుటుంబాలకు తలా రూ.1 కోటి, క్షతగాత్రులకు పెద్ద మొత్తం ఇవ్వడంతో బాధిత కుటుంబాలు విజయ్‌కు అండగా నిలిచాయి. అదే విధంగా 'జన నాయగన్' చిత్రం విడుదలను డీఎంకే అడ్డుకుందని, ఆన్‌లైన్‌లో లీక్ చేయడంలోనూ అధికార పార్టీ ప్రమేయం ఉన్నదన్న ప్రచారం ఓటర్లపై బాగా ప్రభావం చూపినట్లు కనిపిస్తోంది.

సింగిల్ టార్గెట్..

పార్టీ పెట్టినప్పటినుంచీ తనకు, తన పార్టీకి ప్రధాన ప్రత్యర్థి డీఎంకే మాత్రమేనని విజయ్ స్పష్టంగా ప్రకటించారు. బీజేపీని సైద్ధాంతిక ప్రత్యర్థిగా పేర్కొన్నారు. మత రాజకీయాలను వ్యతిరేకిస్తానని, 'లౌకిక, సామాజిక న్యాయం' తన సిద్ధాంతం అన్న ఆయన మాటలు ఈ వర్గాలను ఆలోచించజేశాయి. 'ఓటేయాలని మీ తల్లిదండ్రులకు గట్టిగా చెప్పండి' అంటూ విజయ్ చేసిన విజ్ఞప్తి చిన్నారులపై బాగా ప్రభావం చూపింది. విజయ్‌కు ఉన్న స్టార్ హోదా, ఆయన పట్ల ఉన్న జనాకర్షణ ఆయన విజయంలో కీలకంగా మారాయి. ఒకవేళ విజయ్ సామాన్య రాజకీయ నేతలా వీధుల్లోకి దిగి ప్రజలను కలుసుకుని ఉంటే, ఆయన స్టార్‌డమ్‌కు ఉన్న ఆకర్షణ తగ్గిపోయేది. కానీ టీవీకే వ్యూహకర్తలు అలా జరగనివ్వలేదు. రాజకీయాల్లో కూడా విజయ్‌ను అగ్రతారగానే ఉంచి, దూరంగా ప్రచారం చేయించారు.

డబ్బులు కాదు.. విజిల్స్ పంచి గెలిచారు!

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు అమ్ముడుపోతారా? ఓట్లు కొనుక్కోవచ్చా? డబ్బులు పంచితే తప్ప ఎన్నికల్లో గెలవలేరా? ఈ ప్రశ్నలన్నింటికీ ఇప్పటిదాకా ఉన్న సమాధానాలను విజయ్ తిరగరాశారు! పార్టీ ఫండు, ఓటుకు నోటు ప్రస్తావనే లేకుండా తమిళ ఎన్నికల్లో అధికార పీఠానికి చేరువయ్యారు. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నా డీఎంకే అభ్యర్థులు పోటాపోటీగా డబ్బులు పంపిణీ చేశారు. ఓటుకు వెయ్యి నుంచి రెండువేల రూపాయల దాకా చెల్లించినట్లు వార్తలు వచ్చాయి. విజయ్ పార్టీ అభ్యర్థులు మాత్రం ఎక్కడా డబ్బు పంపిణీ జోలికి పోలేదు. తమ చిహ్నంపై ఓటేయాలంటూ 'విజిల్'లను ఇబ్బడిముబ్బడిగా పంపిణీ చేశారు. విచ్చలవిడిగా పోస్టర్లను అతికించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారాన్ని హోరెత్తించారు. ఎన్నికల ప్రచారంలో ఆర్భాటానికి పోలేదు. కొన్నిచోట్ల టీవీకే అభ్యర్థులు కేవలం ఇద్దరు ముగ్గురు సహచరులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. అలాంటి వారు కూడా ఈ ఎన్నికల్లో విజయం సాధించడం విశేషం.

ఉచితాలు కాదు.. విజయ్ మాటనే నమ్మారు..

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉచిత హామీలు గుప్పిస్తే అధికారంలోకి వచ్చేస్తారా? ఉన్న అధికారాన్ని నిలుపుకోవచ్చా!? అనుచితమే అయినప్పటికీ... ఉచితమే మార్గమా? కొన్నిసార్లు ఇది ఫలించవచ్చు కానీ, అన్నిసార్లూ కాదని తమిళ ఎన్నికలు రుజువు చేశాయి. విజయ్ తరహా కొత్త 'ట్రెండు' మొదలైనప్పుడు భారీ ఉచిత హామీలు పని చేయవని స్పష్టమైంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు హామీలు గుప్పించడంలో పోటీపడ్డాయి. డీఎంకే అయితే ప్రస్తుతం అమలు చేస్తున్న హామీలతోపాటు కొత్తగా ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ కొనుగోలు చేసేందుకు రూ.8 వేల కూపన్ వంటి హామీలు ఇచ్చింది. ఇక అన్నాడీఎంకే ఏటా ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు, రేషన్‌కార్డు దారులకు ఫ్రిజ్, సిటీ, టౌన్ బస్సుల్లో పురుషులకు కూడా ఉచిత ప్రయాణం, బియ్యం కార్డుదారులకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలను ప్రకటించింది. ఈ రెండు పార్టీల హామీలను ఓటర్లు తిరస్కరించారు. టీవీకే అధినేత విజయ్... ప్రతి కుటుంబానికి ఏటా 6 గ్యాస్ సిలిండర్లు ఉచితం, నిరుపేద యువతి పెళ్లికి 8 గ్రాముల బంగారం వంటి వంటి హామీలిచ్చి.. గెలిచారు.



డీఎంకే కార్యాలయం వద్ద టెంట్లు తీసేస్తున్న దృశ్యం

నిరాశలో డీఎంకే...

గెలుపుపై తిరుగులేని ధీమాతో ఉన్న డీఎంకే తాజా పరిణామాలతో తీవ్రనిరాశలో కూరుకుపోయింది. 'జయం మనదే' అనే నమ్మకంతో సోమవారం ఉదయానికే డీఎంకే కార్యాలయం ముందు పార్టీ జెండాలతో కార్యకర్తలు గుమికూడారు. ఫలితాల సరళిపై స్పష్టత రాగానే... అక్కడి నుంచి వెళ్లిపోయారు. చివరికి... సీఎం స్టాలిన్‌తో పాటు 14మంది మంత్రులూ పరాజయం పాలవడంతో డీఎంకే శిబిరంలో నిస్పృహ నెలకొంది.

ప్రతిపక్ష నేతగా ఉదయనిధి?

కొత్త శాసనసభలో ప్రధాన ప్రతిపక్ష హోదా డీఎంకేకు దక్కనుంది. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ పరాజయం పాలవడంతో ఆయన తనయుడు, ఉదయనిధి ప్రతిపక్షనేతగా వ్యవహరిస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. చేపాక్-ట్రిప్లికేన్ నియోజకవర్గంలో గెలిచిన ఉదయనిధి ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజా తీర్పును శిరసావహిస్తామని ప్రకటించారు. కొత్తగా పాలనా పగ్గాలు చేపట్టనున్న వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాలపై మంగళవారం స్టాలిన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరుగుతుందని తెలిపారు.

ఓట్లు రాబట్టే ఆకర్షణగల నాయకత్వం కరువు

సర్కారుపై పోరులో అన్నాడీఎంకే వెనుకబాటు

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): అధికార డీఎంకేపై అవినీతి ఆరోపణలు, ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతతో పాటు జాతీయ నేతల ప్రచారంతో మళ్లీ అధికారం దక్కించుకోవచ్చనుకున్న అన్నాడీఎంకే ఆశలు అడియాశలే అయ్యాయి. కరిష్మా వున్న నేత లేకపోవడం, పార్టీలో చీలికలే కొంప ముంచాయని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి పాలనాదక్షుడిగా పేరుంది. అన్నాడీఎంకేను చేజిక్కించుకోవడంలో ఆయన చూపిన చాణక్యత బహిరంగ రహస్యమే. దీనికితోడు ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, ఆరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వచ్చి తీవ్ర ప్రచారం చేశారు. అయినా, ఫలితాల్లో మార్పు లేకపోవడాన్ని ఆ పార్టీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో పళనిస్వామి కొంత వెనుకబడినట్లు భావిస్తున్నాయి.



అన్నాడీఎంకే కార్యాలయం వద్ద వెలవెల







టీవీకే విజయంతో చెన్నైలో ఆ పార్టీ కార్యకర్తల సంబరాలు, ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ధ్రువీకరణ పత్రాన్ని ప్రదర్శిస్తున్న విజయ్, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న టీవీకే కార్యకర్తలు

హిట్టు కొట్టారు!



అప్పుడు ఎన్టీఆర్.. నేడు విజయ్

అరంగేట్రంలోనే అద్భుత విజయాలు

ఎంజీఆర్ రికార్డూ చెరిపేసిన విజయ్

(చెన్నై - ఆంధ్రజ్యోతి)

'ఆరంభమే అదిరింది'... అనిపించడం కొందరికే సాధ్యం! నాడు... తెలుగునాట ఎన్టీఆర్ ఒక ప్రభంజనం సృష్టించారు! నేడు... తమిళనాట విజయ్ అదేస్థాయిలో ఆ రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పారు. నేటి విజయ్ గెలుపు... నాటి ఎన్టీఆర్ రాజకీయ అరంగేట్రాన్ని గుర్తుకు తెస్తోంది. తెలుగు తెరపై దశాబ్దాలపాటు తిరుగులేని కథానాయకుడిగా వెలిగిన ఎన్టీఆర్ 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేశారు. తెలుగువారి ఆత్మగౌరవమే ఆయన నినాదం! అప్పటికే కాంగ్రెస్ రాజకీయాలతో విసుగెత్తిపోయిన తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ ఒక తిరుగులేని ప్రత్యామ్నాయంగా కనిపించారు. 1983లో జనవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనం సృష్టించింది. ఉమ్మడి ఏపీలోని 275 స్థానాల్లో ఏకంగా 202 చోట్ల విజయం సాధించింది. విజయ్ 2024లో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ స్థాపించారు. ఆపై రెండేళ్లా 2నెలలకు ఎన్నికలు వచ్చాయి. అధికారం చేపట్టేందుకు అవసరమైన 'మ్యాజిక్ ఫిగర్'కు కాస్త దూరంగా నిలిచినప్పటికీ విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయమనే చెప్పవచ్చు.

ఎంజీఆర్ రికార్డు అధిగమించి...

డీఎంకే నుంచి విడిపోయిన ఎంజీఆర్ 1972 అక్టోబరు 17న అన్నాడీఎంకేను స్థాపించారు. 1977 జూన్‌లో అధికారం చేపట్టారు. ఆయనకు అధికారమెక్కేందుకు ఐదేళ్లు పట్టింది. 2024 ఫిబ్రవరిలో పార్టీని స్థాపించిన విజయ్.. రెండేళ్లలోనే అధికారం కైవశం చేసుకోవడం విశేషం. ఎంజీఆర్ పార్టీని ప్రారంభించి తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు 33.52 శాతం ఓట్లు సాధించారు. ఇప్పుడు టీవీకే 36 శాతానికి పైగా ఓట్లు సాధించడం విశేషం.

ఎందరో నట... నాయకులు

ఎన్టీఆర్ కంటే ముందే ఎంజీఆర్ రాజకీయ అరంగేట్రం చేశారు. తమిళ రాజకీయాలను కొత్త మలుపు తిప్పారు. జయలలిత ఆయన బాటలోనే నడిచారు. తర్వాత టి.రాజేందర్, విజయకాంత్, శరత్‌కుమార్, కార్తీక్ పార్టీలు స్థాపించినా, అధికారాన్ని చేజిక్కించుకోలేకపోయారు. 'సూపర్ స్టార్' రజనీకాంత్ రాజకీయాలపై ఒక అడుగు ముందుకూ, రెండడుగులు వెనక్కి అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు. కమల్ హాసన్ 'మక్కల్ నీది మయ్యం' పేరుతో పార్టీ పెట్టారు. తర్వాత డీఎంకేతో చేతులు కలిపి... రాజ్యసభకు ఎంపికయ్యారు. ఇక... మెగాస్టార్ చిరంజీవి 'ప్రజారాజ్యం' పార్టీ ఏర్పాటు చేసినా దాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేసి, కేంద్రమంత్రి అయ్యారు. పవన్ కల్యాణ్ 'జనసేన' పేరుతో పార్టీ ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల్లో పోటీ చేశారు కానీ, ఆయన పార్టీ తరపున ఒకే ఒక్కరు గెలిచారు. 2024లో ఎన్డీయే కూటమిలో భాగస్వామి అయ్యారు. 'వంద శాతం' స్ట్రైక్ రేట్‌తో సంచలనం సృష్టించారు. ఏపీ ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు.

శ్రుతి మించిన కుటుంబ పాలన

మంత్రుల తీరుతో సర్కారుకు చెడ్డపేరు


ఉదయనిధి వ్యాఖ్యలతో తలనొప్పులు

డీఎంకే పరాజయానికి కారణాలివే..

చెన్నై, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇబ్బడిముబ్బడిగా సంక్షేమ పథకాలు అమలుచేసినా, నగదు పంపిణీ చేసినా డీఎంకే ఘోరంగా ఎలా ఓడిపోయిందన్నది అంతుబట్టని ప్రశ్న. అయితే కొన్ని కీలకమైన అంశాల్లో డీఎంకే ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. సున్నితమనస్సు కలిగిన, ప్రజా సమస్యలపై తక్షణం స్పందించే నేతగా ముఖ్యమంత్రి స్టాలిన్‌కు పేరుంది. అయినా ఆయన ప్రభుత్వంలోని కొంత మంది మంత్రులపై వచ్చిన అవినీతి ఆరోపణలు ఆ పార్టీ పరాజయానికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. మద్యం విక్రయ దుకాణాలలో బాటిల్‌పై అదనంగా రూ.10 తీసుకోవడం, మద్యం కుంభకోణం, ఇసుక కుంభకోణం, ఉద్యోగాలు కల్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసినట్టు ఓ మంత్రిపై వచ్చిన అవినీతి ఆరోపణలు తీవ్ర ప్రభావం చూపాయి. ఇక మహిళలపై వరుస అత్యాచారాలు, శాంతిభద్రతల సమస్య చర్చకు దారితీశాయి. కుటుంబపాలన కూడా నేతలు, కార్యకర్తల్లో వెగటు పుట్టించింది. అధికారిక కార్యక్రమాల్లో స్టాలిన్ భార్య, అల్లుడు, కుటుంబసభ్యులు మితిమీరిన జోక్యం చేసుకున్నారన్న ఆరోపణలు రేగాయి. 'సనాతన ధర్మం కరోనా లాంటిది' అంటూ ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు ఆయనపై హిందూ వ్యతిరేకి ముద్రవేశాయి. సినీరంగంలోనూ ఉదయనిధి కుటుంబ పెత్తనం పెరిగింది. నిర్మాణం నుంచి డిస్ట్రిబ్యూషన్ వరకు ఆ కుటుంబం చేతుల్లోనే ఉన్నట్టు జరిగిన ప్రచారం ప్రతికూల ప్రభావం చూపింది.

కంచుకోటలో ఓడిన స్టాలిన్

చెన్నై, మే 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఓడిపోయారు. తనకు కంచుకోట అయిన కొళత్తూరు నియోజకవర్గం నుంచి బరిలోకి దిగిన ఆయన టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో 8,795 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. బాబు ఒకప్పుడు స్టాలిన్‌కు కుడిభుజంగా ఉండేవారు. 2011లో కొళత్తూరు నియోజకవర్గం ఏర్పడినప్పుడు స్టాలిన్‌ను అక్కడకు ఆహ్వానించి, ఆ ఎన్నికల్లో ప్రచారం చేపట్టి గెలిపించింది ఆయనే. అయితే అప్పట్లో స్టాలిన్‌కు 2వేల మెజారిటీ మాత్రమే రావడంతో ఆయన్ను పార్టీ దూరం పెట్టింది. ఆ తర్వాత అన్నాడీఎంలో చేరిన వీఎస్ బాబు.. అక్కడా సహకారం లేకపోవడంతో టీవీకేలో చేరి, తన పాత బాస్‌ను ఓడించారు. దీంతో ఎన్నికల్లో ఓడిపోయిన డీఎంకే తొలి అధ్యక్షుడిగా స్టాలిన్ అపఖ్యాతిని మూటకట్టుకున్నారు. 1996 తర్వాత స్టాలిన్ ఓడిపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.



వీఎస్ బాబు





నా భార్యపై నిందలు వేశారు

ఎన్నికల సమయంలో నా భార్యపై నిందలు వేయడం ద్వారా కాంగ్రెస్ నేత పవన్‌ఖేరా ఒక అస్సామీ మహిళను, తద్వారా మొత్తం రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీశారు.పవన్ ఖేరాతో వేదిక పంచుకున్నందుకే గౌరవ్ గోగోయ్ ఈ ఎన్నికల్లో ఓడిపోయారు. ఖేరాపై చర్యలు తప్పవు.



- హిమంత బిశ్వ శర్మ

వయనాడ్‌లో ఏడుకు ఏడూ!

మాపై నమ్మకం ఉంచినందుకు కేరళం ప్రజలకు ధన్యవాదాలు. మీ నమ్మకమే మమల్ని నడిపిస్తుంది. వచ్చే అయిదేళ్లలో నిబద్ధతతో పని చేస్తాం. వయనాడ్‌లో లోక్‌సభ పరిధిలోని ఏడు స్థానాలకు గానూ ఏడూ యూడీఎఫ్ గెలవడం సంతోషంగా ఉంది.



- ప్రియాంకా గాంధీ



కేరళం యూడీఎఫ్‌దే

పదేళ్ల ఎల్డీఎఫ్ పాలనలో అవినీతి, ఆర్థిక సంక్షోభం, కుంభకోణాలతో విసుగెత్తిపోయిన జనం

- కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమికి పట్టం
- 140 సీట్లకుగాను యూడీఎఫ్‌కు 102 సీట్లు
- 35 సీట్లతో సరిపెట్టుకున్న అధికార ఎల్డీఎఫ్

తిరువనంతపురం, మే 4: కమ్యూనిస్టుల కంచుకోట కేరళంలో.. కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ కూటమి గెలుపు జెండా ఎగరేసింది! పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న ఆ కూటమి సెంచరీ దాటేసి 102 సీట్లతో రాజకీయసునామీ సృష్టించింది!! అంతేనా.. కేరళలో ఎప్పుడో 2016 ఎన్నికల్లో ఒక్క సీటు సాధించిన భారతీయ జనతాపార్టీ పదేళ్ల తర్వాత ఇప్పుడు మూడు సీట్లలో గెలిచి సత్తా చాటింది. వరుసగా పదేళ్లపాటు అధికారంలో ఉన్న సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ కూటమి కేవలం 35 స్థానాలకు పరిమితమైంది!! రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నానాటికీ దిగజారడం.. ఆర్థిక వ్యవస్థ పూర్తిగా గాడితప్పడం, పెన్షన్ల పంపిణీ సైతం నెలల తరబడి ఆలస్యం కావడం.. ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలు, జరిగిన కుంభకోణాలు.. ఈ పరిణామాలన్నీ కలిసి విజయన్ పాలనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. వీటన్నింటికీ తోడు.. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో కఠినంగా వ్యవహరించి హిందువుల ఆగ్రహాన్ని.. క్రైస్తవుల ఓటు బ్యాంకు కోసం ప్రయత్నించి ముస్లింల ఆగ్రహాన్ని కూడ గట్టుకున్న ఎల్డీఎఫ్ కూటమి చిత్తుచిత్తుగా ఓడిపోయింది. చివరకు ఏ వర్గం ఓట్లు కూడా సాధించలేక చతికిలపడింది. మరో ఆసక్తికరమైన పరిణామం ఏమిటంటే.. కేరళం చరిత్రలో తొలిసారి బీజేపీ మూడు స్థానాల్లో (నేమోం, చాతన్నూర్, కాళకూటం అసెంబ్లీ నియోజకవర్గాల్లో) విజయం సాధించింది. కమలనాథులకు ఈ ఎన్నికల్లో కేరళంలో ఒక్క సీటు కూడా రాదంటూ కాంగ్రెస్, సీపీఎం నేతలు ప్రచార సమయంలో ఎద్దేవా చేసిన సంగతి తెలిసిందే. వారికి ఈ ఫలితాలే సమాధానమని బీజేపీ కేరళ చీఫ్ రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. ఆయన స్వయంగా నేమోం నియోజకవర్గం నుంచి గెలుపొందడం విశేషం. (2016లో కూడా బీజేపీ గెలిచింది ఈ నియోజకవర్గం నుంచే. అప్పట్లో బీజేపీ సీనియర్ నేత రాజగోపాల్ నేమోం నుంచి పోటీ చేసి గెలిచారు.) ఇక, చాతన్నూర్‌లో బీబీ గోపకుమార్, కాళకూటంలో కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్ విజయం సాధించారు. కాగా.. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ ఈ ఎన్నికల్లో కంజరప్పల్లి స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ధర్మదం నుంచి పోటీ చేసిన సీఎం పినరాయి విజయన్ ఈసారి 19,247 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఫలితాల వెల్లడి అనంతరం పినరాయి విజయన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.



కొచ్చిలో సంబరాలు చేసుకుంటున్న యూడీఎఫ్ మద్దతుదారులు



కేరళ తదుపరి సీఎం ఎవరు?

ముందు వరుసలో వీడీ సతీశన్.. మద్దతు పలికిన మిత్రపక్షం

తాము కూడా సిద్ధమేనంటున్న కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల

తిరువనంతపురం, మే 4: కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్(యూడీఎఫ్)కు ముఖ్యమంత్రి ఎంపిక సంక్లిష్టంగా మారనుందన్న సంకేతాలు వస్తున్నాయి. యూడీఎఫ్ కూటమి అధికారికంగా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించలేదు. కాంగ్రెస్ పార్టీ సంప్రదాయం ప్రకారం గెలుపొందిన ఎమ్మెల్యేలను సంప్రదించి పార్టీ హైకమాండ్ సీఎం పీఠంపై తుది నిర్ణయం తీసుకుని ప్రకటిస్తుంది. అయితే, కేరళలో కాంగ్రెస్ కూటమి విజయం దక్కించుకుంటుందన్న ఎగ్జిట్ పోల్ సర్వేల అనంతరం.. ముఖ్యమంత్రి పీఠంపై పలువురు నాయకులు ఆసక్తికర వ్యాఖ్యలు చేయడంతో.. ఈ వ్యవహారంపై చర్చ ఊపందుకుంది. వీరిలో వీడీ సతీశన్ ముందు వరుసలో ఉండగా... కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల వంటి సీనియర్ నాయకులు కూడా సీఎం సీటుపై ఆశలు పెట్టుకున్నారు.

వీడీ సతీశన్: గత ఐదేళ్లుగా అసెంబ్లీలో విపక్ష నాయకుడిగా వ్యవహరించిన వదస్సేరి దామోదరన్(వీడీ) సతీసన్.. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు వ్యతిరేకంగా బలమైన గళం వినిపించారు. యూడీఎఫ్ కూటమిలో తన స్థానాన్ని, పాపులారిటీని బలోపేతం చేసుకున్నారు. ఎగ్జిట్ పోల్స్‌లో సతీశన్‌ను బలమైన కాంగ్రెస్ నాయకుడిగా ప్రజలు పేర్కొనడం గమనార్హం. కాగా, యూడీఎఫ్ మిత్రపక్షం ఐయూఎంఎల్(ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్) సైతం సతీశన్‌కు మద్దతు పలుకుతోంది. నిజానికి ముఖ్యమంత్రి పీఠంపై ఆశలు పెట్టుకున్న చాలా మంది నాయకులు ముస్లిం లీగ్ మద్దతు కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి సమయంలో లీగ్ స్వయంగా సతీశన్‌కు దన్నుగా నిలవడం గమనార్హం.


రమేశ్ చెన్నితల: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతగా రమేశ్ చెన్నితలకు బలమైన మద్దతు ఉంది. అంతేకాదు.. పార్టీ నాయకులతోనూ ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో ఆయన ముఖ్యమంత్రి రేసులో ఉన్నానని ప్రకటించుకున్నారు. అయితే, సీఎం రేసులోకి కేసీ వేణుగోపాల్ సైతం దిగడంతో ఈ వ్యవహారం పార్టీకి సంక్లిష్టంగా మారుతోంది. అదేసమయంలో తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ పేరు కూడా సీఎం రేసులో వినిపిస్తున్నా.. ఈ చర్చకు ఆయన దూరంగా ఉన్నారు. పార్టీ అధినాయకత్వం దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇదిలావుంటే, కాంగ్రెస్ మిత్రపక్షం ఐయూఎంఎల్.. సతీశన్‌కు మద్దతు పలకడంపై కొందరు నేతలు పెదవి విరుస్తున్నారు. అంతర్గతంగా తీసుకునే నిర్ణయంపై.. బహిరంగ వ్యాఖ్యలు ప్రభావం చూపిస్తాయని పేర్కొంటున్నారు.

ఎల్డీఎఫ్ ఓటమికి ఎన్నో కారణాలు

పినరాయి సర్కారు అవినీతిపై వ్యతిరేకత



కర్ణుడి చావుకి కారణాలెన్నో అన్న సామెత చందంగా.. కేరళంలో ఎల్డీఎఫ్ కూటమి ఓటమికి కూడా చాలా కారణాలున్నాయి. అందులో ముఖ్యమైనవి.. విజయన్ సర్కారుపై వచ్చిన అవినీతి ఆరోపణలు, బంగారం స్మగ్లింగ్ కుంభకోణం.. దానికి పాల్పడినవారికి ఏకంగా సీఎంవోతోనే సంబంధాలు ఉండడం, శబరిమల బంగారు తాపడం కుంభకోణం, అయ్యప్ప గుడిలోకి మహిళల ప్రవేశంపై సుప్రీం తీర్పును అమలు చేయడానికి సిద్ధపడి హిందువుల ఆగ్రహానికి గురికావడం. వీటన్నింటికీ మించి.. క్రైస్తవుల ఓట్ల కోసం ఆశపడి ముస్లింల ఆగ్రహానికి గురికావడం మరో ప్రధాన కారణం. తమకు బలమైన ఓటుబ్యాంకుగా ఉన్న ముస్లిం మైనారిటీ వర్గాలను కలుపుకొని పోయే సీపీఎం, గత లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తన పంథా మార్చుకుంది. వారికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన నేతలను రాష్ట్ర మంత్రులే వెళ్లి కలవడం ముస్లింల్లో ఆగ్రహానికి కారణమైంది. ఉదాహరణకు.. కేరళలో యువతను నిర్వీర్యం చేయడానికి లవ్ జిహాద్‌ను, నార్కోటిక్ జిహాద్‌ను వాడుతున్నారంటూ పాలాయా బిషప్ మార్ జోసెఫ్ కల్లరంగట్ ఒక ప్రసంగంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సమయంలోనే.. రాష్ట్ర మంత్రి వి.ఎన్.వాసవన్ స్వయంగా వెళ్లి కలవడంతో ముస్లింల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇక, కేరళలోని శక్తిమంతమైన 'ఈళవ' సామాజికవర్గానికి చెందిన నాయకుడు, ఎస్ఎన్‌డీపీయోగం (శ్రీనారాయణ ధర్మ పరిపాలన యోగం) నాయకుడు వెల్లాపల్లి నటేశన్‌ను.. మంత్రి వాసవన్ తన కారులో స్వయంగా అయ్యప్ప సంగమాలకు తీసుకెళ్లడంతో.. ఆ పార్టీపై ముస్లింల్లో ఆగ్రహం మరింత పెరిగింది. ఈ అయ్యప్ప సంగమాల కథేమిటంటే.. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పుడు, పినరాయి సర్కారు దాని అమలుకు సిద్ధమైంది. దీనిపై హిందూ సంఘాలు, భక్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రూటు మార్చి వారికి దగ్గరయ్యేందుకు వెల్లాపల్లి నటేశన్‌ను వాడుకుంది. ఈ వ్యవహారమంతా ఆ పార్టీ ప్రాథమిక సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉండడంతో.. ముస్లిం ఓటర్లంతా కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ కూటమివైపు మొగ్గు చూపారు. గంపగుత్తగా ఓట్లు వేశారు. ఫలితమే ఈ ఘోర ఓటమి.



కేరళ- మొత్తం సీట్లు 140



తిరువనంతపురంలోని కేపీసీసీ కార్యాలయం వద్ద విజయోత్సవ సభలో కాంగ్రెస్ శ్రేణులు

పూర్వ వైభవాన్ని తీసుకొస్తాం

కేరళలో విజయంపై కాంగ్రెస్ అగ్రనేతల స్పందన

న్యూఢిల్లీ, మే 4: కేరళలో పదేళ్ల దుష్టపాలనను ప్రజలు తిరస్కరించారని, యూడీఎఫ్ పాలనలో రాష్ట్రానికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని ఏఐసీసీ తెలిపింది. రాష్ట్రంలో నిజమైన సంక్షేమం, ఆర్థిక ప్రగతి యూడీఎఫ్ హయాంలో ప్రారంభం కాబోతున్నాయని తెలిపింది. కేరళలో మార్పును కోరుకుంటూ ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కేరళ ఓటర్ల నమ్మకమే యూడీఎఫ్‌కు మార్గదర్శిగా ఉంటుందంటూ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా వాద్రా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కేరళలో ప్రజా ప్రభుత్వం ద్వారా సుపరిపాలన అందిస్తామంటూ ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

యూడీఎఫ్ విజయం ఊహించిందే

కేరళంలో యూడీఎఫ్ కూటమి గెలుపు అనూహ్యమైనది కాదు. ఈ విజయం.. చాలా మంది రాజకీయ విశ్లేషకులు ఊహిస్తున్నదే. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు.. 2025లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలో పినరాయి సర్కారుకు ఓటర్లు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 20 లోక్‌సభ స్థానాల్లో.. యూడీఎఫ్ కూటమికి ఏకంగా 18 స్థానాలు కట్టబెట్టారు. అధికార ఎల్డీఎఫ్‌కు కేవలం ఒకే ఒక్క స్థానం ఇచ్చారు. ఎన్డీయే కూటమిలో బీజేపీ నుంచి ఒకరు గెలుపొందారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల విషయానికి వస్తే.. 2025 డిసెంబరులో రెండు దశల్లో గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో యూడీఎఫ్ కూటమి అన్ని చోట్లా సత్తా చాటింది. 505 గ్రామ పంచాయతీలను, 54 మునిసిపాలిటీలను, నాలుగు కార్పొరేషన్లను యూడీఎఫ్ గెలుచుకోగా.. ఎల్డీఎఫ్ 340 గ్రామ పంచాయతీలు, 28 మునిసిపాలిటీలు, ఒక్క కార్పొరేషన్‌కు పరిమితమైంది. కానీ, విజయన్ సర్కారు ఆ ఓటముల నుంచి ఎలాంటి పాఠాలూ నేర్చుకోలేదు సరికదా.. ప్రభుత్వ వ్యతిరేకత ఏమీ లేదన్న అతి విశ్వాసంతో.. విజయన్ 3.0 సర్కారు లోడ్ అవుతోందంటూ విస్తృత ప్రచారంతో ఎన్నికలకు వెళ్లి బొక్కబోర్లా పడింది.

బీజేపీ నెగ్గింది 3 స్థానాలే.. ఓట్లు 11.42%


ఈ ఎన్నికల్లో బీజేపీ నెగ్గింది మూడు చోట్లే అయినప్పటికీ.. 22 సీట్లు గెలిచిన ఐయూఎంఎల్ కన్నా (11.01%) ఎక్కువగా 11.42% ఓట్లు సాధించడం గమనార్హం. నిజానికి బీజేపీ కొన్నేళ్లుగా కేరళలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిస్సూర్ నుంచి సురేశ్ గోపి బీజేపీ తరపున తొలిసారిగా గెలిచారు. ఆ పార్టీ ఓట్ షేర్ 2019లో 15.64% నుంచి 2024లో 19.24 శాతానికి చేరింది. ఈ ఎన్నికల్లో 11.42 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఓట్ షేర్ తగ్గినప్పటికీ.. ఆ ఎన్నికల్లో మోదీ ఫ్యాక్టర్ పనిచేసిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇక, స్థానిక సంస్థల ఎన్నికలపైనా ఫోకస్ చేసిన కమలనాథులు తిరువనంతపురం కార్పొరేషన్‌ను, 25కు పైగా గ్రామ పంచాయితీలను కూడా గెలుచుకున్నారు. రాష్ట్రమంతటా కాకుండా హిందువులు మెజారిటీగా ఉన్న కొన్ని నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టి బలాన్ని పెంచుకుంటున్నారు. త్రిసూర్, కాసరగోడ్, తిరువనంతపురం తదితర జిల్లాల్లో పుంజుకున్నారు. అలాగే రాష్ట్రంలో 18.38% శాతం ఉన్న క్రైస్తవులకు దగ్గరవుతూ వారి మద్దతు కూడగడుతున్నారు.

హిమంత మ్యాజిక్!

అస్సాం ఎన్నికల్లో ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ మ్యాజిక్ బాగా పనిచేసింది. వరుసగా రెండోసారి ఆయన ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించనున్నారు. బీజేపీ నేతృత్వంలో ఎన్డీయే కూటమికి అస్సాంలో ఇది హ్యాట్రిక్ విజయం. ఒకప్పుడు కాంగ్రెస్ నేతగా ఉన్న ఆయన ఇప్పుడు బీజేపీ విజయంలో కీలకపాత్ర పోషించారు. 2015లో హిమంత కాంగ్రెస్ నుంచి బయటికి రావడం.. 2016 నుంచి బీజేపీ గెలుపులో కీలకంగా మారింది. అక్రమ వలసలు, సంక్షేమ పథకాలు తదితర స్థానిక అంశాలపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలో వ్యూహాత్మకంగా దృష్టి కేంద్రీకరించడం అస్సాంలో బీజేపీ బలం పెరగడంలో కీలకపాత్ర పోషించింది. 2016 ఎన్నికలకు కొద్దికాలం ముందు మాత్రమే అస్సాంలో బీజేపీ ఎదుగుదల మొదలైంది. 1979-85 మధ్య బంగ్లాదేశ్ అక్రమ వలసదారులకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమం బీజేపీ పట్టును పెంచింది. ఐఎండీటీ చట్టాన్ని రద్దు చేస్తామని, ఎన్ఆర్‌సీని అప్‌డేట్ చేస్తామనే హామీలతో అస్సాం ప్రజలకు ఆ పార్టీ చేరువైంది. ఇక, 2014లో అక్రమ చొరబాట్లపై ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు ఎగువ అస్సాంలోనూ, బెంగాలీ హిందువుల్లోనే బీజేపీ బలాన్ని బాగా పెంచింది. ఆ తర్వాత 2015లో హిమంత బిశ్వ శర్మ పార్టీలో చేరడం.. 2016లో బీజేపీ గెలుపులో, 2021లో అధికారాన్ని నిలబెట్టుకోవడంలో కీలకంగా మారింది. అభివృద్ధి పథకాలు, నియోజకవర్గాల పునర్విభజన, వలస వ్యతిరేక ఉద్యమాలు.. హిందువుల, గిరిజనుల ఓట్లను గంపగుత్తగా బీజేపీకి దక్కేలా చేశాయి.

హిమంత నేతృత్వంలో గెలుపు గాలి

అస్సాంలో బీజేపీ ఆధిక్యం పెరగడంలో హిమంత బిశ్వ శర్మ కీలక వ్యక్తిగా నిలిచారు. ఒకప్పుడు కాంగ్రెస్‌లో కీలకంగా ఉన్న ఆయన.. తర్వాత బీజేపీ ముఖ్య వ్యూహకర్తగా మారి ముఖ్యమంత్రి అయ్యారు. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో కొనసాగిన హిమంతకు మంత్రిగా పనిచేసిన అనుభవం, కార్యకర్తల మద్దతు భారీగా ఉంది. దీంతో 2015లో ఆయన బీజేపీలోకి రావడం ఆ పార్టీకి బాగా కలిసొచ్చింది. ఆయన మార్గదర్శంలో అమలు చేసిన ప్రచార వ్యూహంతో తొలిసారిగా 2016 ఎన్నికల్లో బీజేపీ 60 సీట్లు గెలుపొందింది. ఏజీపీ వంటి ప్రాంతీయ పార్టీలతో సమన్వయంలోనూ కో-కన్వీనర్‌గా హిమంత చేసిన కృషి ఫలించి ఎన్డీయే 87 స్థానాల్లో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక 2021 ఎన్నికల సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన హిమంత.. పార్టీ అధికారాన్ని నిలబెట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించారు..



అసోం (126/126) పార్టీ	సీట్లు 2026	సీట్లు 2021	సీట్లు +/-	ఓట్లు (%) 2026	ఓట్లు (%) 2021
బీజేపీ+	102	75	+27	51	44.51
కాంగ్రెస్+	21	50	-29	36	43.68
ఇతరులు	3	1	+2	13	11.81

అసోంలో తీన్‌మార్!

ఈశాన్య రాష్ట్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి బీజేపీ

గువహటి, మే 4: ఈశాన్య రాష్ట్రమైన అసోంలో మరోసారి బీజేపీ గుబాళించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను నిజం చేస్తూ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి హ్యాట్రిక్ కొట్టింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన స్థానాలకు మించి ఓట్లు, సీట్లు సాధించి విజయ దుందుభి మోగించింది. మొత్తంగా 126 అసెంబ్లీ స్థానల్లో 101 సీట్లలో ఎన్డీయే కూటమి గెలుపొందింది. సీఎం బిశ్వశర్మ జలుక్‌బారి నియోజకవర్గం నుంచి ఆరోసారి ఎన్నికయ్యారు. తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి బిదిషా నియోగ్‌పై ఆయన 89,434 ఓట్ల అధిక్యంతో ఘన విజయం సాధించారు. బీజేపీ, అసోం గణపరిషత్ (ఏజీపీ), బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీఆర్ఎఫ్) కూటమి అయిన ఎన్డీయే అప్రతిహత ఆధిక్యాన్ని కనబర్చింది. బీజేపీ 90 స్థానాల్లో, ఏజీపీ 26 స్థానాల్లో, బోడోలాండ్ 11 స్థానాల్లో పోటీచేశాయి. బీజేపీ 81 స్థానాల్లో విజయం సాధించగా, ఏజీపీ, బీఆర్ఎఫ్ 10 సీట్ల చొప్పున కైవసం చేసుకున్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని అసోం సమ్మిళిత్ మోర్చా (ఏఎస్ఎం) 21 సీట్లకే పరిమితమైంది. 99 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 19 మాత్రమే గెలుచుకుంది. కాగా అసోంలో 15ఏళ్ల కాంగ్రెస్ పాలనకు తెరదించుతూ 2016లో బీజేపీ కూటమి విజయం సాధించింది. అప్పట్లో సర్బానంద సోనోవాల్ సీఎం అయ్యారు. 2021లోనూ ఆ పార్టీ కూటమి విజయం సాధించింది.

కలిసొచ్చిన 'అరుణోదయ'

ఒంటరి మహిళలు, విడాకులు తీసుకున్న మహిళలు, దివ్యాంగులైన మహిళలు, 45 ఏళ్లు నిండిన అవివాహిత మహిళలకు నెలకు రూ.1250 చొప్పున సాయం అందించేందుకు ప్రవేశపెట్టిన 'అరుణోదయ' పథకాన్ని హిమంత ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుండటం బీజేపీకి బాగా కలిసొచ్చింది. ఈ పథకం ద్వారా 38లక్షల మంది మహిళలు లబ్ధిపొందుతున్నారు. ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో 1.6 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడంతో యువత ఆ పార్టీవైపే నిలిచారు. రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తామని, బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలను అరికడతామనే హామీలు జనాల్లోకి బలంగా వెళ్లాయి. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న 1281 మదర్సాలను మార్చేసి వాటిని ప్రాథమిక విద్యాశాఖ పరిధిలోకి తీసుకురావడం, బహిరంగ ప్రదేశాల్లో బీఫ్ విక్రయాలను, తినడాన్ని నిషేధించడం వంటి చర్యలు మెజారిటీ వర్గం ఓటర్లపై సానుకూల ప్రభావం చూపాయి. కాగా, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ గౌరవ్ గొగోయ్ ఘోర పరాజయాన్ని చవిచూశారు. జోర్హాట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి హితేంద్ర నాథ్ గోస్వామి చేతిలో 23,182 ఓట్ల తేడాతో ఓడిపోయారు.



అసోంలో బీజేపీ నేతల సంబరాలు

కాంగ్రెస్‌కు అసమ్మతి దెబ్బ

అసోం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన భూపేన్ బోరా ఎన్నికలకు కొన్నినెలల ముందు బీజేపీలోకి మారారు. ఆయన మాదిరిగానే కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు బీజేపీలోకి వెళ్లడం ఆ పార్టీ అవకాశాలను దెబ్బతీసింది. టికెట్ల కేటాయింపులో గందరగోళం, మిత్రపక్షాలతో సమన్వయలోపం, మైనారిటీ ఓట్లలో చీలిక, నియోజకవర్గాల పునర్విభజన ఫలితంగా మారిన ఓట్ల సమీకరణాలు ఆ పార్టీకి శరాఘాతంగా పరిణమించాయి. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా ఫలితాలు శాసించేలా ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల సంఖ్య 35 నుంచి 25కు తగ్గిందని, ఫలితంగా కాంగ్రెస్, ఏఐయూడీఎఫ్ అవకాశాలు దెబ్బతిన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.